www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

'టోలు' తీస్తున్న ఆర్టీసీ

అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో టికెట్ రేట్లు రూ.10 పెంపు

ఇప్పటికే టోల్ గేట్లు ఉన్న మార్గాల్లో ఒక్కో టోల్‌గేటుకు రూ.10చొప్పున అదనంగా వసూలు

తాజాగా హేతుబద్ధీకరణ పేరిట అన్ని ఎక్స్‌ప్రెస్‌ల్లో పెంపు

కూర్చోవడానికి సీట్లే లేవంటే చార్జీలు పెంచడం ఏంటని మండిపడుతున్న ప్రయాణికులు 14



కరీంనగర్ నుంచి పెద్దపల్లికి టికెట్

గురువారం | 19-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 81

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: అష్టమి ఉ.11:56 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.11:17 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.9:32-11:04; దుర్ముహూర్తం: ఉ.10:06-10:58, మ.3:19-4:11; అమృతఘడియలు: సా.6:42-8:13; రాహుకాలం: మ.1:30-3:00; సూర్యోదయం: 5:45; సూర్యాస్తమయం: 6:47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై మీడియాకు వీడియోలు చూపుతున్న సీఎం రేవంత్

బనకచర్ల పాపం కేసీఆర్‌దే

కేసీఆర్ పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ఉంటే కనీసం 290 టీఎంసీలైనా వాడుకునే వాళ్లం. పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్, హరీశ్ తెలంగాణకు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. చంద్రబాబు ముచ్చుమర్రి కడుతుంటే మూసుకు కూర్చుంది కేసీఆర్ కాదా? ఇదే అవకాశంగా తీసుకుని కృష్ణా బేసిన్ కొల్లగొట్టారు. అదే ఊపుతో ఇప్పుడు గోదావరి బేసిన్‌కు వచ్చారు. కేసీఆర్.. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేంటి?

- ముఖ్యమంత్రి రేవంత్

తెలంగాణకు తీరని ద్రోహం చేశారు

2016, 2019లో చంద్రబాబు, జగన్‌తో భేటీల్లో ఈ ప్రాజెక్టుకు ఆయనే మార్గం సుగమం చేశారు

రాయలసీమను రతనాలసీమగా చేస్తానంటూ పెద్దన్నగా సహకరిస్తానంటూ హామీనిచ్చారు

ఇప్పుడేమో ప్రాజెక్టుపై మాట్లాడట్లేదంటూ మాపై బురద!

ఈ ప్రాజెక్టుతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగితే ఆ పాపం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావుదే

తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి

మోదీ వద్ద పలుకుబడి ఉన్నా బాబుకు అనుమతులు భ్రమే

'గోదావరి-బనకచర్ల'పై మీడియాతో సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పాపానికి పునాది వేసిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని.. రాష్ట్రానికి ఆయన తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుపై చర్చించేందుకు బుధవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్.. భేటీ ముగిశాక సచివాలయంలోనే ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం, తీరని ద్రోహం జరిగితే.. ఆ విషయంలో శిక్షించి, ఉరి తీయాల్సింది కేసీఆర్, హరీశ్‌రావునేనని ధ్వజమెత్తారు. వారు ఏనాడూ

మిగతా 13వ పేజీలో...

13

చివరి అస్త్రంగా న్యాయపోరాటం

బనకచర్లపై తెలంగాణ సర్కారుకు అఖిలపక్షం మద్దతు

ఈ ప్రాజెక్టు కడితే ఏపీ నీటి హక్కులు కోల్పోయే ప్రమాదం

ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్

కలిసికట్టుగా పోరాడుదాం: బీజేపీ ఎంపీలు

రాజకీయాలొద్దు.. వాకౌట్ చేస్తున్నా: ఎంపీ వద్దిరాజు

హైటెక్ సిటీలో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్

ఆసియా పసిఫిక్‌లో మొదటిది.. ప్రపంచంలో ఐదోది

ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు

నేడు ఢిల్లీకి సీఎం.. కేంద్ర మంత్రులతో భేటీ

రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

పార్టీ ముఖ్య నేతలతో త్వరలో కేసీఆర్ కీలక భేటీ

టోల్ పాస్..

ఒకేసారి రూ.3 వేలు చెల్లిస్తే..

ఏడాది గడువు లేదా 200 ట్రిప్పులకు అనుమతి

కొత్తగా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్

సగటున ఒక్కో టోల్‌ప్లాజాకు రూ.15తో సరి!

ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి

వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాలకే..: గడ్కరీ



న్యూఢిల్లీ, జూన్ 18: జాతీయ రహదారులపై తరచూ ప్రయాణం చేసే వాహనదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. టోల్ చార్జీల నుంచి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో నాన్ కమర్షియల్ ప్రైవేట్ వాహనాల కోసం ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి వస్తుంది. ఈ వార్షిక పాస్ ధరను రూ. 3 వేలుగా నిర్ణయించింది. యాక్టివేట్ అయిన తేదీ నుంచి ఏడాది కాలం లేదా 200 ట్రిప్పుల వరకు (ఏది ముందు పూర్తయితే అది) పాస్ చెల్లుబాటు అవుతుంది. ఫాస్టాగ్ ఆధారిత పాస్ వివరాలను కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇబ్బందుల్లేని జాతీయ రహదారి ప్రయాణం కోసం ఓ ముందడుగు వేశామని ఆయన చెప్పారు. ఈ పాస్‌ను వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాలు.. అంటే కార్లు, జీపులు, వ్యాన్లు మొదలగు వాటి కోసమే ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్నామని

మిగతా 2వ పేజీలో...

హిందీపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర

తృతీయ భాషగా తప్పనిసరి కాదని వెల్లడి 2

నా.. అనుకున్న వారే హంతకులు!

ప్రియుడితో మాట్లాడుతుంటే మందలించాడని తల్లితో కలిసి తండ్రిని చంపిన కుమార్తెలు

తాడుతో కాళ్లూచేతులు కట్టేసి కొట్టి హత్య

వారికి కూతురి ప్రియుడు, బంధువుల సాయం

భూమి అమ్మనివ్వట్లేదని తండ్రిని చంపిన కొడుకు

భూవివాదంలో అన్నయ్యను చంపిన తమ్ముళ్లు

రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు 14


సురేశ్ రెడ్డి (ఫైల్)

కవర్ కట్టుకుని, హీలియం పీల్చి బలవన్మరణం

పని ఒత్తిడి తట్టుకోలేక చార్టర్డ్ అకౌంటెంట్ ఆత్మహత్య

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘటన

'కబుర్ల దేవత'కు బాల సాహిత్య అవార్డు

బాలసాహిత్యంలో 50 ఏళ్లకుపైగా గంగిశెట్టి శివకుమార్ కృషి 3

మైరావణ నవలకు యువ పురస్కారం

పాతికేళ్లకే 3 నవలలు రాసిన ప్రసాద్ సూరి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల ప్రకటన

మన టైమ్ వచ్చింది!

ఇకపై భారత ప్రామాణిక సమయాన్ని పాటించడం తప్పనిసరి



త్వరలో మార్గదర్శకాలు నోటిఫై చేస్తాం: కేంద్రం

ప్రస్తుతం విదేశీ వ్యవస్థలే ఆధారం 2




మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్..

రవి, అరుణ మృతి

ఇద్దరూ మావోయిస్టు అగ్రనేతలే..

మరో నక్సల్ అంజూ కూడా మృతి

కగార్ దాడులతో అల్లూరి జిల్లాలోకి రాక

మూడుసార్లు తప్పించుకున్న రవి, అరుణ

డ్రోన్లతో జాడ తెలుసుకొని ఎన్‌కౌంటర్

నాడు ప్రభుత్వంతో చర్చల బృందంలో రవి

వరంగల్‌లో ఆర్ఎస్‌యూ నేతగా మొదలై కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన రవి

చింతూరు/రంపచోడవరం, పాడేరు, చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దళపతి నంబాల కేశవరావును, సీనియర్ నాయకులను వరుస ఎన్‌కౌంటర్లలో కోల్పోయి కుదేలైన మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ ఉదయ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మరో అగ్ర నాయకురాలు, ఏవోబీ కమిటీ సీనియర్

మిగతా 3వ పేజీలో...

ట్యాపింగ్‌కు అనుమతించారా?

ఎస్ఐబీ ఇచ్చిన ఫోన్ నంబర్ల జాబితాను పరిశీలించారా?

డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ అనిల్‌కుమార్‌కు సిట్ ప్రశ్నలు

ఎస్ఐబీ చీఫ్ హోదాలో ప్రభాకర్‌రావు లేఖతోనే అనుమతిచ్చామన్న ఉన్నతాధికారులు

ప్రభాకర్‌రావు బృందం తప్పుడు సమాచారంతో ట్యాపింగ్ కోసం అనుమతిపొందినట్టు నిర్ధారణ


మరోసారి ప్రణీత్‌రావు విచారణ

ట్యాపింగ్ బాధితుల వాంగ్మూలాలు నమోదు

ట్యాపింగ్ బాధితుల్లో వైఎస్ షర్మిలతోపాటు పలువురు వైసీపీ నేతలు

22న ప్రభాకర్‌రావును విచారించనున్న సిట్

ముగ్గురు బీజేపీ ఎంపీల వాంగ్మూలాల కోసం సిట్ అధికారుల యత్నం



హైదరాబాద్/మల్కాజిగిరి/నార్సింగ్/వికారాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక మలుపు తిరుగుతోంది. ఈ వ్యవహారంలో కీలకమైన ఉన్నతాధికారుల నుంచి సిట్ అధికారులు కొంత సమాచారాన్ని సేకరించారు. ఉప ఎన్నికల సమయంలో, అసెంబ్లీ సాధారణ ఎన్నికల సమయంలో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని ఎస్ఐబీ బృందం ట్యాపింగ్ కోసం సుమారు 618 ఫోన్ నంబర్లను రివ్యూ కమిటీ ముందు పెట్టి, అనుమతి తీసుకున్నట్టు సిట్ గుర్తించింది. దీంతో ఆ రివ్యూ కమిటీ సభ్యులు అప్పటి హోంశాఖ కార్యదర్శి, ప్రస్తుత డీజీపీ జితేందర్, అప్పటి ఇంటెలిజెన్స్ విభాగం చీఫ్ అనిల్‌కుమార్‌కు సిట్ అధికారులు కొన్ని ప్రశ్నలతో కూడిన లేఖను పంపి, సమాధానాలు రాబట్టారు. 'ఎస్ఐబీ నుంచి వచ్చిన ఫోన్ నంబర్లపై మీరు పరిశీలన (వెరిఫై) చేస్తారా? అలాంటి యంత్రాంగం ఏదైనా ఉందా? ఫోన్లను ట్యాప్ చేసిన తర్వాత రివ్యూ కమిటీ అనుమతి కోరారా? ముందే అనుమతి

మిగతా 14వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్ ముమ్మాటికీ నిజం

నా ఫోన్ రికార్డు ఆడియోను అప్పట్లో వైవీ వినిపించారు

కేటీఆర్, కేసీఆర్‌తో జగన్‌కు ఉన్న సంబంధం ముందు రక్తసంబంధం కూడా చిన్నబోయింది 14

వెల్లకి ఏ అన్నా చేయనన్ని ఘోరాలు చేసిన జగన్: షర్మిల


జీ7 సదస్సులో కెనడా ప్రధాని కార్నీతో మోదీ

ఉగ్రవాదంపై రెండు నాల్కలు!

టెర్రరిజానికి మద్దతిచ్చే వారికి రివార్డులా?

అగ్రదేశాలపై విసుర్లు

ఉగ్రవాదానికి ఊతమిచ్చే వారికి శిక్ష పడాల్సిందే

జీ7 సదస్సులో మోదీ

ఆయా దేశాధినేతలతో భేటీ

యుద్ధం నేనే ఆపా!

భారత్ వైపు ప్రధాని నరేంద్ర మోదీ, పాక్ వైపు ఆర్మీ చీఫ్ మునీర్ సమర్థంగా పనిచేశారు 2

కాల్పుల విరమణతో అమెరికాకు సంబంధం లేదని ట్రంప్‌కు మోదీ స్పష్టం చేసిన తర్వాత వ్యాఖ్య

పాక్ అభ్యర్థిస్తేనే ఆపరేషన్ ఆపామన్న మోదీ

వాణిజ్యం, మధ్యవర్తిత్వంపై అమెరికాతో చర్చే లేదని వెల్లడి

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఫోన్లో మాటామంతీ

అమెరికాకు రావాలన్న ట్రంప్ ఆహ్వానానికి తిరస్కృతి

షెడ్యూల్ ప్రకారం క్రొయేషియాకు వెళ్లనున్నట్టు వెల్లడి



భారత్‌లో ఫాల్కన్ వాణిజ్య

విమానాల తయారీ

రిలయన్స్ ఇన్‌ఫ్రాతో దసో ఒప్పందం

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఫాల్కన్-2000 విమానాల ఉత్పత్తి 2

ఇవి తయారు చేసే ఐదో దేశం భారత్

2028 నాటికి తొలి విమానం సిద్ధం

నాలుగెకరాల్లోపు రైతులకు

భరోసా నిధులు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకంలో భాగంగా బుధవారం నాలుగెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు ప్రభుత్వం నగదు బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6.33 లక్షల మంది రైతులకు రూ.1,313.53 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో ఇప్పటిదాకా రూ.5,215.26 కోట్లు బదిలీ చేసినట్లయింది. గురువారం ఐదెకరాల వరకు ఉన్న రైతులకు భరోసా నిధులు విడుదల చేసే అవకాశాలున్నాయి.

టెహ్రాన్‌పై నిప్పుల వాన

50 యుద్ధ విమానాలతో విరుచుకుపడిన ఇజ్రాయెల్

మిలటరీ, ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసం

ఐఆర్‌జీసీ అనుబంధ వర్సిటీ కూడా

అణు కేంద్రంలో.. సెంట్రీఫ్యూజ్ తయారీ యూనిట్ ధ్వంసం

మూడు హెలికాప్టర్లను కూల్చాం: ఐడీఎఫ్

మూడు విమానాల్లో ఒమన్‌కు చేరుకున్న ప్రభుత్వాధికారులు

యుద్ధం మొదలైంది: ఖమేనీ

అమెరికాను హెచ్చరించిన సుప్రీంలీడర్

ఇరాన్ లొంగేది లేదని స్పష్టీకరణ

గుడ్ లక్.. అన్న అమెరికా అధ్యక్షుడు

ఖమేనీ లొంగిపోవడమే మంచిదన్న ట్రంప్

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులు కొనసాగింపు

ఒక్క రాత్రి రక్షణ వ్యవస్థకు ఇజ్రాయెల్ చేస్తున్న ఖర్చు రూ.2,400 కోట్లు


ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో కమ్ముకున్న పొగ

టెహ్రాన్/టెల్‌అవీవ్/న్యూఢిల్లీ, జూన్ 18: ఇరాన్ రాజధాని టెహ్రాన్ బుధవారం దద్దరిల్లింది. ఇజ్రాయెల్ వైమానిక దళాలు 50కిపైగా యుద్ధ విమానాలతో తెల్లవారుజాము నుంచే నగర వ్యాప్తంగా క్షిపణి దాడులతో నిప్పుల వర్షం కురిపించింది. ఇరాన్ అణు కార్యక్రమాలను టార్గెట్‌గా చేసుకున్న ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) టెహ్రాన్ శివార్లలోని రెండు 'సెంట్రీఫ్యూజ్'ల తయారీ కేంద్రాలపై విరుచుకుపడింది. అణు కార్యక్రమాలకు సెంట్రీఫ్యూజ్‌లు అత్యంత కీలక పరికరాలు. యురేనియం-238ను ప్రాసెస్ చేయగా వచ్చే

మిగతా 2వ పేజీలో...

హిందీ బోధనపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర

» మూడో భాషగా ఇతర భారతీయ భాష ఎంపికకు అవకాశం

న్యూఢిల్లీ, జూన్ 18: ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడో భాషగా హిందీని తప్పనిసరి చేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీనిపై ప్రతిపక్షాల నుంచి, మరాఠీల నుంచి వ్యతిరేకత రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో హిందీ తప్పనిసరిగా బోధించాలన్న నిబంధనను తొలగించింది. ఈ మేరకు మహారాష్ట్ర పాఠశాల విద్యాశాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. త్రిభాషా విధానంలో విద్యార్థులు తమ మూడో భాషగా హిందీకి బదులు ఏదైనా భారతీయ భాషను ఎంచుకునే అవకాశం కల్పించింది. అయితే ఆ భాషను నేర్చుకోవాలనుకునే వారు తరగతిలో కనీసం 20 మంది ఉండాలని, అప్పుడే ఆ భాషను పాఠశాలలో బోధిస్తామని స్పష్టం చేసింది. ఒకవేళ విద్యార్థులు అంతకన్నా తక్కువ ఉంటే ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తామని పేర్కొంది. జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి.

భారత్‌లో ఫాల్కన్ వాణిజ్య జెట్ల తయారీ

» రిలయన్స్ ఇన్‌ఫ్రా-దసో మధ్య కీలక ఒప్పందం

పారిస్, న్యూఢిల్లీ, జూన్ 18: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రా, ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ సంస్థ సంయుక్తంగా బిజినెస్ జెట్ విమానాల నిర్మాణం చేపట్టనున్నాయి. ఫాల్కన్-2000 జెట్లను తొలిసారి ఫ్రాన్స్‌కు బయట ఉత్పత్తి చేయనున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో వీటి నిర్మాణం జరగనుంది. రెండు కంపెనీల మధ్య జాయింట్ వెంచర్ 2017లోనే కుదరగా పారిస్‌లో తాజా కీలక ఒప్పందం కుదిరింది. ఇప్పటివరకు అమెరికా, ఫ్రాన్స్, కెనడా, బ్రెజిల్ మాత్రమే బిజినెస్ జెట్ విమానాల నిర్మాణం చేస్తుండగా ప్రస్తుతం ఐదో దేశంగా భారత్ నిలవనుంది. రెండు ఇంజిన్లుండే ఫాల్కన్-2000 బిజినెస్ జెట్‌లో 8 నుంచి పది మంది ప్యాసింజర్లు ప్రయాణించవచ్చు. దసో ఏవియేషన్ సంస్థ ఇప్పటివరకు 2700 ఫాల్కన్‌లతో పాటు మొత్తం 10 వేల సైనిక, పౌర విమానాలను 90 దేశాలకు సరఫరా చేసింది. భారత్‌లో తొలి ఫాల్కన్-2000 జెట్ విమానం 2028 నాటికి సిద్ధం కావొచ్చని అంచనా. ఇందుకోసం వందల మంది ఇంజినీర్లను, టెక్నీషియన్లను రిక్రూట్ చేసుకోనున్నారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కుట్ర కోణం?

» తోసిపుచ్చలేమన్న దర్యాప్తు అధికారులు

అహ్మదాబాద్, జూన్ 18:: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై భిన్న కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) నేతృత్వంలో గుజరాత్ పోలీసులు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) సంయుక్తంగా విచారణ చేపట్టాయి. మరోవైపు అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు దీనికి సమాంతరంగా స్వతంత్ర దర్యాప్తును ప్రారంభించింది. టేకాఫ్ అయిన తర్వాత క్షణాల వ్యవధిలోనే విమానం కుప్పకూలడం వెనుక ఏం జరిగి ఉంటుందనే కోణంలో అధికారులు కూపీ లాగుతున్నారు. ఇందులో కుట్ర కోణాన్ని కూడా తోసిపుచ్చలేమని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం ప్రచురించింది. ప్రమాదం జరిగిన సమయంలో గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బందిని ప్రశ్నించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. అలాగే విమానం టేకాఫ్ కోసం క్లియరెన్స్ ఇచ్చిన కీలక సిబ్బంది ఫోన్లను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయ ప్రాంగణంలోని సీసీ టీవీ ఫుటేజీని సేకరించారు. ఇదిలా ఉండగా, అహ్మదాబాద్‌కు చెందిన వ్యాపారి రాజేశ్ పటేల్ (57)... ప్రమాదం జరిగిన స్థలం నుంచి సేకరించిన దాదాపు 70 తులాల బంగారు ఆభరణాలు, 8 నుంచి 10 వెండి వస్తువులు, రూ.50వేల నగదు, 20 అమెరికన్ డాలర్లతో పాటు కొన్ని పాస్‌పోర్టులను పోలీసులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు.

ఇకపై 15 రోజుల్లోనే ఓటరు కార్డుల జారీ: ఈసీ

న్యూఢిల్లీ, జూన్ 18: ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకున్న 15 రోజుల్లోనే ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేసేలా ఎన్నికల సంఘం నూతన ప్రక్రియను ప్రవేశపెట్టింది. కొత్తగా తమ పేర్లను నమోదు చేసుకున్న వారితో పాటు, పాత వాటిల్లో వివరాలు మార్చుకున్న వారికి కూడా దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఓటరు కార్డుల జారీకి నెల రోజులకు పైగా సమయం పడుతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఆ సమయాన్ని సగానికి పైగా తగ్గించాలని నిర్ణయించింది. పేర్ల నమోదు నుంచి కార్డుల జారీ వరకు ఉన్న ప్రతి దశను తక్షణ పర్యవేక్షణ చేయనున్నట్లు వివరించింది. ఓటరు కార్డుల స్థితి గురించి ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేస్తామని పేర్కొంది.

శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర 22కు వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 18: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా శుభాంశు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ రోదసీ యాత్ర ఈ నెల 19న ఉంటుందని ఇస్రో ఇటీవల ప్రకటించింది. కానీ.. దీన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్టు యాక్సియం స్పేస్ బుధవారం వెల్లడించింది. సాంకేతిక కారణాలతో ఇప్పటికే ఈ మిషన్ పలుమార్లు వాయిదా పడింది. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది. వాతావరణం అనుకూలించక వాయిదా పడింది.

కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేకు చేదు అనుభవం

» ప్యారిస్ నుంచి అమెరికా పర్యటనకు లభించని అనుమతి

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గేకి అమెరికాలో పర్యటించేందుకు అనుమతి లభించలేదు. దీనికి భారతీయ విదేశీ వ్యవహారాల శాఖ నిర్ణయం కారణమా? లేక అమెరికా నిరాకరించిందా.? అనే విషయంలో స్పష్టత లేదు. ప్రియాంక ఖర్గే ప్యారిస్ పర్యటనలో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి.. బోస్టన్, శ్యాన్‌ఫ్రాన్సిస్కో నగరాలలో జరిగే బయో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ డిజైన్ అండ్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్‌లలో పాల్గొనాల్సి ఉంది. ప్యారిస్‌లో మంగళవారం అధికారిక కార్యక్రమాలను ముగించుకుని, అమెరికాకు వెళ్లేందుకు ఆయన సిద్ధమయ్యారు. కానీ అనుమతులు లభించకపోవడంతో విచారం వ్యక్తం చేశారు. భారత్‌కు తిరిగి వచ్చాక కేంద్ర ప్రభుత్వంతో నిర్దిష్టమైన కారణాలు కోరుతానని మంత్రి అన్నారు. ఇలా ఉండగా మంత్రి వెంట ఉన్న ఓ ఐఏఎస్ అధికారికి అమెరికా వెళ్లేందుకు అనుమతులు లభించాయి. ఓ మంత్రికి విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడం, ఆయన వెంట ఉన్న ఐఏఎస్ అధికారికి అనుమతులు లభించడం రాజకీయంగా దుమారం రేపుతోంది.



మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఐష్‌బాగ్ స్టేడియం సమీపంలో నిర్మించిన 'లంబకోణ వంతెన'లో మార్పులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వంతెన రీడిజైనింగ్ కోసం అవసరమైన స్థలాన్ని ఇచ్చేందుకు భారతీయ రైల్వే అంగీకరించిందని వారు చెప్పారు. 648 మీటర్ల పొడవు, 8.5మీటర్ల వెడల్పు, రూ.18కోట్లతో ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. దీన్ని ఇంకా ప్రారంభించలేదు. అయితే, వంతెన పైన ఓ చోట 90డిగ్రీల మలుపు ఉండటం తీవ్ర విమర్శలకు కారణమైంది. అలా ఉంటే ప్రమాదాలు జరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

యుద్ధం నేనే ఆపా!

భారత్ వైపు ప్రధాని మోదీ, పాక్ వైపు ఆర్మీ చీఫ్ మునీర్ ప్రభావవంతంగా పనిచేశారు

» కాల్పుల విరమణతో అమెరికాకు సంబంధం లేదని మోదీ స్పష్టం చేసిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్య



న్యూఢిల్లీ, జూన్ 18: యుద్ధాన్ని ఆపడంలో భారత్ వైపు ప్రధాని మోదీ, పాకిస్థాన్ వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ప్రభావవంతంగా వ్యవహరించారని.. అయితే యుద్ధాన్ని మాత్రం తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణకు అంగీకరిస్తే భారీగా వాణిజ్యం చేస్తామని, లేకుంటే వాణిజ్యం మొత్తంగా నిలిపివేస్తామని తాను చేసిన హెచ్చరికలతోనే భారత్, పాక్ యుద్ధం నిలిపివేశాయని గతంలో ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు భారత్ తరఫున మోదీ, పాక్ తరఫున ఆసిమ్ మునీర్ యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నించారంటూ వారికి కొంత క్రెడిట్ ఇచ్చారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసిన నేపథ్యంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినట్టుగా అభిప్రాయం వ్యక్తమవుతోంది. బుధవారం ట్రంప్ అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "పాకిస్థాన్, భారత్ మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను. ఐ లవ్ పాకిస్థాన్. మోదీ ఒక అద్భుత వ్యక్తి. గత రాత్రే నేను ఆయనతో మాట్లాడాను. భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నాం. పాకిస్థాన్ వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్, భారత్ వైపు ప్రధాని మోదీ.. యుద్ధాన్ని ఆపడంలో ఇద్దరూ ప్రభావవంతమైన వ్యక్తులు. వారి పని వారు చేశారు. రెండూ అణ్వస్త్ర సామర్థ్యమున్న దేశాలు. వారి మధ్య యుద్ధాన్ని నేను ఆపాను" అని వ్యాఖ్యానించారు. తాను చేసిన గొప్పపనిని మీడియా సరిగా పట్టించుకోవడం లేదనే ఉద్దేశాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు.

వాణిజ్యం, మధ్యవర్తిత్వంపై చర్చే లేదు

కెనడాలో జరుగుతున్న జీ-7 సదస్సులో పాల్గొంటున్న ప్రధాని మోదీ.. అక్కడ షెడ్యూల్ ప్రకారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఆయన భేటీ కావాల్సి ఉంది. కానీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ట్రంప్ అమెరికాకు వెళ్లిపోయారు. అనంతరం మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ వివరాలతో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం ఉదయమే ఒక ప్రకటన విడుదల చేశారు. మిస్రీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ట్రంప్‌తో మోదీ 35 నిమిషాల పాటు మాట్లాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణ సమయంలో వాణిజ్యం గురించికానీ, మధ్యవర్తిత్వం గురించిగానీ అమెరికా పాలన యంత్రాంగంతో తాను చర్చించలేదని ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు, తమ ఇరు సైన్యాల మధ్య చర్చల ద్వారా కాల్పుల విరమణ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. భారత్, పాక్ మధ్య మూడోదేశం మధ్యవర్తిత్వాన్ని భారత్ ఇంతవరకు అంగీకరించలేదని, భవిష్యత్తులోనూ అంగీకరించబోదని స్పష్టంచేశారు. ఇక సదస్సును ముగించుకుని అమెరికాకు రావాలన్న ట్రంప్ ఆహ్వానాన్ని మోదీ సున్నితంగా తిరస్కరించారు. షెడ్యూల్ ప్రకారం తాను క్రొయేషియాకు వెళ్లనున్నట్టు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన జరిగిన రోజు (ఏప్రిల్ 22న) మోదీకి ట్రంప్ ఫోన్ చేసి విచారం వ్యక్తం చేశారు. ఆ తర్వాత తిరిగి వారు మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి. ఆపరేషన్ సిందూర్ సాగినంతకాలం విదేశాంగ మంత్రి జైశంకర్‌తో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, ఆ దేశ విదేశాంగ శాఖలోని అత్యున్నత అధికారుల బృందం తరచూ మాట్లాడింది. మే 7-9 తేదీల మధ్య మోదీతో జేడీ వాన్స్ ఫోన్‌లో మాట్లాడారని విక్రమ్ మిస్రీ వెల్లడించారు.

వైట్‌హౌస్‌లో మునీర్‌కు ట్రంప్ విందు


వాషింగ్టన్, జూన్ 18: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం పతాక స్థాయిలో ఉన్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు వైట్ హౌస్‌లో బుధవారం విందు ఇచ్చారు. యుద్ధంలో ఇరాన్‌కు పాకిస్థాన్ నుంచి ఎలాంటి సాయం అందకుండా చూడటం ప్రధాన లక్ష్యంగా ఆయన ఈ విందు ఏర్పాటు చేసినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఇరాన్‌ను ఏకాకిని చేయడం ట్రంప్ వ్యూహమని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో చైనాకు పాకిస్థాన్‌ను దూరం చేసే యోచన కూడా ఉండొచ్చని విశ్లేషిస్తున్నారు. ఆర్మీ చీఫ్ పదవుల నుంచి పాక్ అధ్యక్షులైన వారికి అమెరికా అధ్యక్షులు గతంలో అనేకసార్లు విందు ఇచ్చారు. అయితే నేరుగా పాక్ ఆర్మీ చీఫ్‌కు వైట్ హౌస్‌లో విందు ఇవ్వడం ఇదే తొలిసారి.

ట్రంప్‌తో పాక్ ఆర్మీ చీఫ్ 'లంచ్' భేటీ.. భారత్‌కు భారీ ఎదురుదెబ్బ

» అఖిలపక్ష భేటీకి కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ 'మధ్యాహ్న భోజన' సమావేశం కావడం భారత్ దౌత్య వ్యూహానికి పెద్ద ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. తన మూడు దేశాల పర్యటన విశేషాలతోపాటు ట్రంప్‌తో ఫోన్‌లో ఏం మాట్లాడారో ప్రధాని మోదీ జాతికి చెప్పాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్.. దీనిపై తక్షణం అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కశ్మీర్ విషయంలో తృతీయపక్షం జోక్యాన్ని అనుమతించబోమని ట్రంప్‌తో ఫోన్ సంభాషణల్లో ప్రధాని మోదీ చెప్పారన్న విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటనపై జైరాం ప్రతిస్పందించారు. భ్రమలకంటే వాస్తవాలపైనే మోదీ సర్కార్ తప్పనిసరి దౌత్యవ్యూహం అమలు చేయాలని ఆయన సూచించారు.

లోకం తీరు



భారత్-కెనడా మళ్లీ భాయీభాయీ!

జీ-7 సదస్సు సందర్భంగా కెనడా ప్రధాని కార్నీతో మోదీ కీలక చర్చలు జరిపారు. గత ప్రధాని జస్టిన్ ట్రూడో వైఖరి కారణంగా.. ఉభయదేశాల నడుమ దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణకు నిర్ణయించారు. ప్రధానంగా కాన్సులర్, వాణిజ్య సేవలను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు రెండు దేశాల రాయబార కార్యాలయాల్లో కొత్త హైకమిషనర్లను నియమించాలని నిశ్చయించారు. కొత్త హైకమిషనర్లను త్వరలోనే రెండు దేశాలు ప్రకటిస్తాయని కెనడా ప్రధాని కార్యాలయం ఆ తర్వాత ఓ ప్రకటనలో తెలిపింది. పౌరులు, పారిశ్రామికవేత్తలు ఉభయదేశాల్లో తమ నిత్య కార్యకలాపాలను తిరిగి కొనసాగించేందుకు ఇద్దరు ప్రధానులూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కెనడాలో సిక్కు వేర్పాటువాద నేత హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందని అప్పటి ఆ దేశ ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల నడుమ సంబంధాలు క్షీణించడం మొదలుపెట్టాయి. ఆయన తన ఆరోపణలు కొనసాగించడంతో గత ఏడాది అక్టోబరులో ఢిల్లీలోని కెనడా యాక్టింగ్ హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను బహిష్కరించింది.

ఉగ్రవాదాన్ని సమర్థించేవారికి రివార్డులా?

జీ-7 సదస్సులో అగ్ర దేశాలపై మోదీ విసుర్లు.. రెండు నాల్కల ధోరణి వీడాలని హితవు

ఆల్బెర్టా(కెనడా), జూన్ 18: ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థిస్తున్న దేశాలకు రివార్డులిస్తున్నారని ప్రధాని మోదీ అగ్రదేశాలను విమర్శించారు. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని ఎండగట్టారు. బుధవారం కెనడాలోని ఆల్బెర్టాలో కననాస్కిస్‌లో జీ-7 దేశాల రెండో రోజు సదస్సులో ప్రసంగించారు. ఉగ్రవాదంపై భారత దృఢవైఖరిని విశదీకరించారు. ప్రపంచదేశాలన్నీ ఐక్యంగా చర్యలు తీసుకోవాలని, రెండు నాల్కల ధోరణి తగదని హితవు పలికారు. టెర్రరిజాన్ని ప్రోత్సహించే, మద్దతిచ్చే దేశాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. 'ఆయా దేశాలు పర్యవసానాలను ఎదుర్కోక తప్పదు.ఏ దేశమైనా ఉగ్రవాదానికి మద్దతిస్తే అది మూల్యం చెల్లించుకోవలసిందే' అని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా తీసుకుంటున్న చర్యలు ద్వంద్వప్రమాణాలతో ఉంటున్నాయని ఆక్షేపించారు. 'ఓవైపు.. మన అవసరాలకు అనుగుణంగా హడావుడిగా అన్ని రకాల ఆంక్షలు విధించేందుకు పూనుకుంటాం. మరోవైపు.. బహిరంగంగా టెర్రరిజానికి మద్దతిచ్చే దేశాలకు రివార్డులు లభిస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించిన జీ-7 దేశాలకు ప్రధాని ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇదిలా ఉండగా, మోదీ అత్యుత్తమ ప్రధాని అని.. ఆయనలా ఉండేందుకు ప్రయత్నిస్తున్నానని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనతో భేటీ సందర్భంగా అన్నారు. ఆయన నవ్వుతూ 'థమ్స్ అప్' సంకేతమిచ్చారు. వారి సంభాషణ వీడియో వైరల్‌గా మారింది.

టెహ్రాన్‌పై నిప్పుల వాన

(మొదటిపేజీ తరువాయి)

యురేనియం-235ను వెలికితీసేందుకు సెంట్రీఫ్యూజ్‌ను వినియోగిస్తారు. ఇలా పదేపదే ప్రాసెస్ చేసి.. అణ్వాయుధాల తయారీకి అవసరమయ్యే యురేనియంను సేకరిస్తారు. ఇప్పటికే నటాంజ్ అణుకేంద్రం తీవ్రంగా ధ్వంసమైనట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) వెల్లడించిన విషయం తెలిసిందే..! దీంతోపాటు.. తమ వైమానిక దళాలు ఇరాన్ ఆయుధ తయారీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఈ క్రమంలో తమ యుద్ధ విమానాలపై దాడికి వచ్చిన ఐదు హెలికాప్టర్లపై దాడులు జరిపి, మూడింటిని నేలమట్టం చేసినట్లు ఐడీఎఫ్ బ్రిగేడియర్ జనరల్ డఫెరిన్ వెల్లడించారు. కాగా.. బుధవారం కూడా ఐడీఎఫ్ అధికారులు పర్షియా భాషలో టెహ్రాన్‌ను వీడి వెళ్లాలంటూ పౌరులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆరు రోజుల యుద్ధంలో ఇరాన్‌లో 585 మంది మృతిచెందారని, వీరిలో 239 మంది పౌరులున్నారని, 1,326 మంది గాయపడ్డారని మానవ హక్కుల సంస్థలు వెల్లడించాయి. ఇరాన్ పౌరులు తమ స్మార్ట్ ఫోన్ల నుంచి వెంటనే వాట్సాప్ యాప్‌ను తొలగించాలని ఐఆర్‌జీసీ సూచించింది. కాగా.. బుధవారం సాయంత్రం మూడు ఇరాన్ ప్రభుత్వ విమానాలు ఒమన్‌లో ల్యాండ్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా చెబుతోంది. ఈ విమానాల్లో ప్రభుత్వాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధం విరమణకు చర్చల కోసమే వీరు ఒమన్ వెళ్లి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య అణు చర్చలకు కూడా ఒమన్ మధ్యవర్తిగా ఉన్న విషయం తెలిసిందే..! మరోవైపు ఇజ్రాయెల్ అనుకూల హ్యాకర్ల గ్రూప్ 'ప్రిడేటరీ స్పారో' బుధవారం ఇరాన్‌లోని అతి పెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్(నోవిటెక్స్)పై సైబర్ దాడి జరిపింది. ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకు నోవిటెక్స్ నిధులను సమకూరుస్తోందని ఈ గ్రూప్ ఆరోపించింది. ఇదే బృందం మంగళవారం బ్యాంకులపై పంజా విసిరిన విషయం తెలిసిందే.

ఇజ్రాయెల్‌పై పరిమిత దాడులు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పరిమిత దాడులు జరిపింది. తొలిరోజు 200కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్.. తాజాగా రెండు దశల్లో 25 క్షిపణులకు పరిమితమైంది. అయితే.. యూఏవీలను పెద్ద ఎత్తున ప్రయోగించినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అయితే.. తాము హైపర్‌సోనిక్ ఫతాహ్-1 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించామని, వాటిని ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించలేవని ఐఆర్‌జీసీ పేర్కొంది. టెల్‌అవీవ్‌కు భారీ నష్టం వాటిల్లిందని వెల్లడించింది. కాగా..

బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు వచ్చి..

ఉక్రెయిన్‌లోని ఒడెస్సాకు చెందిన నస్త్యబోరిక్ అనే ఏడేళ్ల చిన్నారి బ్లడ్‌క్యాన్సర్ చికిత్సకు ఆ కుటుంబం ఇజ్రాయెల్‌కు వచ్చింది. ఇటీవల జరిగిన ఇరాన్ క్షిపణి దాడుల్లో ఆ కుటుంబానికి చెందిన లీనా పెష్కొరేవా(60), మరియా పెష్కొరేవా(30), నస్త్యబోరిక్(7), కాన్‌స్టాంటిన్(9), ఇలియా పెష్కొరేవ్(13) మరణించినట్లు ఐడీఎఫ్ బుధవారం ప్రకటించింది.

లొంగిపోవడమే మంచిది: ట్రంప్

ఖమేనీ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందించారు. యుద్ధం మొదలైందంటూ ఖమేనీ అనడంతో.. "గుడ్‌లక్" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు చర్చల కోసం ఇరాన్ అధికారులు వైట్‌హౌస్‌కు వస్తామన్నారని, తాను అందుకు "ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది" అని బదులిచ్చినట్లు చెప్పారు. "ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తుందో.. లేదో.. చెప్పలేను. వారికి(ఇరాన్-ఇజ్రాయెల్) చాలా సమస్యలున్నాయి. వారు పరస్పరం చర్చలు జరుపుకోవాలని కోరుకుంటున్నా. అయితే.. చర్చలకు ఇప్పటికే ఆలస్యం జరిగింది. అందుకే.. బేషరతుగా లొంగిపోవడమే మంచిది" అని సూచించారు. కాగా.. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం చేయకూడదని రష్యా విదేశాంగ శాఖ ఉప మంత్రి సెర్గీ రియాబ్కోవ్ కోరారు. తమ అధినేత పుతిన్ కూడా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలు జరగాలని ఆకాంక్షించినట్లు వివరించారు.

ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ తన గగనతల వ్యవస్థ కోసం ఒక్క రాత్రికి రూ.2,400 కోట్లు వెచ్చిస్తోందని అంచనా. ఇజ్రాయెల్ వద్ద మరో 10-12 రోజులకు సరిపడా గగనతల రక్షణ క్షిపణులున్నట్లు అమెరికా తాజా నివేదిక స్పష్టం చేస్తోంది.

యుద్ధం మొదలైంది.. మేం లొంగేది లేదు: ఖమేనీ

ఇరాన్ లొంగిపోవాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం మొదలయ్యాక.. తొలిసారి ఆయన బహిరంగ ప్రకటన చేశారు. ఇరాన్ లొంగేది లేదని తేల్చిచెప్పారు. తమపై దాడితో ఇజ్రాయెల్ పెద్దతప్పు చేసిందని, దానికి ఆ దేశం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. "యుద్ధం మొదలైంది. ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుంటే.. ఆ దేశానికి కోలుకోలేని దెబ్బతగులుతుంది. 7వ శతాబ్దంలో యూదుల పట్టణమైన ఖైబర్‌పై షియా ఇస్లాం మొదటి ఇమాం యుద్ధం చేసి, ఘన విజయం సాధించారు. బెదిరింపులకు బయపడే చరిత్ర ఇరాన్‌కు లేదు. మేం బలంగా ప్రతిస్పందిస్తాం. ఎవరిపైనా దయ చూపేది లేదు" అని ఆయన ఓ పోస్టులో వ్యాఖ్యానించారు.

ట్రంప్‌నకు పరిమిత యుద్ధ అధికారాలు?

ఇరాన్‌పై స్వరం పెంచుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ అధికారాలను పరిమితం చేసే దిశలో ఆ దేశ చట్టసభ్యులు ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు ట్రంప్ స్వపక్షం రిపబ్లికన్, విపక్షం డెమోక్రాట్ సభ్యులు పలువురు ఈ మేరకు కాంగ్రెస్‌లో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అమెరికా రాజ్యాంగం మేరకు ఎగువ, దిగువ సభల ఆమోదంతోనే యుద్ధంలో పాలుపంచుకోవడంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, ఏకపక్షంగా కుదరదని వారు గుర్తుచేస్తున్నారు.

టోల్ చెల్లింపులు సులువుగా.. చౌకగా

(మొదటిపేజీ తరువాయి)




స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా దేశం మొత్తం ప్రయాణించేందుకు పాస్‌ను తీసుకొచ్చామన్నారు. పాస్ యాక్టివేషన్, రెన్యువల్ కోసం రాజ్‌మార్గ్ యాప్‌తో పాటు ఎన్‌హెచ్ఏఐ, మోర్త్ అధికారిక వెబ్‌సైట్లలో ప్రత్యేక లింక్‌ను త్వరలో అందుబాటులో ఉంచుతామన్నారు. కాగా, ప్రధానంగా 60 కి.మీ. లోపే టోల్‌ప్లాజాలు ఉండటంపై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి ఈ కొత్త పాలసీని తీసుకొచ్చారు. ఒకేసారి చెల్లింపు విధానంతో టోల్ ప్లాజాల విషయంలో స్పష్టత తీసుకురావచ్చని ప్రభుత్వ చెప్పింది.ఇప్పటికే దేశవ్యాప్తంగా ఫాస్టాగ్ అమల్లో ఉంది. అయితే కొత్త విధానంతో వాహనదారులకు సులువైన, చవకయిన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

ఫాస్టాగ్ పాస్‌లో విశేషాలు

- రూ.3 వేలు ఫిక్స్‌డ్ పేమెంట్ ఉంటుంది. 200 ట్రిప్పులు లేదా ఏడాది పాటు చెల్లుబాటు అవుతుంది. దేశవ్యాప్తంగా హైవేలన్నింటికి వర్తిస్తుంది.
- ప్రత్యేకంగా కార్లు, జీపులు, వ్యాన్లు వంటి ప్రైవేట్ ఫోర్ వీలర్స్‌కు మాత్రమే పాస్ ఇస్తారు.
- ట్రిప్పుల పరిమితి లేదా గడువు పూర్తయ్యే వరకు ఫాస్టాగ్ నుంచి టోల్ మినహాయించరు.
- ప్రస్తుతం ఫాస్టాగ్ ఉన్న వారు పాస్ కోసం కొత్తగా మరో ఫాస్టాగ్ తీసుకోవాల్సిన అవసరం లేదు. పాస్ కూడా తప్పనిసరి కాదు. పాస్ తీసుకోని వారు ఫాస్టాగ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు.
- ఒక టోల్ ప్లాజాను దాటి వెళితే దానిని ఒక ట్రిప్పుగా, అదే టోల్ ప్లాజా నుంచి వెనక్కి వస్తే (రౌండ్ ట్రిప్) రెండు ట్రిప్పులుగా పరిగణిస్తారు. అంటే పాస్ తీసుకుంటే ఒక ట్రిప్పునకు రూ.15 చెల్లించినట్లు అవుతుంది.
- ఏడాది గడువు తీరకుండా 200 ట్రిప్పుల పరిమితి పూర్తయిన వారు మళ్లీ పాస్‌ను కొనుక్కోవచ్చు. ఇలా ఎన్నిసార్లు అయినా పర్చేజ్ చేయవచ్చు.

మన 'టైమ్' వచ్చింది!



న్యూఢిల్లీ, జూన్ 18: 'టైమెంత?' అని ఎవరైనా అడిగితే యథాలాపంగా చెప్పేస్తాంగానీ.. సమయ నిర్ణయం వెనుక పెద్ద ఎత్తున ఉపగ్రహ వ్యవస్థలు, పరమాణు గడియారాల వంటివి ఉంటాయని చాలా మందికి తెలియదు! అలా మనం ఇప్పటిదాకా సమయ నిర్ధారణకు, నిర్వహణకు.. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) వంటి విదేశీ వ్యవస్థలపైనే ఆధారపడుతున్నాం. కానీ.. ఇప్పుడు మన 'టైమ్' వచ్చేసింది! ఇకపై దేశంలో నిర్వహించే అన్ని రకాల న్యాయ, వాణిజ్య, డిజిటల్, పరిపాలనా కార్యకలాపాలకూ తప్పనిసరిగా... మన 'నావిక్' ఉపగ్రహ వ్యవస్థతో అనుసంధానమైన భారత ప్రామాణిక సమయాన్నే (ఐఎస్‌టీ) పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ఒక దేశం-ఒకే సమయం' పేరిట అమలు చేయనున్న ఈ విధానానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే నోటిఫై చేయనున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. "ప్రస్తుతం దేశంలో చాలా వ్యవస్థలు జీపీఎస్ వంటి విదేశీ సమయ వ్యవస్థలపై ఆధారపడి పని చేస్తున్నాయి. దీనివల్ల సైబర్ దాడులు జరిగే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

ఇదీ నేపథ్యం..

కార్గిల్ యుద్ధ సమయంలో మన సైన్యం జీపీఎస్‌పై ఆధారపడడం, అది సరిగ్గా ఉపయోగపడకపోవడంతో.. దేశీయ ఉపగ్రహ వ్యవస్థల ప్రాముఖ్యాన్ని భారత ప్రభుత్వం గుర్తించింది. నేవిగేషన్‌కు మాత్రమే కాదు.. బ్యాంకింగ్ కార్యకలాపాలకు, శాస్త్ర పరిశోధనలకు, అంతరిక్ష ప్రయోగాలకు ఇలా అన్నింటికీ సమయ కచ్చితత్వం కీలకం. అందుకే మన ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి.. ఏడు ఉపగ్రహాలతో దేశీయ నావిక్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఏడు ఉపగ్రహాల్లో ఒక్కో దాంట్లో మూడు పరమాణు గడియారాలు ఉంటాయి. ఈ ఉపగ్రహాలు.. దేశంలోని ఐదు 'రీజనల్ రిఫరెన్స్ స్టాండర్డ్ లాబొరేటరీస్'కు అనుసంధానమై ఉంటాయి. అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, ఫరీదాబాద్, గువాహటి నగరాల్లోని ఆ ల్యాబుల్లోనూ పరమాణు గడియారాలు ఉంటాయి. వాటిలో.. ఫరీదాబాద్ ల్యాబ్ నావిక్ ఉపగ్రహాల్లోని పరమాణు గడియారాల నుంచి వచ్చిన టైమ్ సిగ్నల్స్‌ను స్వీకరించి.. వాటిని ఆప్టికల్ ఫైబర్ లింక్స్ ద్వారా మిగతా నాలుగు కేంద్రాలకూ పంపుతుంది. ఇలా ఆ ఐదు కేంద్రాలూ మైక్రో సెకన్లతో సహా కచ్చితమైన సమయాన్ని దేశానికి అందిస్తాయి.

నిరుపేద వృద్ధురాలికి మరుగుదొడ్డే ఆవాసం

అర్హతలున్నా సాంకేతిక సమస్యతో ఇందిరమ్మ జాబితాలో అన్నమ్మ పేరు తొలగింపు

- పైలెట్ ప్రాజెక్టు గ్రామం రేపల్లెవాడలో వెలుగు చూసిన ఘటన
- అధికారుల దృష్టికి అన్నమ్మ అంశం: ఎంపీడీవో జీవీఎస్ నారాయణ

ఏన్కూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఇందిరమ్మ ఇల్లు' పథకంతో సంబుర పడ్డ పేదలంతా దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎంపికైన లబ్ధిదారులు ఆనందంగా ఇంటి నిర్మాణంలో బిజీబిజీగా ఉన్నారు. కానీ.. ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన రేపల్లె వాడ గ్రామ వాసి బండెల అన్నమ్మ అనే నిరుపేద వృద్ధురాలు మాత్రం మరుగుదొడ్లోనే నివాసం ఉంటు న్నారు. ఊళ్లో అర్హులైన వారందరి పేర్లతో 95 మంది జాబితాను ఉన్నతాధికారులకు పంపారు. కానీ, సాంకేతిక కారణాలతో అన్నమ్మ పేరును అర్హుల జాబితా నుంచి తొలగించారు. ఆమె కేవలం రూ.2,000 ప్రభుత్వ పెన్షన్‌తోనే కాలం గడుపుతు న్నారు. అంతకు ముందు ఆమె నివాసం ఉన్న రేకుల షెడ్డు గతేడాది కురిసిన భారీ వర్షాలతో కూలిపో యింది. షెడ్డు స్థానంలో పూరి గుడిసె వేసుకోలేని దుర్భర పరిస్థితుల్లో అన్నమ్మ.. చిన్న మరుగు దొడ్లోనే జీవిస్తున్నారు. సాంకేతిక కారణాలతో తన పేరు తొల గించడం పట్ల ఆమె కన్నీరు మున్నీరయ్యారు. ఇప్పుడు తాను ఉన్న మరుగు దొడ్డికి కరంట్ లేక టార్చిలైట్, దీపం బుడ్డి (నూనె దీపం)తో కాలం గడు పుతున్నారు. దాని చుట్టూ పాములూ తేళ్లు తిరుగు తుండటంతో రాత్రవుతుందంటేనే భయంభయంగా జీవిస్తున్నానని, నిద్ర పోవడానికి ఇబ్బంది పడుతు న్నానని అన్నమ్మ వాపోయారు. వర్షాలొస్తే మరీ ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.


తాను నివాసం ఉంటున్న మరుగుదొడ్డి వద్ద అన్నమ్మ

దీనిపై ఏన్కూర్ ఎంపీడీవో జీవీఎస్ నారాయణ వివ రణ కోరగా, 95 మంది అర్హులను ఎంపిక చేస్తే, 94 మందికి ఇల్లు మంజూరైందన్నారు. సాంకేతిక కారణా లతో అన్నమ్మ పేరు తొలగించారని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.


మధిరలో బస్టాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్

1912కు ఫోన్ చేస్తే కరెంట్ సమస్యల పరిష్కారం

- నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు: డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ సిబ్బంది మెరుగైన సేవలందించాలి: మంత్రి పొన్నం

ఖమ్మం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ శాఖలో పారదర్శకత తీసుకొచ్చామని, కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు పరి ష్కరిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలి పారు. అన్ని వాతావరణ పరిస్థితుల్లో నాణ్యమైన, నిరం తర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధ వారం విద్యుత్ అంబులెన్సులతోపాటుఉద్యోగుల హెల్త్ క్యాంపును మంత్రి పొన్నంతో కలిసి భట్టి ప్రారంభించారు. మధిరలో రూ.10కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన బస్టాండ్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ అంబులె న్సుల ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేయడంతో పాటు సరఫరాలో సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 1912కు ఫోన్ చేస్తే.. విద్యుత్ అంబులెన్స్‌లో సిబ్బంది వచ్చి మరమ్మ తులు చేస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా లైన్ మెన్ నుంచి సీఎండీ వరకూ అందరికీ రూ.కోటి ప్రమాద బీమా కల్పిస్తున్నామన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యుత్ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని కోరారు.

'కబుర్ల దేవత'కు కేంద్ర బాల పురస్కారం

మైరావణ నవలకు యువ పురస్కారం.. అవార్డులు ప్రకటించిన కేంద్ర సాహిత్య అకాడమీ

- బాలసాహిత్యంలో 50ఏళ్లకుపైగా గంగిశెట్టి కృషి
- పాతికేళ్లకే మూడు నవలలు రాసిన ప్రసాద్ సూరి

న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సాహిత్య అకాడమీ బుధవారం బాలసాహిత్య, యువ పురస్కారాలను ప్రకటించింది. గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' పుస్తకానికి బాల సాహిత్య పురస్కారం వచ్చింది. ప్రసాద్ సూరి రచించిన మైరావణ నవల సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైంది. అకాడమీ అధ్య క్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఎగ్జిక్యూటివ్ బోర్డు పలు భాషల్లో వెలువడిన ఉత్తమ రచనలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. ఈ ఏడాది డోగ్రీ భాషకు సంబంధించి యువ పురస్కారం ప్రకటిం చలేదు. దీంతో ఈ విభాగంలో 23 భాషల్లో ప్రచు రితమైన పుస్తకాలకు మాత్రమే యువ పురస్కా రాలు ప్రకటించారు. పురస్కార విజేతలకు త్వరలో ఢిల్లీలో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్ర మంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. వీరికి జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు అంది స్తామని అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, ప్రసాద్ సూరిది విశాఖపట్నం కాగా, గంగిశెట్టి శివకుమార్‌ది నెల్లూరు. తెలుగు భాషకు సంబంధించి బాల సాహిత్య పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా కన్నె గంటి అనసూయ, ఎం. భూపాల్ రెడ్డి, కిలపర్తి దాలినాయుడు ఉన్నారు. యువ పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా జీఎస్ చలం, కుప్పిలి పద్మ, పెద్దింటి అశోక్ కుమార్ వ్యవహరించారు.


నెల్లూరులో కేంద్ర సాహిత్య అకాడమీ బాల పురస్కార విజేత గంగిశెట్టి శివకుమార్‌ను సత్కరిస్తున్న అరసం నాయకులు


ప్రసాద్‌సూరి

పాతికేళ్లకే పురస్కారం

సురాడ ప్రసాద్ (కలం పేరు ప్రసాద్ సూరి) 2000లో విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వాడరాం బిల్లి గ్రామంలో జన్మించారు. రాంబిల్లిలోనే పదో తర గతి వరకు చదివారు. యలమంచిలి ప్రభుత్వకాలే జీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంకులోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటె క్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బీఎఫ్ఏ, పెయింటింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం గుజ రాత్‌లోని బరోడా నగరంలో మహారాజా సాయాజి రావు యూనివర్సిటీలో ఎంఏ ఆర్కియాలజీ రెండో సంవత్సరం చదువుతున్నారు. 18వ ఏట నుంచే సాహిత్యం, చిత్రకళ, చరిత్ర, సినిమా రంగంపై ఆయనకు ఆసక్తి ఎక్కువ. 'మైరావణ' ఆయన మూడోనవల. 'మై నేమ్ ఈజ్ చిరంజీవి', 'బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' అనేది మిగతా నవలలు. చేపల వేట జీవనాధారంగా ఉన్న వాడ బలిజల వలస జీవిత కథలకు జానపద వీరగాథను జోడించి రాసిన నవలే మైరావణ. ఛాయా పబ్లికేషన్స్ ప్రచు రించిన ఈ పుస్తకం వాడ బలిజల జీవితాలను తొలి సారిగా సాహిత్యంలో నమోదు చేసింది. ఈ అవా ర్డు సాహిత్యం పట్ల తన బాధ్యతను మరింత పెంచింది అని రచయిత ప్రసాద్ సూరి అన్నారు.

బాల సాహిత్యంలో దిట్ట...

ఐదు దశాబ్దాలకు పైగా సాహిత్య సేవ చేస్తున్న గంగిశెట్టి శివకుమార్ చిన్నారుల కోసం 400కుపైగా కథలు రాశారు. నెల్లూరు జిల్లా రాపూరుకు చెందిన గంగిశెట్టి 54 ఏళ్లుగా రచనలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా గూడూరులో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా 2012లో ఉద్యోగ విరమణ పొందారు. తొలినాళ్లలో 'చందమామ'కు ఉప సంపాదకునిగా సేవలందిం చారు. పిల్లల కథలపై ఎస్వీ యూనివర్సిటీలో పీహె చ్‌డీ చేశారు. వీరి కథలు పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. అభ్యుదయ రచయితల సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షునిగా సేవలు అంది స్తున్నారు. పురస్కారాలు పొందిన ప్రసాద్ సూరి, గంగిశెట్టిలకు సాహిత్య ప్రముఖులు ఛాయా మోహ న్, తాడి ప్రకాశ్, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, వల్లూరు శివప్రసాద్, పెనకొండ లక్ష్మీనారాయణ, పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్య తదిత రులు అభినందనలు తెలిపారు.


సిరిసిల్లలో కుంటయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్

సెటిల్మెంట్లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు

- సివిల్ విషయాల్లో పోలీసుల అరాచకాలు
- యూపీలో బుల్డోజర్, హైదరాబాద్‌లో హైడ్రా పాలన
- మూసీ బాధితులకు అండగా ఉంటాం: కేటీఆర్

సిరిసిల్ల, బోరబండ/యూసుఫ్‌గూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలో పోలీస్‌స్టేషన్లు సెటిల్మెంట్లకు అడ్డాగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. సివిల్ విషయాల్లో దూరి పోలీసులు అరాచకాలు సృష్టిస్తున్నారని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న బీఆర్ ఎస్ నేత, మాజీ ఎంపీటీసీ కుంటయ్య భౌతిక కాయానికి బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, హైదరాబాద్ బోరబండలో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నేత ఎండీ సర్దార్ కుటుంబాన్ని కూడా కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా సర్దార్ ఇద్దరు పిల్లల పేరిట చెరో రూ.5 లక్షల చెక్కులను అందజేసి, వారి చదువు బాధ్యతను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. కుంటయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. కుంటయ్య మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని, ఎవరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. యూపీలో బుల్డోజర్ పాలన కొనసాగుతుంటే, హైదరాబాద్‌లో హైడ్రా పాలన నడుస్తోందని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి, హైడ్రా చేస్తున్న అరాచ కాలపై రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. మూసీ బాధితులకు అండగా ఉంటామని అన్నారు.

అప్పు పుట్టక.. ఆస్పత్రికి వెళ్లలేక..

- కౌలు రైతు ఆత్మహత్య.. మూడు ఎకరాల్లో సాగు
- సరిగ్గా పండని పంటలు.. రెండు లక్షలకు పైగా అప్పులు


తీగుళ్ల రాజు(ఫైల్)

జగదేవ్‌పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆ కౌలు రైతు భూమి కౌలుకు తీసుకుని వ్యవసా యమే జీవనాధారంగా బతుకుతున్నాడు. పంటలు సరిగ్గా పండక.. సాగు కోసం తెచ్చిన అప్పులు పెరిగిపోయాయి. మరోవైపు పక్షవాతం సోకి అనారోగ్యం పాలయ్యాడు. మరింత అప్పు చేద్దామన్నా ఎక్కడా పుట్టడం లేదు. అనారోగ్యం.. అప్పుల బాధ వెరసి తీవ్ర మనస్తాపం చెం ది ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా జగదే వ్‌పూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన తీగుళ్ల రాజు(35) కొన్నేళ్లుగా దౌలాపూర్‌లో ఓ రైతు వద్ద మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. సాగు, కుటుంబ పోషణ కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రూ. 2 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక మనోవేదన చెందేవాడు. ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. అప్పులు తీర్చేమార్గం లేక సతమతమవుతున్న అతడిని అనారోగ్యం మరింత కుంగదీసింది. దీంతో మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులు ఎవరూ లేని సమయంలో తన పూరి గుడి సెలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చే రుకున్నాడు. కూలి పనులు ముగించుకొని వచ్చిన భార్య రాధ గమనించి కుటుంబీకుల సహా యంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అర్ధరాత్రి చనిపోయాడు.

మహిళ కడుపులో సూది

- కుట్లు వేసి.. కడుపులోనే సూదిని వదిలేసిన వైద్యులు

హుజూరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరా బాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ కడుపులో సూది ఉండిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రసవం కోసం వచ్చిన గర్భిణికి వైద్యులు శస్త్రచికిత్స చేసినప్పుడు సూదిని కడుపు లోనే వదిలేశారు. జమ్మికుంటకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం ఆది వారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి వచ్చింది. శస్త్రచికిత్స నిర్వహించిన అనంతరం కుట్లు వేసే క్రమంలో సూది దారం నుంచి విడిపోయి మహిళ కడుపులోనే ఉండిపోయింది. దీంతో అప్రమత్తమైన వైద్యులు మహిళకు ఎక్స్‌రే తీసి సూది కడుపులో ఉందన్న విషయాన్ని గుర్తించి, కుట్లను విప్పి బయటకు తీశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరె డ్డిని వివరణ కోరగా, మహిళకు ఆపరేషన్ చేసి కుట్లు వేస్తున్న సమయంలో దారం ఊడి చర్మం కింద సూది చిక్కుకుందని, వెంటనే ఎక్స్‌రే తీసి అప్పటి కప్పుడే తొలగించామని తెలిపారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్‌శాఖ ఎస్ఈ

మహబూబాబాద్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నరేశ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్లు ఎస్‌కె.అజారుద్దీన్, ఎస్‌కె.నజీరుద్దీన్ మరిపెడ, కురవి మండలాల పరిధిలో రూ.20 లక్షలతో చేపట్టే విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ రిపేర్ల టెండర్ అలాట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఫైల్‌ను అప్రూవల్ చేయాలంటే రూ.లక్ష లంచం ఇవ్వాలని ఎస్ఈ నరేశ్ డిమాండ్ చేశాడు. చేసేదేమిలేక కాంట్రాక్టర్లు నరేశ్‌కు ఈనెల 14న రూ.20 వేలు ఇచ్చారు. మిగిలిన డబ్బులు ఇవ్వలేక వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్ర యించారు. బుధవారం మహబూబాబాద్‌లోని హస్తినాపురం కాలనీలో తన ఇంటి వద్ద ఎస్ఈ నరేశ్ బాధితుల నుంచి రూ.80 వేల లంచం తీసుకుం టుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని గురువారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

కారు బీభత్సం.. ఇద్దరి మృతి

వేములవాడ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం రుద్రవరం, ఆరెపల్లి గ్రామాల్లో బుధవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి అతివేగంగా కారు నడిపి అడ్డొచ్చిన వారిని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వేములవాడ నుంచి కరీంనగర్ వైపు నకు అతివేగంగా వెళ్తోన్న కారు రుద్రవరం గ్రామ సమీపంలో రోడ్డు దాటు తున్న దర్శి (35) అనే కార్మికుడిని ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అంతటితో ఆగకుండా అదే వేగంతో వెళ్లి పక్కనున్న ఆరెపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వేములవాడ పట్టణానికి చెందిన మల్యాల పండరీనాథ్ (27), అతడి మిత్రుడు చందును ఢీకొట్టడంతో పండ రీనాథ్ అక్కడికక్కడే మృతిచెందగా, చందు కాలు విరిగి తీవ్రంగా గాయప డ్డాడు. కారులో ప్రయాణిస్తున్న ఒకరు పరారీలో ఉండగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన ఇద్ద రిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్

రవి, అరుణ మృతి

(మొదటి పేజీ తరువాయి)

సభ్యురాలు రావి వెంకటగిరి చైతన్య అలియాస్ అరుణ (54), మరో నక్సల్ అంజూ కూడా ఈ ఘట నలో చనిపోయారు. వీరిలో అరుణ ఇటీవలి ఎన్‌కౌం టర్‌లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు రాంచం ద్రారెడ్డి అలియాస్ చలపతి భార్య. ఉమ్మడి ఏపీలో 2004లో ప్రభుత్వంతో చర్చలు జరిపిన మావోయి స్టుల బృందంలో ఉదయ్ ఒకరు. 2026 మార్చి 31లోగా మావోయిస్టులను పూర్తిగా తుడిచిపెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ఆపరేషన్ కగార్‌ను తీవ్రతరం చేసింది. ఒడిశా అడవుల్లో కూంబింగ్‌ను ముమ్మరం చేసింది. దీంతో అక్కడ ఉండటం తమకు క్షేమం కాదని ఉదయ్ టీమ్ భావించింది. ఆయనతోపాటు యాభైమంది మావోయిస్టులు నెల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి ప్రవేశించారు.

డ్రోన్లతో జాడ పట్టి..

ఏపీ గ్రేహౌండ్స్ బలగాలు అల్లూరి జిల్లాలోకి ప్రవే శించిన మావోయిస్టుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పుల నుంచి మూడుసార్లు ఉదయ్, అరుణ త్రుటిలో తప్పించుకున్నారు. కాకురి పండన్న అలియాస్ జగన్ కోరాపుట్ డీసీఎం రమేశ్ ఈ ఘటనల్లో చనిపో యారు. మరోవైపు, కీలక నేతల ఎన్‌కౌంటర్లను నిర సిస్తూ ఈనెల 20న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో గ్రేహౌండ్స్ బలగాలు మరింతగా అప్రమత్తమ య్యాయి. డ్రోన్‌లను ఉపయోగించి ఉదయ్ బృందం ఉన్న ప్రాంతాన్ని ఎట్టకేలకు కనిపెట్టాయి. పక్కా వ్యూహంతో మంగళవారం రంగంలోకి దిగాయి. దేవీ పట్నం మండల పరిధిలోని ఆకూరు, కొయ్యలగూడెం గ్రామాల సరిహద్దుల్లోని కింటుకూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ బలగా లకు బుధవారం ఉదయం మావోయిస్టులు తారసప డ్డారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉదయ్ సహా ముగ్గురు మావోయిస్టులు చనిపోయా రని పోలీసులు ప్రకటించారు. సుమారు మూడు గంటల పాటు కాల్పులు జరిగినట్టు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి మూడు ఏకే 47లను పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల మృత దేహాలను రంపచోడవరం ఆస్పత్రికి తరలించారు.

గెరిల్లా యుద్ధ నిపుణుడు..

నాలుగు దశాబ్దాలపాటు గాజర్ల రవి మావో యిస్టు ఉద్యమంలో గణేశ్, ఉదయ్ పేర్లతో కొనసా గారు. అందులో రెండు దశాబ్దాల కాలం పూర్తిగా ఆంధ్రా ఒడిశా బోర్డర్ (ఏవోబీ)కు పరిమితమై పని చేశారు. సైనిక వ్యూహాలు రచించడం, గెరిల్లా యుద్ధ తంత్రంలో రాటుతేలిన ఆయన ఉద్యమ ప్రస్థానం 1980ల్లో రాడికల్ విద్యార్థి సంఘంతో మొదలైంది. 1990లో పీపుల్స్‌వార్ పార్టీలో (మావోయిస్టు పార్టీ పూర్వ నామం) పూర్తికాలం కార్యకర్తగా చేరారు. ఉద్యమంలోనే జిలానీ బేగం అనే మహిళను వివాహం చేసుకోగా, ఆమె ఎన్‌కౌంటరులో మరణిం చారు. తెలంగాణలోని మహదేవపూర్, ఏటూరునా గారం, ముత్తారం ప్రాంతాల్లో దళ సభ్యునిగా పనిచే శారు. అనంతరం ఖమ్మం, వరంగల్, కరీంనగర్ (కేకేడబ్ల్యూ) కార్యదర్శిగా ఎదిగారు. నిర్బంధం పెరగ డంతో దండకారణ్యం చేరుకున్నారు. 2004లో అప్పటి ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఆ చర్చలు అర్ధాంత రంగా ముగిసిపోయిన తర్వాత ఆయన ఏవోబీకి చేరుకున్నారు. ఏవోబీ స్పెషల్ జోనల్ కార్యదర్శి బాకూరు వెంకటరమణ అలియాస్ గణేశ్ 2016 అక్టోబరు 24న రామ్‌గూడ ఎన్‌కౌంటరులో మరణిం చాక, ఆ బాధ్యతలను ఉదయ్ తీసుకున్నారు. ఆయ నది తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామం. ఆయన కుటుంబం నుంచి ముగ్గురు మావోయిస్టు పార్టీలోకి వెళ్లారు. వీరిలో పెద్ద అన్నయ్య గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ తెలంగాణలో పనిచేస్తూ ఎన్‌కౌం టరులో చనిపోయారు. మరో అన్నయ్య గాజర్ల అశోక్ అలియాస్ ఐతు దండకారణ్యంలో పనిచేస్తూ, తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం పోలీసులకు లొంగిపోయారు. ఉదయ్‌పై తెలంగాణలో రూ.40 లక్షలు, ఏవోబీలో రూ. 25 లక్షల రివార్డు ఉంది. అలి పిరి వద్ద చంద్రబాబుపై జరిపిన మందుపాతర దాడి ఘటనలో, 76మంది జవాన్లను హత్యచేసిన తాడిమెట్ల ఘటనలో, నదిని దాటుతున్న జవాన్లపై బలిమెలలో దాడిచేసి హత్యచేసిన ఘటనలో ఉదయ్ నిందితుడు. ఈ కేసుల్లో ఉదయ్‌ను పట్టుకో వడానికి మూడేళ్లుగా ఎన్ఐఏ అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఆయనను పట్టిస్తే రూ. 10 లక్షలు నజ రానా ఇస్తామంటూ ఒడిశాలో ఆయన ఫొటోతో పోస్టర్లు అతికించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కేంద్ర కమిటీలో నలుగురు ఉండేవారు. ఉదయ్ మరణంతో ఆ సంఖ్య మూడుకు పడిపో యిందని పోలీస్ వర్గాలు తెలిపాయి.


అంజూ (ఫైల్)

చర్చల టీమ్‌లో మిగిలింది ఒక్కరే..

ఉమ్మడి ఏపీలో 2004లో వైఎస్ ప్రభుత్వంతో మావోయిస్టులు చర్చ జరిపారు. ఈ చర్చల్లో అప్పట్లో మావోయిస్టు పార్టీ నాయకులు అక్కి రాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, చలం అలియాస్ సుధాకర్, గాజర్ల రవి అలియాస్ ఉదయ్; జనశక్తి పార్టీ నాయకులు రియాజ్, దేవేందర్ అలియాస్ అమర్ పాల్గొన్నారు. వీరిలో రియాజ్ హైదరాబాద్ కాచిగూడ సమీపంలో 2005లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఈ నెల ఐదోతేదీన ఛత్తీస్‌గఢ్‌లోని నేషనల్ పార్కు ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధా కర్ చనిపోయారు. రామకృష్ణ అనారోగ్యంతో ఛత్తీ స్‌గఢ్‌లోని బీజాపూర్‌లో చనిపోయారు. ప్రస్తుతం చర్చల బృందంలో అమర్ ఒక్కరే మిగిలారు.

కిడారి, సోమ హత్యలకు స్కెచ్ అరుణదే

అరకు లోయలోని లివిటిపుట్టు వద్ద 2018 సెప్టెం బరు 23న టీడీపీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు హత్యచేశారు. ఈ ఘటనలో అరుణదే కీలక పాత్ర అని, వారిద్దరి హత్యకు స్కెచ్‌ను ఆమే రూపొందిం చారని పోలీసులు అనేక సందర్భాల్లో ప్రకటించారు. అప్పుడే ఆమె పేరు తొలిసారి ప్రముఖంగా తెరపైకి వచ్చింది. అరుణది విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఆమెది పూర్తిగా ఉద్యమ కుటుంబం. తండ్రి లక్ష్మణరావు మావోయిస్టు పార్టీ మాజీ నేత. తల్లి లత, తమ్ముడు ఆజాద్ వేర్వేరు ఎన్ కౌంటర్లలో మరణించారు. అరుణ భర్త చలపతి ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తూ ఈ ఏడాది జనవరి నెలలో ఎన్‌కౌంటర్ అయ్యారు. అరుణ తలపై 20 లక్షల రివార్డు ఉంది. మరో నక్సల్ అంజూకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

అండర్‌గ్రౌండ్‌లో 88 మందే!

- ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో తెలంగాణ కమిటీలో తగ్గిపోతున్న మావోయిస్టుల సంఖ్య

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో తెలంగాణ రాష్ట్ర కమిటీలో మావోయిస్టుల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం అండర్‌గ్రౌండ్‌లో ఉన్నవారు 88 మందేనని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారిలోనూ చాలా వరకు ఆంధ్రా ఒడిషా సరిహద్దు (ఏవోబీ), ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉండి కార్యకలాపాలు సాగిస్తున్నారని పేర్కొంటున్నాయి. కేంద్రం ఆపరేషన్ కగార్ ప్రారంభించిన తర్వాత.. తెలంగాణ సరిహద్దుల్లోనూ గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆడెల్లి అలియాస్ భాస్కర్ మరణించారు. మరికొందరు రాష్ట్ర కమిటీ నాయకులూ ప్రమాదంలో చిక్కుకున్నారని పౌరహక్కుల సంఘాలు పేర్కొన్నాయి. ఇటీవల పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. ఈ పరిణామాల నేప థ్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీలో మావోయిస్టుల సంఖ్య తగ్గిపోతోందని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి.

తుది శ్వాస దాకా

నమ్మిన బాటలోనే!

- గాజర్ల రవి మృతితో వెలిశాలలో విషాదం
- 1992లో అజ్ఞాతంలోకి..

టేకుమట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెంద డంతో ఆయన స్వగ్రామం వెలిశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. గణేశ్ మరణవార్త తెలిసిన కుటుంబ సభ్యులు హనుమకొండ నుంచి ఏపీలోని అల్లూరి సీతారా మరాజు జిల్లాకు బయలుదేరి వెళ్లినట్లు సమాచారం. కాగా, గురువారం గణేశ్ మృతదేహాన్ని వెలిశాలకు తీసుకు వచ్చే అవకాశాలున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జయశం కర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల కనకమ్మ-మల్లయ్య దంపతులకు ఐదు గురు సంతానం. అన్నదమ్ములైన గాజర్ల రామయ్య, గాజర్ల సమ్మయ్య, గాజర్ల సారయ్య, గాజర్ల రవి, గాజర్ల అశోక్.. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహాయపడుతూ చదువుకునే వారు. నిర్బంధాల నుంచి విముక్తి పొందా లంటే రాజకీయాల వైపు వెళ్లాలని భావించిన గాజర్ల సారయ్య 1987లో సింగిల్ విండో ఛైర్మన్‌గా పోటీ చేసి.. ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ప్రత్యర్థి నల్లా కృష్ణారెడ్డి రిగ్గింగ్ చేసి గెలుపొందారన్న కోపంతో 1989లో సారయ్య పీపుల్స్‌వార్ గ్రూపులో చేరారు. సారయ్య బాటలోనే 1992లో గాజర్ల రవి అలియాస్ గణేశ్, 1994లో గాజర్ల అశోక్ అలియాస్ ఐతు ఉద్యమంలో చేరారు. వీరిలో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ 2008లో ఏటూరునా గారం మండలంలోని కంతనపల్లి అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందారు. గాజర్ల అశోక్ అలియాస్ ఐతు 2015లో అనారోగ్య కారణాలతో వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తన 23వ ఏట ఉద్యమంలోకి వెళ్లిన గణేశ్ గత 33 ఏళ్లుగా అజ్ఞాతంలోనే కొనసాగారు. ఆయనపై రూ.40లక్షల రివార్డు ఉంది. మొదట ఏటూరు నాగారం దళ సభ్యుడిగా, కమాండర్‌గా, నార్త్ తెలంగాణ ఫారెస్టు డివిజన్ కమిటీ సభ్యుడిగా పని చేసిన రవి.. 2007లో ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా పని చేశారు. 2010 నుంచి కేంద్ర కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. 2002లో మహదేవపూర్ ఏరియా కమాండర్‌గా పనిచేస్తున్న స్వరూప అలియాస్ జిలానీబేగంను పెళ్లి చేసుకున్నారు. ఏవోబీలోని రామగూడ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో స్వరూప మరణించారు. 2004లో ప్రభు త్వంతో జరిగిన శాంతి చర్చల్లో పీపుల్స్‌వార్ తరఫున పాల్గొన్న ప్రతినిధుల్లో గణేశ్ ఒకరు. ఆ చర్చలు విఫలం కావడంతో తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు. తనతో పని చేసిన వారు ఎన్‌కౌంటర్లలో హతమైనా, లొంగిపోయినా.. గణేశ్ వెనకడుగు వేయలేదు. నమ్మిన సిద్ధాంతం బాటలోనే చివరి వరకూ నడిచారు.

వికాస్ ఇంజన్ పరీక్ష విజయవంతం

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మనుషులను అంతరి క్షంలోకి పంపే లక్ష్యంలో ఇస్రో చేపడుతున్న ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టులో వినియోగించే 'వికాస్ ఇంజన్'ను విజయ వంతంగా పరీక్షించినట్టు ఇస్రో ప్రకటించింది. తమిళనాడు లోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరి ఇస్రో కేంద్రంలో ఈ పరీక్ష చేపట్టినట్టు పేర్కొంది. గగన్‌యాన్ ప్రాజెక్ట్‌లో ఉప యోగించే వికాస్ ఇంజన్‌ను బుధవారం 17 సెకన్లపాటు మండించి దాని పనితీరుని పరీక్షించామని ఇస్రో తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పర్యాటకానికి మచ్చ

ఉత్తరాఖండ్లో ఆదివారం హెలికాప్టర్ ప్రమాదం జరిగిన వెంటనే నిలిపివేసిన సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి తిరిగి అనుమతించింది. సర్కారు సరేనని అన్నప్పటికీ, వాతావరణం అనుకూలంగా లేక ఒక్క హెలికాప్టర్ కూడా ఆ రోజు గాలిలోకి లేవలేదని వార్తలు వచ్చాయి. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీకీ, రాష్ట్ర ప్రభుత్వానికీ ఈ మార్గంలో నడిచే హెలికాప్టర్ల సమర్థతమీద ఇంతలోనే అంతనమ్మకం ఎలా కుదిరిందో తెలియదు కానీ, ఏడుగురి ప్రాణాలు తీసిన ఆ ఘోర దుర్ఘటన ఒక తీవ్రహెచ్చరిక. లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం నింగిలోకి లేచిన కొద్దిక్షణాల్లోనే భగ్గుమన్న ఆ భయానక ఘటన మనలను ఇంకా వెంటాడుతూండగానే, కేదార్‌నాథ్ ఆలయానికి యాత్రికులను తీసుకువెడుతున్న ఈ హెలికాప్టర్ గౌరీకుండ్ అడవుల్లో కూలిపోయింది. మంటలురాజుకొని హెలికాప్టర్‌లో ఉన్నవారంతా మృతిచెందారు. ప్రతికూల వాతావరణమే ఈ ప్రమాదానికి కారణమని అనుకుంటున్నప్పటికీ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు జరిపి, కనీసం ప్రాథమికంగా ఓ అవగాహనకు వచ్చేవరకూ ఏదీ నిర్ధారించలేం.

హెలికాప్టర్ సేవలను సత్వరమే తిరిగి ఆరంభించిన ఈ నిర్ణయం వెనుక ప్రైవేటు సర్వీసుల ఒత్తిడికూడా పనిచేసివుండవచ్చు. పదిహేనేళ్ళ అనుభవం గల పైలట్ చేతిలో ఉంటూకూడా ఈ హెలికాప్టర్ చిగురుటాకులాగా వొణికి, కట్టుతప్పి కూలింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, హెలికాప్టర్‌ను పైలట్ సరిగా నియంత్రించలేకపోయారట. చార్‌ధామ్ యాత్ర ఆరంభమైన నెలన్నరలో ఈ తరహా ప్రమాదాలు ఐదు జరిగాయని మీడియా విశ్లేషిస్తోంది. మే 8న కూడా ఇటువంటి తీవ్రప్రమాదమే జరిగి ఆరుగురు ప్రయాణికులు మరణించారు. మూడు హెలికాప్టర్ ప్రమాదాల్లో అదృష్టవశాత్తూ ప్రాణనష్టం లేకున్నా మార్గమధ్యంలో ఇంజన్ విఫలమైనమాట నిజం. ఈ నేపథ్యంలో, ప్రతీప్రమాదాన్ని తీవ్రంగా పరిగణించి కారణాలను అన్వేషించడం, తగిన పరిష్కారాలతో ముందుకు వెళ్లడం ముఖ్యం. దట్టమైన పొగమంచువల్ల ముందున్న కొండను ఢీకొని ఈ హెలికాప్టర్ కూలివుండవచ్చు. అయితే, కేదార్‌నాథ్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం ఆరు దాటితే కానీ హెలికాప్టర్లు బయలుదేరకూడదన్న నియమం ఉన్నప్పటికీ, ఈ హెలికాప్టర్ 5.17 నిముషాలకే కుప్పకూలడాన్ని బట్టి చూస్తే ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్ సంస్థ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని అర్థం. ఎత్తయిన కొండలు, లోయలతో కూడిన ఈ ప్రాంతంలో, వాతావరణం కూడా నిలకడగా ఉండని పరిస్థితుల్లో, కనీసం తెల్లారేవరకూ కూడా ప్రైవేటు సంస్థలు ఆగలేకపోతున్నాయి. డబ్బుతప్ప వీటికి ప్రజల ప్రాణాలు పట్టడం లేదని, వీటిని నియంత్రించే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోతున్నదని విమర్శకులు అంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి హెలికాప్టర్ సంస్థలకోసం కఠినమైన నిబంధనావళిని తయారుచేయమన్నారు. సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటు ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటుచేస్తామన్నారు. ఈ ప్రమాదఘటనను సూమోటోగా స్వీకరించిన ఉత్తరాఖండ్ హైకోర్టు సోమవారం ప్రభుత్వాన్ని ఉద్దేశించి చక్కని ప్రశ్నలు వేసింది, సరైన సూచనలు చేసింది. హిమాలయసానువుల్లో హెలికాప్టర్లు నడిపే పైలట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తూండటం నుంచి, హెలికాప్టర్ల నిర్వహణ వరకూ అనేకం ఇందులో ఉన్నాయి. సర్వీసుల సంఖ్యను నిర్ణయించడం, నియంత్రించడం నుంచి ఉల్లంఘనకు పాల్పడిన సంస్థలను తీవ్రంగా శిక్షించడం వరకూ కోర్టు చాలా సూచనలు చేసింది. ఈ ఘోర ప్రమాదం తరువాతైనా ప్రభుత్వం తన మొహమాటాలు పక్కనబెట్టి గట్టిగా వ్యవహరించడం ముఖ్యం. కాలినడకన వెళ్ళలేనివారు, ఖర్చు భరించగలిగేవారు ఈ హెలికాప్టర్ సర్వీసుకు మొగ్గుచూపడం సహజం. సుదూరప్రాంతాలనుంచి సైతం సునాయాసంగా ఈ హెలికాప్టర్‌ను బుక్‌చేసుకోగలిగే మార్గాలూ పెరిగాయి. చార్‌ధామ్ యాత్రరద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచి, ఎక్కువ సొమ్ముచేసుకోవాలన్న తాపత్రయం ఈ ప్రైవేటు సంస్థలది. ఈ యాత్ర గురించి అధికవ్యయంతో విస్తృతప్రచారం చేస్తూ, మతపర్యాటకం నుంచి వచ్చే ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంటున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ హెలికాప్టర్ సంస్థల వీరంగానికి అడ్డుకట్టవేయాలి. ఎంతో భక్తితో, అధికశ్రమకోర్చి నాలుగు ధామాలను దర్శించవస్తున్నవారి అభీష్టాన్ని నెరవేర్చి, క్షేమంగా వెనక్కుపంపే బాధ్యత ప్రభుత్వంమీద ఉంది.

ధిక్కార ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి?

రెండు దేశాల మధ్య ఘర్షణలకు, ముఖ్యంగా సాయుధ సమరాలకు కారణాలను కేవలం వర్తమానంలోనే చూడకూడదు. గత చరిత్రలోకి కూడా వెళ్ళాలి. ఇది, ప్రస్తుతం భీకర యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్, రష్యా విషయంలో మరింత అవసరం. 24, ఫిబ్రవరి 2022న ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున సైనిక దాడిని ప్రారంభించడంతో ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మారింది. ఈ చర్యకు ముందు– 2021 చివర, 2022 ప్రారంభంలో శిక్షణ విన్యాసాలు పేరుతో ఉక్రెయిన్ సరిహద్దుల వెంబడి 1,00,000 మందికి పైగా తన సైనికులను రష్యా సమీకరించింది. ఫిబ్రవరి 21, 2022న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ప్రసంగంలో ఉక్రెయిన్‌ను సార్వభౌమ దేశంగా గుర్తించడాన్ని తిరస్కరించారు. అది సోవియట్ యూనియన్ సృష్టి అని, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌ను రష్యాకు వ్యతిరేకంగా యుద్ధానికి రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా మద్దతు గల, స్వయం–ప్రకటిత ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌లను స్వతంత్ర రాష్ట్రాలుగా గుర్తిస్తున్నట్టు అదే ప్రసంగంలో ఆయన ప్రకటించారు. పిదప, మూడు రోజుల తర్వాత (ఫిబ్రవరి 24) ఉక్రెయిన్‌పై ప్రత్యేక సైనిక చర్యకు పుతిన్ ఆదేశించారు.

రష్యా సైన్యం రష్యా, బెలారస్, ఆక్రమిత క్రిమియా నుంచి బహుళ దిశలలో ఉక్రెయిన్‌పై దాడి చేసింది. కీవ్, ఖార్కివ్, డాన్‌బాస్ ప్రాంతంలోని కీలక నగరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడి, 2014 నుంచి కొనసాగుతున్న సంఘర్షణను తీవ్రతరం చేసింది. నాటో, యూరోపియన్ యూనియన్‌తో ఉక్రెయిన్ సన్నిహితంగా ఉండకుండా నిరోధించడం, ఆ దేశంపై రష్యా నియంత్రణను పూర్తి స్థాయిలో స్థాపించడం అనే భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు ఆ దాడి వెనుక ఉన్నాయి. ఉక్రెయిన్ లాంటి ఒక చిన్న దేశం పొరుగున ఉన్న ఒక అగ్రరాజ్యంతో తలపడటంలో (అమెరికా, ఐరోపా దేశాల మద్దతుతోనే అయినప్పటికీ) ఆ చిన్న దేశ ప్రజలు, మేధావుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవలేదు. ఇందుకు బలమైన కారణాలు తప్పక ఉంటాయి. ఈ కోణంలో చరిత్ర విలోకిస్తే ఉక్రెయిన్, రష్యాల మధ్య శతాబ్దాల ప్రగాఢ సంబంధాలు ఉన్నాయి. సాంస్కృతిక, రాజకీయ సంబంధాలూ బలంగానే ఉండేవి. అదే సందర్భంలో విభేదాలు, హింసతో కూడిన సంఘటనలు చాలానే ఉన్నాయి.

ఉక్రెయిన్ 18, 19 శతాబ్దాలలో రష్యన్ సామ్రాజ్యంలో భాగమైంది. రష్యనీకరణ విధానాలు ఉక్రెయిన్ భాష, సంస్కృతుల గుర్తింపును అణచివేశాయి. రష్యన్ విప్లవం తర్వాత ఉక్రెయిన్ స్వల్పకాలం (1917–20) స్వతంత్ర దేశంగా వర్ధిల్లింది. ఆ తరువాత సోవియట్ యూనియన్‌లో బలవంతంగా చేర్చబడింది. జోసెఫ్ స్టాలిన్ హయాం (1924–53)లో ఉక్రెయిన్‌పై కఠిన విధానాలు అమలు చేశారు. జార్ చక్రవర్తుల వలే స్టాలిన్ కూడా ఉక్రెయిన్‌ను సోవియట్ నియంత్రణలో ఉంచడానికి, రష్యనీకరణను ప్రోత్సహించడానికి శతథా ప్రయత్నించారు. ఉక్రెయిన్ సంస్కృతి, భాష, జాతీయ గుర్తింపును అణచివేశారు. మొదటి నుంచి ఉక్రెయిన్ ప్రజలలో జాతీయవాద చైతన్యం బలంగా ఉంది. ఈ విషయాన్ని నొక్కి చెప్పేందుకు Anne Applebaum (పోలిష్–అమెరికన్ జర్నలిస్ట్, చరిత్రవేత్త) తన రచన 'Red Famine: Stalin's War on Ukraine' ఒక కవితను ఉటంకించారు: 'నేను చనిపోయినప్పుడు / నన్ను నా ప్రియమైన ఉక్రెయిన్‌లో ఖననం చేయండి/ ఒక ఎత్తైన సమాధి కొండపై/ విశాలమైన సమతల భూమిలో/ అక్కడ నా కళ్లు చూడగలవు, నా చెవులు వినగలవు/ విశాలమైన పొలాలను, అపారమైన పచ్చిక బయళ్ళను/ డ్నీపర్ నది ఒడ్డును/ గర్జించే శక్తివంతమైన నది శబ్దాన్ని'.



నాడు సోవియట్ రాజ్యంగాను, నేడు స్వతంత్ర దేశంగాను ఉక్రెయిన్ ఒక దుఃఖమయ భూమి. ఈ చిన్న దేశం విలక్షణ అస్తిత్వాన్ని అణచివేసేందుకు జోసెఫ్ స్టాలిన్ భయంకర కృత్రిమ కరువును సృష్టించగా, వ్లాదిమిర్ పుతిన్ దురాక్రమణకు పాల్పడుతున్నాడు. ఈ అన్యాయాలకు ఉక్రెయిన్ అప్పుడు ఆక్రోశించింది, నేడు ప్రతిఘటిస్తోంది. ఫలితమే రష్యాతో ప్రస్తుత యుద్ధం.

1920ల చివరలో స్టాలిన్ నిర్బంధ సమిష్టి వ్యవసాయ వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టారు. రైతులు తమ వ్యక్తిగత భూములను వదులుకొని సోవియట్ నియంత్రిత సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో పనిచేయవలసి వచ్చింది. ఇందుకు వ్యతిరేకించిన రైతులను, ముఖ్యంగా 'కులక్స్' అని పిలిచే సంపన్న రైతులను వర్గ శత్రువులుగా చిత్రీకరించి, వారి భూములు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వేలాది రైతులను సైబీరియాకు బహిష్కరించారు. మేధావులు, రచయితలు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను వ్యతిరేకించిన రాజకీయ నాయకులను సోవియట్ వ్యతిరేకులుగా ముద్రించి అరెస్టు చేశారు. చాలా మందిని హత్య చేశారు. సోవియట్ యూనియన్ పారిశ్రామికీకరణకు నిధులు సమకూర్చడానికి ఉక్రెయిన్ నుంచి భారీ మొత్తంలో ధాన్యాన్ని సేకరించారు, దీనివల్ల స్థానిక రైతులకు ఆహార కొరత ఏర్పడింది. 1932–33లో స్టాలిన్ విధానాల ఫలితంగా హోలోడోమోర్ (Holodomor) అనే భయంకరమైన కృత్రిమ కరువు ఉక్రెయిన్‌లో సంభవించింది. 'హోలోడోమోర్' అనే పదానికి ఉక్రెయిన్ భాషలో అర్థం 'ఆకలితో చావు' (death by hunger). ఇది 1932 నుంచి 1933 మధ్య సోవియట్ ఉక్రెయిన్‌లో సంభవించిన ఒక మహా కాటకం. ఈ విపత్తులో 35 నుంచి 50 లక్షల వరకు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సహజ విపత్తు కాదని, జోసెఫ్ స్టాలిన్ నేతృత్వంలోని సోవియట్ పాలకుల విధానాల ఫలితంగా సృష్టించబడిన విపత్తుగా చరిత్ర గుర్తించింది. దీనిని కొంత మంది చరిత్రకారులు జాతి నిర్మూలన (genocide)గా ప్రకటించారు.

స్టాలిన్ ప్రవేశపెట్టిన సమిష్టి వ్యవసాయ విధానం వల్ల ఉత్పత్తి తగ్గినప్పటికీ, సోవియట్ అధికారులు అసాధారణంగా అధిక ధాన్య సేకరణ కోటాలను విధించారు. కోటాలను పరిపూర్తి చేయలేని గ్రామాల నుంచి ధాన్యాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. రైతులను ఆహారం లేకుండా వదిలేశారు. ఉక్రెయిన్ గ్రామాలను 'బ్లాక్‌లిస్ట్' చేసి, ఆహార సరఫరాను నిషేధించారు. ఈ కరువు ఉక్రెయిన్ జాతీయవాదాన్ని అణచివేయడానికి, సోవియట్ నియంత్రణను బలోపేతం చేయడానికి ఉద్దేశపూర్వకంగా ఉపయోగించబడిందని చరిత్రకారులు భావిస్తారు. ఈ కరువు వల్ల గ్రామాలు ఖాళీ అయ్యాయి. వేలాది కుటుంబాలు ఆకలితో మరణించాయి. ఉక్రెయిన్ సమాజంపై ఈ కరువు దీర్ఘకాలిక ప్రభావం చూపింది. ఉక్రెయిన్లలో రష్యాపై ద్వేషం, స్వీయ జాతీయతా చైతన్యం బలపడ్డాయి.

కరువు వల్ల ఆహారం దొరకక కొంతమంది ఉక్రెయిన్ ప్రజలు బతకడానికి నరమాంస భక్షణకు (cannibalism) పాల్పడ్డారు. సోవియట్ పోలీసు ఆర్కైవ్‌లు ఆకలితో పిచ్చివాళ్లైన వ్యక్తుల పైనాలు, క్షుదార్తులు శవాలను తిన్న సందర్భాలను రికార్డు చేశాయి. కొంత మంది తమ సొంత పిల్లలను తిన్న సందర్భాలూ ఉన్నాయి! తమని తినేస్తారని పిల్లలు తల్లిదండ్రుల నుంచి పారిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. Robert Conqest పుస్తకం 'The Harvest of Sorrow: Soviet Collectivization and the Terror–Famine', పైన ప్రస్తావించిన Anne Applebaum పుస్తకం 'Red Famine: Stalin's War on Ukraine'లో ఈ కృత్రిమ కాటకం వివరాలు విపులంగా ఉన్నాయి.

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ఉక్రెయిన్ మళ్లీ స్వతంత్ర దేశంగా ప్రభవించింది. అయితే రష్యాతో సంబంధాలలో ఉద్రిక్తత కొనసాగుతూనే వచ్చింది. సరిహద్దు, ఇంధనం ఇత్యాది విషయాలలో వివాదాలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో 24 ఫిబ్రవరి 2022న ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి దాడికి రష్యా ఉపక్రమించింది. ఈ యుద్ధంలో ఇప్పటికే లక్షలాది ప్రజలు మరణించారు, మరెన్నో లక్షల మంది నిరాశ్రయులు అయ్యారు. నగరాలకు నగరాలే ధ్వంసమయ్యాయి. రష్యా పశ్చిమ దేశాలను నిందిస్తోంది. యూరోపియన్ యూనియన్/నాటోతో ఉక్రెయిన్ తన సంబంధాలను కొనసాగిస్తోంది.

చారిత్రక దృష్టికోణం నుంచి పరిశీలిస్తే ఈ యుద్ధం ఒక లోతైన సమస్య. సోవియట్ యుగం తర్వాత ఏర్పడే రాజకీయ వ్యవస్థ ఎలా ఉండాలి, సమాజం ఎలా రూపుదిద్దుకోవాలి అనే అంశాలపై జరుగుతున్న పోరాటమిది. ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో ఏర్పడిన ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థకు పుతిన్ విసిరిన సవాలులో భాగమే ఈ యుద్ధం. అందువల్ల, ఈ ఘర్షణకు పరిష్కారం కేవలం ఉక్రెయిన్ స్థానిక స్థాయిలో సాధ్యపడదు. అంతర్జాతీయ స్థాయిలో, విశాలమైన చట్రంలో మాత్రమే దీనికి పరిష్కారం సాధ్యమవుతుంది. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడం అనేది స్థానికం కాదు, ప్రపంచ స్థాయిలో చర్చించాల్సిన అంశం. అయితే వర్తమాన సందర్భంలో అది సాధ్యమయ్యేలా లేదు. ఉక్రెయిన్ నాటో సభ్య దేశమైతే అనివార్యంగా రష్యాకు పక్కలో బల్లెం అవుతుందనేది వాస్తవం. అటువంటి పరిస్థితిని నివారించుకోవటం రష్యాకు అత్యవసరం. అమెరికాతో పాటు ఐరోపా దేశాలన్నీ రష్యాకు వ్యతిరేకంగానే ఉన్నాయి. సోవియట్ యూనియన్ కాలంలో రష్యా పాల్పడిన చారిత్రక తప్పిదాలు దాన్ని ఇప్పటికీ వెంటాడుతున్నాయి. ఐరోపా దేశాల అవకాశవాదంతో పాటు, రష్యా చారిత్రక తప్పిదాలు ఉక్రెయిన్‌కి శక్తినిస్తున్నాయి. జర్మన్ తాత్వికుడు నీషె అన్నట్టు When you look long into an abyss, the abyss also looks into you. అవకాశవాద శక్తులనుంచి వస్తున్న సహాయంతో ఉక్రెయిన్ నిలబడగలదా?

■ ప్రొ. బి.తిరుపతిరావు
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

నాడు కీర్తి కేసీఆర్‌కు, నేడు నింద ఇంజనీర్లకు!

నాడు కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త కర్మ క్రియ అంతా తానేనని గొప్పలు చెప్పుకున్నారు కేసీఆర్. కానీ నేడు కాళేశ్వరం అవినీతిపై విచారిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పినాకి చంద్రఘోష్ ముందు మాత్రం పూర్తి యూటర్న్ తీసుకున్నారు. అర్హతలేని, అస్థిర ప్రాజెక్టుకు అప్పుడు ఎంత కీర్తి వచ్చినా ఫర్వాలేకపోయింది. కానీ ఇప్పుడు చంద్రఘోష్ కమిషన్ ముందు అంతా నేనే అని గొప్పలు చెబితే శిక్ష ఖాయం. అందుకే, చేసిందంతా ఇంజనీర్లేనని నేరాన్ని వారిపైకి నెట్టేశారు.

పంపు హౌస్‌హెడ్‌కు తాకేంత వరకు నీటిని నిల్వ చేయాలని తాను ఆదేశాలు ఇవ్వలేదని చంద్రఘోష్ కమిషన్‌కు చెప్పి కేసీఆర్ సురక్షితంగా తప్పించుకున్నారు. బ్యారేజీల కోసం స్థలాల ఎంపిక పూర్తిగా సాంకేతికంగానే జరిగిందన్నారు. కాళేశ్వరం నిర్మాణం కోసం నిధులు సమీకరించేందుకే ఇరిగేషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే నిధులతో ఆ రుణాలను తిరిగి చెల్లించాలనుకున్నామనీ, కానీ వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదనీ వివరించారు.



తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదంటూ తలపెట్టిన కాళేశ్వరం రీ–డిజైనింగ్, రీ–ఇంజనీరింగ్ ప్రాజెక్టు బడ్జెట్ భారీగా పెంచి దోచుకోవడం కోసమే తప్ప, తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కోసం కాదు. 148 మీటర్ల తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం కొరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రితో ఒప్పందం కుదుర్చుకున్న కేసీఆర్ మరి దానికి అనుగుణంగా 148మీ. తుమ్మిడిహట్టి ఎందుకు నిర్మించలేదు?

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదంటూ తలపెట్టిన కాళేశ్వరం రీ–డిజైనింగ్, రీ–ఇంజనీరింగ్ ప్రాజెక్టు బడ్జెట్ భారీగా పెంచి దోచుకోవడం కోసమే తప్ప, తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కోసం కాదు. 2014 నుంచి 2022 వరకు కొనసాగిన బీఆర్ఎస్, బీజేపీ బంధం పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికగా ఇదంతా మొదలైంది. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదు అనే సీడబ్ల్యూసీ పత్రం బీఆర్ఎస్–బీజేపీ మైత్రిలో భాగంగా సృష్టించబడింది. ప్రతిఫలంగా రాష్ట్రపతి ఎన్నిక, వ్యవసాయ చట్టాలు, నోట్ల రద్దు తదితర బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు నిచ్చింది. ఈ పవిత్ర బంధం తెగిన తర్వాత కాళేశ్వరం కేసీఆర్ కుటుంబపు ఏటీఎం అన్న ఆరోపణతో మోదీ, అమిత్ షాలు, రాష్ట్ర నాయకుల మాటల తూటాలు మర్చిపోలేం.

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదనేది ఎంత కల్పితమో కాళేశ్వరం బ్యారేజీల అవినీతి అక్రమాలపై చీల్చి చెండాడిన ఎన్డీఎస్ఏ నివేదిక నిగ్గు తేల్చింది. 2022–23లో మేడిగడ్డ నుంచి విడుదలైన నీరు 4,628 టీఎంసీలు. 2019–20లో 2046 టీఎంసీలు. 2021–22లో 2,671 టీఎంసీలు. 2023–24లో మేడిగడ్డ అయిదు అడుగులు కుంగి, మూడు అడుగుల వెడల్పుతో నిట్టనిలువునా చీలిన ఏడాది 1942 టీఎంసీల నీరు విడుదలైంది. పై అయిదేళ్లలో మొత్తం 13,151 టీఎంసీల నీటిని మేడిగడ్డ విడుదల చేసింది. ఇందులో 85–90 శాతం నీరు తుమ్మిడిహట్టి ప్రాణహిత నుంచి వచ్చిందే. ప్రాణహిత నది లేకపోతే మేడిగడ్డ వద్ద బ్యారేజీ అనే ఆలోచన కేసీఆర్‌కు కలలో కూడా రాదు. పచ్చి అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేసి ప్రజలను వంచించగల దిట్టలు వీరు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీకి 148 మీటర్ల ఎత్తునే అనుమతిస్తామని; 152 మీటర్ల ఎత్తుకు ఒప్పుకొనేదిలేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారని కేసీఆర్ కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. ఇందువల్లనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. 100 మీటర్ల మేడిగడ్డతో పాటు, 148 మీటర్ల తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం కొరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రితో ఒప్పందం కుదుర్చుకున్న కేసీఆర్ మరి దానికి అనుగుణంగా 148 మీ. తుమ్మిడిహట్టి ఎందుకు నిర్మించలేదు? 'వార్ధ ప్రాజెక్టు' తదితర పేర్లతో ప్రజలను వంచించలేదా?

వ్యాప్కోస్ లైడార్ సర్వే మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉందని నిర్ణయించగా, ఆ నివేదిక ఆధారంగా బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం తీసుకున్నామని కేసీఆర్ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు. 2023 మే 3న సీబీఐ దాడులు జరిపి వ్యాప్కోస్ సీఎండీ రాజిందర్ గుప్తా ఇంట్లో రూ.38 కోట్లు; నోయిడా తదితర ప్రాంతాలలో విలువైన రియల్ ఎస్టేట్ భూములు విల్లాల రిజిస్ట్రేషన్ పత్రాలు; భారీగా నగలను జప్తు చేసి, ఆయన్ని జైల్లో పెట్టింది. ఈ డబ్బంతా తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదనే సాకుతో బ్యారేజీ స్థలాన్ని మేడిగడ్డకు మార్చే పాపకార్యం కోసం వెచ్చించింది కాదా? ఇదంతా కాళేశ్వరం అవినీతి సొమ్ము కాదా? ఇదే వ్యాప్కోస్ తుమ్మిడిహట్టే అత్యంత అనుకూలమంటూ 2008లో వైయస్సార్ కాలంలో సర్వే నివేదిక ఇచ్చింది నిజం కాదా?

తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ కట్టలేమని నిర్ధారణకు వచ్చిన తర్వాత, గోదావరిలో ఏప్రాంతాలు బ్యారేజీ నిర్మాణానికి అనుకూలమో వ్యాప్కోస్ నివేదిక ఇచ్చింది. అంతకు ముందే హై పవర్ కమిటీ సిఫారసు చేసింది. కేసీఆర్ రాజ్యంలో ఈ హైపవర్ కమిటీ ఒక డమ్మీ. అధినాయకుడి ఆదేశాలను తూచ తప్పకుండా పాటించడమే ఇందులోని సభ్యుల విధి. అనుకూలంగా నివేదిక ఇచ్చినందుకు, అధినాయకుడి సేవలో తరించినందుకు, ఈ కమిటీలో చాలామందిని పై పదవులు వరించాయి. పదవీ విరమణ తర్వాత కూడా వీరందరికీ కేసీఆర్ ప్రభుత్వ కాలమంతా ఎక్స్‌టెన్షన్ ఇచ్చి కొనసాగించారు. నిజానికి బ్యారేజీల ఎంపిక సాంకేతికమైనదీ కాదు; వ్యాప్కోస్ లేదా హైపవర్ కమిటీల నిర్ణయమూ కాదు. ఈ బ్యారేజీలన్నీ కేసీఆర్ మానస పుత్రికలు. అందువల్లనే అన్ని బ్యారేజీలు, ఎక్కడా లేని విధంగా, గోదావరి నీళ్లను ఎదురు అదేనదిలో పైకి ఒక టీఎంసీకీ కోట్ల రూపాయల ఖర్చుతో ఎత్తిపోస్తాయి. పై నుంచి వచ్చే భారీ వరద, ఎత్తిపోసిన నీళ్లను, దిగువ సముద్రం తన్నుకుపోతుంది. ఐదేళ్లలో ఎత్తిపోసిన 162 టీఎంసీల్లో, 63 టీఎంసీల ఎత్తిపోతల నీళ్లన్నీ తిప్పిపోతలై సముద్రంలో కలిశాయి.

కేసీఆర్ చెప్తున్నట్టు– కాళేశ్వరం కార్పొరేషన్ తీసుకున్న రుణాలను ఆ ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే లాభాలతో చెల్లించడం సాధ్యం కాదనేది జగమెరిగిన సత్యం. ఎందుకంటే కాళేశ్వరం భారీ ఎత్తిపోతల ప్రక్రియ, ఆర్థికంగా ఏ మాత్రం ఆచరణ సాధ్యం కానిది. లాభాలు సాధించటమనేది బోగస్. బ్యాంకులు, కేంద్ర సంస్థలు అసలు, భారీ వడ్డీలు పొందుతుండగా, ప్రజల సేవలకు భారీగా కోత పడింది. ప్రభుత్వం ద్వారా వేగవంతమైన సేకరణ, వేగవంతమైన దోపిడీ కుదరదన్న కారణంతో కార్పొరేషన్ పేరిట వేగంగా రుణాలు సేకరించారన్నది వాస్తవం. ఇప్పుడు నెలనెలా అసలూ వడ్డీలు చెల్లించేది మాత్రం కోట్లాది సామాన్య జనం!

• సైనాల గోవర్ధన్

సర్కార్ బడులకు పూర్వ వైభవం తేవాలి

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు వేలాది మంది పిల్లలతో కళకళలాడేవి. ఊళ్లలో చదువుకోవడానికి పిల్లలకు సర్కారు బడులే ఉండేవి. పెద్దపెద్ద పట్టణాలలో మాత్రమే ఒకటి, రెండు ప్రైవేటు స్కూళ్లు ఉండేవి. అయినా ఎక్కువ మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేవారు. ధనవంతులు, పేదలు అన్న తేడా లేకుండా ఒక కుటుంబంలా అందరూ ఒకే దగ్గర విద్యనభ్యసించేవారు. ఇప్పుడు పెద్ద పెద్ద హోదాల్లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు.. ఉన్నతోద్యోగాలు చేస్తున్న వారిలో ఎక్కువ మంది సర్కారు బడుల్లో చదివినవారే. వ్యాపారాల్లోనూ దిగ్గజాలుగా ఎదిగి స్థిరపడినవారెందరో సర్కారు బడుల్లో చదివినవారే. అలాంటి సర్కారు బడులకు మళ్లీ పూర్వ వైభవం రావాలి. అది జరగాలంటే ప్రజలే చైతన్యవంతులు కావాలి. ఇటీవల కొంతమంది ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులుండగా, మూడు రోజుల్లోనే ఆ సంఖ్య 130కి చేరింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్‌కే సయ్యద్ తన కూతురును, వీఆర్ఏగా పనిచేస్తున్న పెసర మహేష్ తన కుమారుడిని, నవోదయ పాఠశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పెద్దారపు సంపత్ తన కూతురును ప్రభుత్వ బడులలో చేర్పించారు. అలాగే సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు అందె అశోక్ తన కుమారుడిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. గ్రామ, మండల స్థాయిలలోని అధికారులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన పక్షంలో స్థానికులకు స్ఫూర్తి కలుగుతుంది. సర్కారు బడులకు పూర్వ వైభవం తెచ్చేలా ఉపాధ్యాయులు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడితే, మార్పు తప్పకుండా వస్తుంది.

– గడ్డమీది శ్రీనివాస్

గతం తెలిసీ కాళేశ్వరంపై ఎందుకీ నిందలు?

సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలంతా పదే పదే వేస్తున్న ప్రశ్న: తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ఎందుకు రీడిజైన్ చేయాల్సి వచ్చింది? ఇది వింటున్నప్పుడల్లా నిజంగానే వారికి సమాధానం తెలియదా? అనిపిస్తుంది.

2007లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుత కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి, నీటిని ఎత్తిపోస్తూ చేవెళ్ల వరకు తరలించాలని భావించారు. ప్రాజెక్టు పనులను 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించి మహారాష్ట్రతో ఎటువంటి ఒప్పందం చేసుకోకుండానే, తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ పనులు తప్ప అన్ని ప్యాకేజీల్లో ఏక కాలంలో పనులు ప్రారంభం అయినాయి. ఇదిలా ఉండగానే ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.40,300 కోట్లకు సవరించి, 2010లో ఆ డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపింది రాష్ట్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. కానీ 2014 జూన్ వరకు ఈ ప్రాజెక్టుపై అప్పటికి ఖర్చు చేసింది రూ.7వేల కోట్లు మాత్రమే. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాలని ఏపీ ప్రతిపాదించగా, అప్పుడు మహారాష్ట్రలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే బ్యారేజీ ఎత్తు 148 మీటర్లు మించకూడదని అభ్యంతరం తెలిపింది. ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. నిధుల కేటాయింపులో జాప్యం, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వంటివి కూడా ఆలస్యానికి కారణమయ్యాయి. కొన్ని ప్యాకేజీల్లో కాంట్రాక్టర్లు పనులు అర్ధాంతరంగా వదిలేసి, సామగ్రిని వెనక్కి తీసుకెళ్లిన సందర్భాలున్నాయి.

ప్రాణహిత ఎత్తిపోతల పథకం ప్రారంభించినప్పుడు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. మహారాష్ట్రలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది. మరి ప్రాజెక్టు ఎందుకు ముందుకు కదల్లేకపోయింది? మహారాష్ట్రలో అప్పుడు కాంగ్రెస్ అయినా, తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ అయినా– తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించడానికి ఎంతమాత్రం ఒప్పుకోలేదు. అలాగని బ్యారేజీ ఎత్తును 148 మీటర్లకు తగ్గిస్తే ప్రాజెక్టు లక్ష్యమే దెబ్బతింటుంది. ఎత్తిపోయడానికి తగినంత నీరే ఉండదు. ఇది రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు తెలియదా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టిపెట్టిన కేసీఆర్ ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని భావించారు. బ్యారేజీ ఎత్తు గురించి మహారాష్ట్రతో ఎన్నోసార్లు చర్చలు జరిపారు కానీ, ఏకాభిప్రాయం కుదరలేదు. అదే సమయంలో తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే అనుకున్నంత స్థాయిలో నీటి లభ్యత ఉండదని సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయి. ఎత్తిపోతల పథకం మరింత ప్రభావవంతంగా ఉండాలంటే ఇందులో భాగమైన అన్ని రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించాయి. మహారాష్ట్ర అభ్యంతరాలు, నీటి లభ్యతపై అనుమానాల నేపథ్యంలో కేసీఆర్ పునరాలోచనలో పడ్డారు. నిపుణుల సలహాలు తీసుకున్నారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మిస్తే ఎత్తిపోతలకు సరిపడా నీటి లభ్యత పెరుగుతుందని గుర్తించారు. ఆ తర్వాత ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి రీడిజైన్ చేయించారు. ఇక్కడ ప్రధానమైన విషయం ఏంటంటే– ఇప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టులో 90 శాతం ప్రాణహిత–చేవెళ్ల డిజైనే. ప్రాణహిత పథకంలో తుమ్మిడిహట్టి నుంచి నీటిని ఎత్తి ఎల్లంపల్లిలో నింపాల్సి ఉండగా, రీడిజైన్ ద్వారా గోదావరి నదిపైన కాళేశ్వరం దిగువన మేడిగడ్డ దగ్గర, ఎగువన అన్నారం, సుందిళ్ల దగ్గర, మొత్తం మూడు పెద్ద బ్యారేజీలు నిర్మించి, ఆ నీటిని అంచెలంచెలుగా ఎల్లంపల్లి వరకు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి వివిధ రిజర్వాయర్లకు తరలిస్తారు.



ప్రాణహిత ఎత్తిపోతల పథకం ప్రారంభించినప్పుడు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. మహారాష్ట్రలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది. మరి ప్రాజెక్టు ఎందుకు ముందుకు కదల్లేకపోయింది?

ప్రాణహితకు రీడిజైన్ చేసి, కొత్త బ్యారేజీల నిర్మాణం పేరుతో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై నేను అడిగేది ఒక్కటే. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు నాటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపాదించిన అంచనా వ్యయం రూ.17,875 కోట్లు. ఏ పనీ చేయకుండానే ఆ వ్యయాన్ని ఏడాదిన్నరలోనే రూ.38,500 కోట్లకు పెంచారు. ఆ తర్వాత కేంద్రానికి డీపీఆర్ పంపినప్పుడు రూ.40,300 కోట్లకు పెంచారు. ఇది 2010లో. కాళేశ్వరం మొదలైంది 2016–17లో. ఎనిమిదేండ్ల తర్వాత కూడా అదే అంచనా వ్యయంతో, కొత్తగా మూడు పెద్ద బ్యారేజీలు, మూడు అనుబంధ పంప్ హౌజ్‌లు, అనేక రిజర్వాయర్లతో నిల్వ సామర్థ్యాన్ని, పంపింగ్ సామర్థ్యాన్ని పెంచి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం సాధ్యమేనా?

కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నట్టు కాళేశ్వరం డిజైన్ కేసీఆర్ చేతితో గీయలేదు. మేడిగడ్డలో బ్యారేజీని గుడ్డిగా అనుమతించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు రీ–ఇంజనీరింగ్‌లో, ముఖ్యంగా బ్యారేజీల స్థలాల ఎంపిక, నీటి లభ్యత అంచనా వంటి సాంకేతిక అంశాల్లో వ్యాప్కోస్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ కీలకపాత్ర పోషించింది. ఇది ఒక ప్రముఖ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ. తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థన మేరకు వ్యాప్కోస్ సంస్థ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి లైడార్ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ఆధారంగా 2016 జనవరి 17న వ్యాప్కోస్ మూడు బ్యారేజీల (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల) నిర్మాణాన్ని ప్రతిపాదించింది. ఈ నివేదిక ఆధారంగానే మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణ నిర్ణయం తీసుకున్నారు.

ముఖ్యమైన విషయం ఏంటంటే..: ప్రాణహిత నది వెన్‌గంగా, వార్ధా అనే రెండు నదుల సంగమం. వార్ధా మహారాష్ట్రలో పుడితే, వెన్‌గంగా మధ్యప్రదేశ్‌లో పుడుతుంది. అవి బంగాళాఖాతం వైపు ప్రయాణిస్తూ మహారాష్ట్రలోని గడ్చిరోలి దగ్గర కలుస్తాయి. అక్కడి నుంచి దీన్ని ప్రాణహిత నది అని అంటారు. అంతకుముందు వార్ధాలో మరో ఉప నది పెన్‌గంగా మహారాష్ట్రలోని చాందా జిల్లాలో కలుస్తుంది. అంటే, ప్రాణహిత నది అనేది వెన్‌గంగా, పెన్‌గంగా, వార్ధా అనే మూడు నదుల కలయిక అన్నమాట. ఇక గోదావరి, ప్రాణహిత నదులు తెలంగాణలోని కాళేశ్వరం వద్ద కలుస్తాయి. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నది. అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే కేవలం ప్రాణహిత నీళ్లే ఆ ప్రాజెక్టుకు ఆధారం. కానీ, ప్రాణహిత నది తెలంగాణలోకి ప్రవేశించిన తర్వాత కాళేశ్వరం వద్ద గోదావరి నదిని కలిసే ముందు 116 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో ఆ నది కుడివైపున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎన్నో వాగుల (1.పెద్దవాగు, 2.ఎర్రవాగు, 3.వట్టివాగు, 4.నీల్వాయి, 5.గొల్లవాగు, 6.చెలిమెల వాగు, 7.ర్యాలివాగు, 8.జైపూర్ వాగు) నుంచి వరదనీటిని తీసుకువస్తుంది. ఈ 116 కిలోమీటర్ల ప్రవాహంతోనే ప్రాణహిత నది గోదావరిలోకి 120 టీఎంసీల నీటిని తీసుకువస్తుంది. భవిష్యత్తులో మహారాష్ట్రలో వెన్‌గంగా, వార్ధా నదులపై ప్రాజెక్టులు కట్టుకున్నా.. ఈ 120 టీఎంసీల లభ్యతపై ఎలాంటి ప్రభావం ఉండదు. ప్రాణహిత ప్రాజెక్టుకు రీడిజైన్ చేయడానికి తుమ్మిడిహట్టి వద్ద మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించడంతో పాటు ఇది మరో ముఖ్యమైన కారణం.

మే 15వ తేదీన సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సరస్వతీ పుష్కరాలకు వెళ్లి కాళేశ్వరం దేవాలయం వద్ద స్నానం చేశారు. ఎండకాలం కూడా గోదావరి నీళ్ల పరవళ్లను చూసిన వాళ్లు.. 'ఓహో మేడిగడ్డ వద్ద ఇంత మేర నీటిని ఒడిసిపట్టుకోవచ్చని కేసీఆర్ ముందే ఊహించారేమో... దార్శనికత, దూరదృష్టి అంటే నిజంగా ఇదే కావచ్చు..' అని వారిరువురు మనసులో తప్పక అనుకొని ఉంటారు.



◆ బోయినపల్లి వినోద్‌కుమార్
పార్లమెంటు మాజీ సభ్యులు

లక్ష కొట్టు.. కాంట్రాక్టు పట్టు.. అన్నాడు!

- మహబూబాబాద్ విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేష్ వేధింపులు
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్లు
- రూ.80 వేలు పుచ్చుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- మహబూబాబాద్‌లో ఉలిక్కి పడిన అధికారులు


ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన విద్యుత్ ఎస్ఈ నరేష్

మహబూబాబాద్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారుల వలకు ఓ అవినీతి తిమింగలం చిక్కింది. విద్యుత్ శాఖలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పని చేస్తున్న జనగాం నరేష్ మానుకోట పట్టణంలోని తన ఇంటిదగ్గర క్లాస్-1 కాంట్రాక్టర్ల నుంచి బుధవారం ఉదయం రూ. 80 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి గాను మహబూబాబాద్ జిల్లా మరిపెడ, కురవి మండలాల పరిధిలో విద్యుత్ లైన్ మెయింటినెన్స్, రిపేరు కోసం రూ.20లక్షలతో టెండర్లను పిలిచారు. ఇద్దరు వ్యక్తులు అతి తక్కువకు టెండర్ వేయడంతో ఎస్ఈ నరేష్ నిరాకరించారని, తదుపరి ఆ టెండర్ కోసం చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఎస్కె అజారుద్దీన్, ఎస్కె నజీరుద్దీన్ ఇద్దరు క్లాస్-1 కాంట్రాక్టర్లు టెండర్ అలాట్‌మెంట్ కోసం దరఖాస్తు (మిగతా 7వ పేజీలో)


మందలించినందుకు ప్రాణం తీశారు..

- కుమార్తె ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతుండగా కోపగించిన తండ్రి
- కట్టేసి కొట్టిన భార్య, కుమార్తెలు, ప్రియుడు
- ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి



భర్త ధరావత్ కిషన్‌ను భార్య, కుమార్తెలు తాడుతో కట్టేసిన దృశ్యం

మరిపెడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని డీఎస్ఆర్ జెండాల తండాలో దారుణం చోటు చేసుకుంది. కుమార్తె ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడుతుంటే మందలించినందుకు భర్తను భార్యతో పాటు ఆమె కుమార్తెలు, మరొక వ్యక్తి కొట్టి చంపారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం మరిపెడ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై బొలగాని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మంగళిబండ తండాకు చెందిన ధరావత్ కిషన్(42)కు మరిపెడ మండలం డీఎస్ఆర్ జెండాల తండాకు చెందిన జంగ్నికి 25ఏళ్ల కిందట వివాహమైంది. కిషన్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో (మిగతా 7వ పేజీలో)



విప్లవ స్వాప్నికుడు.. వెనుదిరగని యోధుడు

ముగిసిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేశ్ ప్రస్థానం

'నల్లని రేగళ్ల ఎర్రని మల్లెలు... నెత్తురోసుకున్న నేల.. తల్లీ నా వెలిశాల'.. అంటూ పోరుగడ్డను విప్లవోద్వేగంతో కీర్తించాడు ఓ కవి. వెలిశాల మారుమూల పల్లె మాత్రమే కాదు. అది ఉగ్గుపాలతో ఉద్యమాలను నేర్పించిన నేల.. దిక్కులను శాసించేందుకు శక్తులను కన్న గడ్డ.. ఎర్రెర్రని పోరు విత్తనాలను పంచిన క్షేత్రం.. విప్లవోద్యమానికి చుక్కానిగా, సాయుధపోరుకు ప్రేరణగా వెలిగిన స్థలం. ఇప్పుడా పల్లె మరోసారి వార్తల్లోకి ఎక్కింది. తన ఒడిలో కన్నుతెరిచి, విప్లవమే శ్వాసగా పోరు సాగించిన తన బిడ్డ అమరుడు కావడంతో దుఃఖసముద్రంలో మునిగింది. గాజర్ల రవి అలియాస్ గణేష్(56) ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో వెలిశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. దళసభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ఎదిగిన గణేశ్.. నమ్మిన సిద్ధాంతం కోసం మడమ తిప్పని యోధుడిగా సాయుధ ప్రస్థానం సాగించారు. తన చివరిశ్వాస వరకు పేదల కోసం, సమసమాజ స్థాపన కోసం తపించారు. రణతంత్రలో దిట్టగా, ఎన్నో సంచలనాత్మక సంఘటనలకు సూత్రధారిగా పేరుగాంచారు. 2004లో శాంతి చర్చల్లో తనదైన ముద్ర కనబరిచారు. తీవ్ర నిర్బంధాలకు ఎదురొడ్డి 33 ఏళ్ల పాటు రాజీ లేకుండా అజ్ఞాత జీవితాన్ని సాగించారు. గణేశ్ కోసం ఏళ్లుగా వేట సాగిస్తున్న పాలకవర్గాలు.. ఆయన తలకు కట్టిన రేటు రూ.40 లక్షలు. గణేశ్ అమరత్వంతో విప్లవ శ్రేణులు, విప్లవ అభిమానులు భావోద్వేగం చెందుతున్నారు. ఆయన స్మృతులను తలుచుకుంటూ ద్రవించిపోతున్నారు.

- వెలిశాల నుంచి ఏవోబీ వరకు సాగిన పోరుబాట
- దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు అంచెలంచెలుగా...
- ఏపీలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో విప్లవాభిమానుల్లో విషాదం
- అన్న సారయ్య స్ఫూర్తితో 1992లో అజ్ఞాతంలోకి..
- 2004లో పీపుల్స్‌వార్ ప్రతినిధిగా చర్చలకు హాజరు
- గణేశ్ తలపై రూ.40లక్షల రివార్డు
- ముగ్గురు సోదరులదీ ఉద్యమబాటే...
- గతంలోనే ఎన్‌కౌంటర్‌లో అన్న హతం.. తమ్ముడు లొంగుబాటు..

ప్రజల కోసమే బతికాడు..
– గాజర్ల సమ్మయ్య, గణేశ్ సోదరుడు



మా సోదరుడు రవి చిన్నతనంలోనే ఉద్యమంలోకి వెళ్లాడు. ఏనాడూ తిరిగి ఇంటి ముఖం చూడలేదు. తిరిగి రావాలన్న ఆలోచన కూడా చేయలేదు. ప్రజల హక్కుల కోసం పోరాటం చేశాడు. అనుక్షణం ప్రజల కోసమే పరితపించాడు. ప్రజల కోసమే ప్రాణాలర్పించాడు. తమ్ముడు లేని లోటు ఎప్పుడు తీర్చుకోలేనిది. మా కుటుంబానికే కాదు, ప్రజలకు కూడా ఆయన మరణం పూడ్చలేనిది. మాకెన్ని సమస్యలు ఎదురైనా ఎప్పుడూ తమ్ముడికి చెప్పుకోలేదు. అతడు ఎక్కడున్నా క్షేమంగా ఉంటే చాలనుకున్నాం.

భూపాలపల్లి/టేకుమట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పోరుగల్లు ఓరుగల్లులో వెలిశాల ఓ కుగ్రామం. కానీ విప్లవస్ఫూర్తి, కార్యాచరణతో ఈ గ్రామం ఎప్పుడూ చర్చల్లోనే నిలిచింది. రెవల్యూషనరీ బ్రదర్స్‌గా గుర్తింపు పొందిన గాజర్ల సోదరుల్లో ఇద్దరు అడవి బాటలోనే నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడి అంతర్ధానం కాగా, అనారోగ్యంతోఒకరు జన జీవన స్రవంతిలోకి వచ్చారు. మావోయిస్టు ఉద్యమ చరిత్ర పుటల్లో తనకంటూ స్థానాన్ని నిలబెట్టుకున్న వెలిశాల గ్రామం.. మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేష్ ఎన్‌కౌంటర్‌తో విషాదంలో మునిగిపోయింది. భూమి కోసం.. భుక్తి కోసం.. తాడిత, పీడిత జనం విముక్తికై సాయుధ పోరాటమే సరైన పరిష్కారమని భావించిన గాజర్ల సారయ్య (ఆజాద్), గాజర్ల రవి (గణేష్ /ఉదయ్), గాజర్ల అశోక్ (ఐతు) పోరుబాటను ఎంచుకుని ముందుకెళ్లారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబానికి చెందిన గాజర్ల కనకమ్మ, మల్లయ్య దంపతులకు మొత్తం ఐదుగురు కుమారులు. ఇందులో చివరి ముగ్గురైన సారయ్య, రవి, అశోక్‌లు విప్లవాల బాటను ఎంచుకున్నారు. 1987లో రాజకీయాల్లోకి అరంగ్రేటం చేయాలనుకున్న గాజర్ల సారయ్య అప్పట్లో సింగిల్ విండో చైర్మన్‌గా పోటీ చేసి పెత్తందార్ల చేతుల్లో ఓటమి పాలయ్యారు. దాంతో భూస్వాములు, పెత్తందారుల ఆధిపత్యానికి ఎదురు తిరగటంతో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్రమంగా సారయ్య అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై 1989లో అడవి బాట పట్టగా, ఆ తర్వాత పరిణామాల్లో అన్న ఆచూకీ తెలుపాలని పోలీసు నిర్బంధం పెరగటంతో రవి, అశోక్‌లు కూడా క్రమంగా అడవిబాట పట్టారు. ఈ క్రమంలో 2008లో ఏటురునాగారం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ మృతి చెందారు. 1992లో అజ్ఞాతంలోకి వెళ్లిన గాజర్ల రవి (గణేష్) 10వ తరగతి వరకు గ్రామంలోనే విద్యాభ్యాసం పూర్తి చేయగా, వరంగల్‌లో ఐటీఐ విద్యను అభ్యసిస్తూ రాడికల్ యువజన సంఘంలో చేరి అడవిబాట పట్టారు. నాటి నుంచి నేటి వరకు ఉద్యమంలోనే గణేష్ కొనసాగుతూ (మిగతా 7వ పేజీలో)

మంత్రి పొంగులేటిని కలిసిన కలెక్టర్


మంత్రి పొంగులేటికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, జూన్18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటికి కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమొక్క అందజేశారు. అనంతరం సచివాలయంలోని సీఎస్ ఛాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును కలిసి స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

ప్రాణం తీసిన భూ వివాదం

- అన్నను కత్తులు, కర్రలతో కొట్టి చంపిన తమ్ముళ్లు
- మహబూబాబాద్ జిల్లా సీరోలులో ఘటన 7



'మెంటల్' ఆస్పత్రి నిధులు మాయం

'పిచ్చోడి చేతిలో రాయి...' అనే సామెత తెలుసుగా! రాయిని అతడు ఎవరిపైన, ఎప్పుడు విసురుతాడో తెలియదు.. ఒకవేళ విసిరినా భరించక తప్పదు. ఇదేమిటని అడిగే పరిస్థితి.. ప్రశ్నించే వీలు ఉండదు. ఈ తరహా పరిస్థితే వరంగల్ మెంటల్ అస్పత్రికి కేటాయించిన నిధుల విషయంలో నెలకొంది. ఏడేళ్ల క్రితం కేంద్రం తన వాటాగా కేటాయించిన రూ.12 కోట్లు ఏమయ్యాయో తెలియడం లేదు. అస్పత్రి నిర్మాణానికి భూమి పూజ కూడా చేయకుండానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నిధులను ఎటువైపు మళ్లించిందో మిస్టరీగా మారింది. ఫలితంగా కేఎంసీలో నిర్మించాల్సిన మానసిక వైద్యశాలకు గ్రహణం పట్టింది. మారిన జీవనశైలితో మానసిక రుగ్మతలకు లోనయ్యే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో 2017లో రూ.33కోట్లతో వరంగల్‌లో మెంటల్ అస్పత్రి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో మానసిక అస్పత్రి నిర్మాణం అటకెక్కగా, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.12కోట్లు ఏమాయ్యయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పిచ్చికి వైద్యం చేయడానికి వచ్చిన నిధులను మాయం చేసిన 'గులాబీ' పాలకులు.. ఎవరిని పిచ్చోళ్లను చేసినట్టో!?

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- 2017లో వరంగల్‌లో మానసిక వైద్యశాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- కేఎంసీ ఆవరరణలో రూ.33కోట్లతో మూడెకరాల్లో అస్పత్రి నిర్మాణానికి ప్రణాళిక
- 2018 ఫిబ్రవరిలో రూ.12కోట్ల నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఏడేళ్లు గడిచినా మెంటల్ అస్పత్రికి భూమి పూజ జరగని వైనం
- కేంద్రం ఇచ్చిన రూ.12కోట్లు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి
- వరంగల్ ఎంజీఎంకు ప్రతీరోజు వందకు పైగా మానసిక రోగులు
- ఆస్పత్రి నిర్మాణంపై దృష్టి పెట్టాలంటున్న ఓరుగల్లువాసులు

7




కుమారుడు, కుమార్తెకు అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న ఉపాధ్యాయురాలు సుధారాణి

మాటలు కాదు చేతలు...

తాను పనిచేసే పాఠశాలలోనే తన పిల్లలను చేర్పించిన టీచర్

ఆదర్శంగా నిలుస్తున్న సుధారాణి దంపతులు

వెంకటాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతూ గ్రామస్థుల పిల్లలను మాత్రం సర్కార్ బడికి పంపించాల్సిందిగా కోరుతారనే ప్రచారం ఉంది. కానీ అందుకు భిన్నంగా ఆ ఉపాధ్యాయురాలు తన కుమారుడు, కుమార్తెను తాను పనిచేసే పాఠశాలలోనే చేర్పించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని మోడల్‌స్కూల్‌లో బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ములుగు జిల్లాకేంద్రానికి చెందిన సుమతేజ్(9వ తరగతి), సంవిధ(7వ తరగతి) తండ్రి శిరుప సతీష్‌కుమార్ ములుగులోని బాలుర జడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి సుధారాణి జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారు ములుగులో నివాసం ఉంటున్నప్పటికీ పిల్లలిద్దరినీ సుధారాణి తాను పనిచేస్తున్న మోడల్ స్కూల్‌లో చేర్పించి విద్యను అందిస్తున్నారు. టీచర్లు తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పిస్తే సామాన్య ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


- నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయి
- నగరంలోని పలు డివిజన్‌లలో పర్యటన


కడిపికొండలో శానిటేషన్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని అన్ని ప్రాంతాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారం వరంగల్ నగంలోని 45, 46 డివిజన్‌ల పరిధిలోని కడిపికొండ, రామన్నపేట ప్రాంతాల్లో కమిషనర్ విస్తృత పర్యటన చేశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ర్యాలీ నిర్వహించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 45వ డివిజన్‌లో డిసిల్టింగ్ ప్రక్రియతో పాటు మడికొండ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరువేరుగా ఆటోలకు అందించాలని అన్నారు. సీజన్ వ్యాధులు, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ సిబ్బంది ఫిర్యాదులు రాకుండా చెత్త సేకరణ జరపాలని అన్నారు. అనంతరం శానిటేషన్ కార్మికుల హాజరుపట్టికను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ సంతోష్‌బాబు, ఏఈ రామన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, రవీందర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

- వరంగల్ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్ పాయి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చింతగట్టు సమీపంలోని యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్, నగరంలోని స్మార్ట్‌సిటీ పనులు, బాలసముద్రంలోని రెండు నర్సరీలలో ఆకస్మికంగా పర్యటించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఏబీసీ సెంటర్‌లో కుక్కలకు నిర్వహించే శస్త్ర చికిత్సపై అడిగి తెలుసుకున్నారు. గోకుల్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు, రాజాజీ నగర్‌లో రిటైనింగ్ వాల్‌తో పాటు నగరంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, ఈఈలు సంతోష్‌బాబు, మాధవీలత, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

స్వర మాంత్రికుడు నేరెళ్ల



- ఒక గొంతులో వేల గళాలు
- మిమిక్రీ కళకు వన్నె తెచ్చిన అపురూప కళాకారుడు
- ఓరుగల్లు కీర్తిని ప్రపంచానికి చాటిన ఆణిముత్యం 7
- నేడు నేరెళ్ల వేణుమాధవ్ వర్ధంతి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయిని భరత్

కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించాలి

బీసీ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్

మట్టెవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు పోలీస్ ఎస్కార్ట్ కల్పించాలని బీసీ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ కోరారు. బుధవారం వరంగల్ పోచమ్మమైదాన్‌లోని ఓ హోటల్‌లో ఆయన మాట్లాడారు. కొండా మురళికి పోలీసులు రక్షణ కల్పిస్తే అగ్ర కులాలకు చెందిన నేతలు తట్టుకోలేక కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొంత మంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అల్లుడికి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కుటుంబీకులకు ఎందుకు పోలీస్ ఎస్కార్ట్ ఇస్తున్నారని ప్రశ్నించారు. పోలీసు అధికారులకు సీపీ ఇచ్చిన మెమోలు కావాలనే కొంత మంది సోషల్ మీడియాలో పెట్టారని, దీనికి వరంగల్ సీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ ప్రజాసంఘం నాయకులు వాసం సురేష్, సంజీవ్ కుమార్, రజిత, సాగరిక, రాజు, భార్గవి, రవి, సాగర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కార్టు కల్పించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిల్స్‌కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పులో ప్రొటోకాల్ లేని వ్యక్తులకు సేవలందిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న పోలీస్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఓసిటీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఏ పదవి లేకున్నా మంత్రి భర్త అయిన కొండా మురళీధర్‌రావుకు ఏసీపీ నందిరాంనాయక్‌తోపాటు మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ సీఐలు, ట్రాఫిక్ సీఐ, ఇతర పోలీసు సిబ్బంది ఎస్కార్టుగా రావడాన్ని ఆయన తప్పుబట్టారు. రౌడీషీటర్లకు సలాం కొట్టి పోలీసు వ్యవస్థ పరువు తీశారని అన్నారు. దీన్ని గమనించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్ వారికి మెమో జారీచేడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మెమోతో సరిపెట్టకుండా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ప్రదీప్‌రావు హెచ్చరించారు.

చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్ మృతి

శాయంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భార్యతో కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన జవాన్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ప్రవీణ్(28) సికింద్రాబాద్‌లో ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నాడు. పరకాల మండలం నాగారానికి చెందిన రజనికకు నాలుగేళ్ల కిందట ప్రవీణ్‌తో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. ఈ నేపథ్యంలో తన భార్యతో కలహాల కారణంగా మనస్థాపానికి గురైన ప్రవీణ్.. ఈ నెల 8న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన వైద్యం కోసం పూణేలోని మిలటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. తన ఆత్మహత్యకు కారణం భార్య, అత్త, మామలు అని ప్రవీణ్ వీడియోరూపకంగా తెలిపారు. ప్రవీణ్ మృతితో మైలారంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా, గురువారం సాయంత్రం మృతదేహం వచ్చే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కేయూలో ఎన్నికల కోలాహలం

● రేపు ఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల ఎన్నికలు ● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు.. ముమ్మరంగా ప్రచారం
● వర్సిటీ పరిధిలో 5 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ● పదవులకు త్రిముఖ పోటీ.. ఎన్నికల బ్యాలెట్ పేపర్లు సిద్ధం

కేయూ క్యాంపస్ జూన్ 18, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో బోధనేతర ఉద్యోగుల ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. ఈనెల 20న కేయూ ఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్షకార్యదర్శులతో పాటు ఇతర పదవులకు హోరాహోరీ పోటీ నెలకొంది. ప్రధాన పదవులతో పాటు అనుబంధ పదవులకు ఉద్యోగుల మధ్య ద్విముఖ, త్రిముఖ పోటీ నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా ఎన్నికల్లో అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికలకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వెల్లడించారు. జూన్ 20న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని సెనెట్ హాల్, ప్రిన్సిపాల్ కార్యాలయం, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఖమ్మం, కొత్తగూడెం యూనివర్సిటీ పీజీ కళాశాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు తమకు ఇష్టమైన అభ్యర్థులకు రహస్య పద్ధతిలో ఓటు వేయాలని సూచించారు. 2025-2027 ఏడాదికి గాను ఎన్నికలు నిర్వహిస్తారు. వర్సిటీ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి 3 పదవులు ఏకగ్రీవంగా గెలుపొందారు. వారిలో వైస్ ప్రెసిడెంట్‌గా పి.అంకూస్, జనరల్ సెక్రటరీగా బొక్క మొగిలి, జాయింట్ సెక్రటరీ రిక్రియేషన్ వుమెన్స్ పదవికి జి.మల్లికాంబలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 21న ఎన్నికల ఎన్జీవోస్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి జరిగిన ఎన్నికల ఫలితాలను కౌంటింగ్



నిర్వహించి వెల్లడిస్తారు.

ఎన్నికల బ్యాలెట్ పేపర్లు సిద్ధం

ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో నిర్వహిస్తారు. ఎన్జీవోస్ సంఘానికి పోటీ నిలిచిన అభ్యర్థుల పేర్లు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు, ఫొటోలతో బ్యాలెట్ పేపర్ ముద్రించారు. అలాగే నాలుగో తరగతి ఉద్యోగులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. గాలిపటం, గంట, బీరువా, గొడుగు, షిప్, సూర్యుడు, టీవీ, గ్యాస్ సిలిండర్ గుర్తులను కేటాయించారు.

ఎన్జీవోస్ సంఘం అభ్యర్థులు వీరే..

అధ్యక్ష పదవికి కేయూ క్యాంపస్ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న బి.నవీన్‌కుమార్, సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో పనిచేస్తున్న జి.నిరంజన్‌లు పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి పరీక్షల విభాగంలో పనిచేస్తున్న ఎమ్డీ యూనస్, అకౌంట్స్‌లో పనిచేస్తున్న పి.ప్రభాకర్‌లు పోటీలో ఉన్నారు. జనరల్ సెక్రటరీ పదవికి ఫార్మసీ విభాగంలో విధుల్లో ఉన్న వి.తిరుపతి, గెస్ట్‌హౌస్‌లో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ అక్రమ్ అహ్మద్‌లు పోటీలో నిలిచారు. జాయింట్ సెక్రెటరీ పదవికి ఎ.సతీశ్‌బాబు, బి.రాజు, జాయింట్ సెక్రటరీ రిక్రియేషన్ వుమెన్స్ పదవికి బి.కృష్ణవేణి, గౌషియా బేగం, సీహెచ్ దేవమ్మలు పోటీలో నిలిచారు. జాయింట్ సెక్రెటరీ రిక్రియేషన్ పదవీకి జి.మధుకర్, టి.ప్రభాకర్, పి.సుశీల్, ట్రెజరర్ పదవికి సీహెచ్. ప్రవీణ్‌కుమార్, టి.దామోదర్‌లు పోటీలో నిలిచారు.

నాలుగో తరగతి బరిలో నిలిచింది వీరే..

అధ్యక్ష పదవికి పి.గుమ్మయ్య, ఎమ్డీ నిజాముద్దీన్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ పదవికి ఎమ్డీ వలీపాషా, టి.రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ రిక్రియేషన్ పదవీకి ఎస్.అయిలయ్య, పి.వేణు, ట్రెజరర్‌గా టి.తిరుమల్ శ్రీనివాస్‌సింగ్, రామనాథంలో బరిలో నిలిచారు.

హోరీహోరీగా ఎన్నికల ప్రచారం

కేయూలో ఎన్జీవోస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి నిర్వహించే ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులందరూ హోరాహోరీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉద్యోగులందరినీ కలిసి ఓటును అభ్యర్థిస్తున్నారు. తెలిసిన వారితో చెప్పిస్తూ తమ ప్యానల్ అభ్యర్థులకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల్లో పోటీలో నిలిచిన అభ్యర్థుల తమ గుర్తులతో బ్యాలెట్ పేపర్ మోడల్‌ను పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో ఒక్కో ఓటు గెలుపు ఓటములకు కీలకంగా మారనుంది. తను గెలిస్తే వర్సిటీలో తమకు రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు ప్రమోషన్లు ఇప్పిస్తామని హామీలిస్తున్నారు. అలాగే ఓటు కోసం ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

శాయంపేట సొసైటీలో గందరగోళం

రుణవడ్డీ పేరుతో ఇన్‌చార్జి సీఈవో వసూలు చేశాడని ఆరోపణ

పురుగుల మందు డబ్బాతో ఇద్దరు రైతుల నిరసన

శాయంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాయంపేట ప్రాథమిక సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవో పెరుగు శంకర్ రుణవడ్డీ పేరుతో తమ వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఇద్దరు రైతులు పురుగుల మందు డబ్బాతో బుధవారం నిరసన తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రేణుకుంట్ల పృథ్వీరాజ్ రూ.50వేలు, కోగిల సదానందం రూ.లక్ష గతంలో సొసైటీలో క్రాప్‌లోన్ తీసుకోగా, లోన్ మాఫీ అయి చెరో రూ.10వేలు వడ్డీ బాకీ ఉన్నారు. కొత్త లోన్ తీసుకునేందుకు పాత లోన్ వడ్డీ చెల్లించాలని పృథ్వీరాజ్, సదానందంలకు మైలారం గ్రామానికి చెందిన ఇన్‌చార్జి సీఈవో శంకర్ సూచించాడు. దీంతో ఇద్దరు చెరో రూ.10 వేలు శంకర్‌కు ఇవ్వగా రశీదు తర్వాత ఇస్తానని దాటవేశాడు. అనంతరం కొత్త లోన్ పృథ్వీరాజ్‌కు రూ.80 వేలు, సదానందంకు రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ క్రమంలో తాను వడ్డీలు సర్దుబాటు చేసే క్రమంలో సహాయం చేస్తానని నమ్మబలికి పృథ్వీరాజ్ వద్ద మరో రూ.25వేలు సీఈవో శంకర్ తీసుకున్నాడు.

ఈ నేపథ్యంలో ఇటీవల కొత్త లోన్‌కు సంబంధించి వడ్డీ చెల్లించాలని సొసైటీ సిబ్బంది ఇద్దరు రైతులను సంప్రదించగా పృథ్వీరాజ్ పేరుపై రూ.90 వేలు, సదానందం పేరుపై రూ.1.60 లక్షల లోన్ చూసి కంగుతిన్నారు. పాత లోన్‌కు సంబంధించి వడ్డీ ఇద్దరి వద్ద వసూలు చేసిన రూ.20 వేలు శంకర్ సొసైటీలో చెల్లించలేదని నిలదీశారు. ఈ క్రమంలో శంకర్ దురుసుగా మాట్లాడుతూ.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి.. అంటూ బెదిరిస్తున్నాడని వాపోయారు. దీంతో ఇద్దరు రైతులు మండల కేంద్రంలోని సొసైటీ ముందు పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపగా పోలీసులు ప్రవేశించి, స్టేషన్‌కు తరలించారు. అనంతరం పృథ్వీరాజ్, సదానందంలు శంకర్‌పై స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈవో శంకర్ తనని మోసం చేశాడని పృథ్వీరాజ్ గతంలో డీసీవో సంజీవరెడ్డికి ఫిర్యాదు చేయగా దానిపై విచారణ జరుగుతున్నట్లు సమాచారం.



సొసైటీ ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతులు



జఫర్‌గఢ్ శివారు దమ్మన్నపేటకు వెళ్లే రోడ్డుపై పిల్లను వెంటేసుకుని వెళ్తున్న ఎలుగుబంటి

ఎలుగుబంట్ల సంచారంతో భయాందోళన

జఫర్‌గఢ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎలుగుబంట్ల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని తూర్పు (దేవుని గుట్ట), పడమర కొండల దిగువన ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. జఫర్‌గఢ్ చుట్టూ కొండలు, గుహల్లో ఎలుగుబంట్లు నివాసముంటున్నాయి. బుధవారం ఉదయం జఫర్‌గఢ్ నుంచి దమ్మన్నపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై నుంచి ఓ ఎలుగుబంటి పిల్లను వెంటేసుకుని అటుగా వెళ్తున్న దృశ్యాలను స్థానికులు వీడియో తీశారు. తూర్పు, పడమర కొండలపై గుహల్లో నివాసం ఏర్పరచుకున్న ఆ ఎలుగుబంట్లు ఆహారం, నీటి కోసం రాత్రి, తెల్లవారు జాము సమయాల్లో కొండల దిగువకు, ఇళ్ల సమీపంలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒక్కోసారి ఉదయం 10 గంటల సమయాల్లో సైతం కొండపై సంచరిస్తూ కనిపిస్తున్నాయన్నారు. అయితే ఎలుగుబంట్ల సంచారంతో గ్రామస్థులు రాత్రి, వేకువజాము సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా, కొండల దిగువ చుట్టూ పొలాల వద్దకు రైతులు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి ఎలుగుబంట్లను బంధించి వాటి బెడదను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యాదవుల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరావాలి

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని అఖిల భారత యాదవ సంఘం సభ్యుడు సుందర్‌రాజ్ పిలుపునిచ్చారు. బుధవారం రాంనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేరనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురిచేయొద్దని, మంత్రి పదవితో పాటు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మగౌరవ సభ సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ సంఘం సభ్యులు రాజారాంయాదవ్, గోవర్ధన్, గిరబోయిన రాజయ్య, మేకల కృష్ణ, రజినీకుమార్, రాకేశ్, ప్రమోద్, బండి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులను
అరెస్టు చూపిస్తున్న సుబేదారి సీఐ రంజిత్‌కుమార్

పీడీఎస్ బియ్యం రవాణాదారుల పట్టివేత

40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సుబేదారి పోలీసులు

హనుమకొండ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులను మంగళవారం పట్టుకొని అరెస్టు చేసినట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హనుమకొండలోని టీవీ టవర్ కాలనీకి చెందిన పల్లెపాటి సమ్మిరెడ్డి, ములుగు జిల్లా దేవగిరిపట్నంకు చెందిన మాలోతు వీరన్న, భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నాగుర్లపల్లికి చెందిన మోతె రామాంజనేయులు హనుమకొండలోని వివిధ కాలనీలలో తిరుగుతూ కిలో రూ.20చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

మంగళవారం రాత్రి సమయంలో సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని తిరుమల జంక్షన్ వద్ద మినీగూడ్స్ వాహనంలో సుమారు 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ములుగు జిల్లా జంగాలపల్లి శ్రీవెంకటసాయి రైస్ మిల్లులో రీసైక్లింగ్ కోసం తరలిస్తుండగా తిరుమల జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1లక్ష 60వేలు ఉంటుందని తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక ప్రతిభకనబర్చిన ఏఎస్ఐ పాపయ్య, కానిస్టేబుళ్లు మారపల్లి ప్రభాకర్, సత్యనారాయణలను సీఐ అభినందించారు.

ప్రవీణ్‌రెడ్డి ప్యానల్‌దే విజయం

● ముల్కనూర్ సహకార బ్యాంకు ఎన్నికల్లో ఏకగ్రీవం ● 5 డైరెక్టర్ల స్థానాలు కైవసం

భీమదేవరపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్యానల్‌కు సంబంధించి ఐదుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికలాధికారి కోదండరాములు తెలిపారు. ప్రతీ 20 నెలలకోసారి ముల్కనూర్ సహకార బ్యాంకులో 15 డైరెక్టర్ స్థానాలకు గాను 5 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ నెల 16న నామినేషన్లు వేశారు. 5 డైరెక్టర్ స్థానాల కోసం 11 మంది తమ నామినేషన్లను సమర్పించారు. 1వ వార్డు నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, దొంగల చిన్న వెంకట్రాజం, 2వ వార్డు నుంచి బొల్లంపల్లి కుమారస్వామి, కడారి ఆదామ్, 5వ వార్డు నుంచి గణవేణ శ్రీనివాస్, కూన కనకయ్య, 9వ వార్డు నుంచి గుర్రాల భాస్కర్‌రెడ్డి, మార్పాటి జైపాల్‌రెడ్డి, బోయినపల్లి రత్నాకర్ రావు, 15వ వార్డు నుంచి కాశిరెడ్డి వసంత, కంకల భాగ్యలు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఆరుగురు తమ నామినేషన్లను బుధవారం ఉపసంహరించుకోగా, 1వ వార్డు నుంచి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, 2వ వార్డు నుంచి బొల్లంపల్లి కుమారస్వామి, 5వ వార్డు నుంచి గణవేణ శ్రీనివాస్, 9వ వార్డు నుంచి గుర్రాల భాస్కర్‌రెడ్డి, 15వ వార్డు నుంచి కాశిరెడ్డి వసంతలు ఒక్కొక్కరే బరిలో ఉండడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికలాధికారి కోదండరాములు తెలిపారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు ఎన్నికలాధికారి కోదండరాములు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కాగా, ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశీవిశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, ఎన్నికల సహాయ అధికారి రవీంద్ర, లోన్ సెక్షన్ మేనేజర్ జి.రాజమౌళి, వెంకటేశ్వర్‌రావు, సతీష్, రైతులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా గెలిచిన డైరెక్టర్లతో బ్యాంకు చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి

వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం

● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ● ధర్మసాగర్ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరు



ధర్మసాగర్‌లో డీసీసీబీ బ్యాంక్ ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగానికి ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించి రూ.30వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంపీ కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ధర్మసాగర్ మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్‌ను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. యేడాదిలోనే రైతులకు రూ.21వేల కోట్లు రుణమాఫీ చేసిందని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డీసీసీబీ బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఏ పేద కుటుంబం ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి రేషన్‌షాపుల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. రైతు భరోసా ద్వారా 40 లక్షల మంది రైతులకు నాలుగు వేల కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేశారని తెలిపారు మరో వారం రోజుల్లో 90 లక్షల మంది రైతులకు 9వేల కోట్లు అందనున్నాయని తెలిపారు.

ఎంపీ కావ్య మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్‌గా ఉందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని, వ్యవసాయాన్ని పండుగా చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందులో భాగంగానే రైతులకు రుణమాఫీ రైతు భరోసా, రైతు బీమా, పంటల బీమా పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడిలు సాధించారని కొనియాడారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.. బ్యాంక్ ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు, డీసీసీబీ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఏవో రాజేష్, వైస్‌చైర్మన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ హ్యాకథాన్‌లో కిట్స్ విద్యార్థుల గ్రాండ్ ప్రైజ్

హసన్‌పర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఐబీఎం ఏఐ జనరేటివ్ ఇంటర్నేషనల్ హ్యాకథాన్‌లో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పావుశెట్టి యశ్వంత్ కృష్ణ, ఈషా బెల్లాడిలు గ్రాండ్ ప్రైజ్ (5వేల డాలర్ల) మనీని గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం కిట్స్ కళాశాల ఆవరణలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 15 రోజుల కిందట (యూఎస్) ఫ్లోరిడాలో అంతర్జాతీయ ఐబీఎం ఏఐ జనరేటివ్ ఇంటర్నేషనల్ హ్యాకథాన్‌లో ఇంటెలిజెన్స్ వినూత్న అప్లికేషన్‌లను ప్రదర్శించి హ్యాకథాన్‌లో భారతదేశం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికై ప్రైజ్‌మనీని గెలుచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వి.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డిలతో పాటు ఇతర మేనేజ్‌మెంట్ సభ్యులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వేణుమాధవ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నెట్‌వర్క్స్ ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణయ్‌కుమార్, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.



యశ్వంత్‌ను అభినందిస్తున్న కిట్స్ ప్రిన్సిపాల్

స్వర మాంత్రికుడు నేరెళ్ల



ఒక గొంతులో వేల గళాలు

మిమిక్రీ కళకు వన్నె తెచ్చిన అపురూప కళాకారుడు

ఓరుగల్లు కీర్తిని ప్రపంచానికి చాటిన ఆణిముత్యం

నేడు నేరెళ్ల వేణుమాధవ్ వర్ధంతి

హనుమకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నవరసాలనూ అలవోకగా పలికించి వేల గొంతుకలను అనుకరించిన అరుదైన కళాకారుడు ధ్వని అనుకరణ సామ్రాట్ నేరెళ్ల వేణుమాధవ్. తన కంఠంలోని ఒక్క స్వరపేటికతోనే వేల స్వరాలను పలికించిన బహుళస్వర విన్యాసి. మాటలు, పాటలు, పద్యాలతో ప్రపంచాన్ని కట్టిపడేసిన అద్వితీయ ధ్వని తరంగం. ఆరోహణానికి, అవరోహణానికి మధ్య వేల గొంతులకతో అంతులేని ఆశ్యరాన్ని కలిగించి, అంతలోనే హాస్యాన్ని పండించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. జూన్ 19న నేరెళ్ల వేణుమాధవ్ వర్ధంతి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

మట్టెవాడలో పుట్టి..

1932 డిసెంబర్ 28న వేణుమాధవ్ వరంగల్‌లోని మట్టెవాడలో పారిశ్రామికవేత్త శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 12వ సంతానంగా జన్మించారు. తండ్రి బహుబాషావేత్త. సాహిత్యాభిమాని కావడంతో వరంగల్‌కు వచ్చే ప్రఖ్యాత సాహితీవేత్తలు, కళాకారులు వీరి ఇంట్లోనే బస చేసేవారు. సాహితీ గోష్ఠులు, కళా ప్రదర్శనలు జరిగేవి. వీటన్నింటి ప్రభావం నేరెళ్ల మీద పడింది. 1950లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసి, 1952లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీని, ఆ తర్వాత బీఈడీ పూర్తి చేశాడు. 1953లో మట్టెవాడ మిడిల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే వారాంతల్లో, స్కూలు సెలవుల్లో ప్రదర్శనలు ఇచ్చేవారు. అలనాటి హిందీ నటుడు సురేంద్రనాథ్, నాట్య కళాకారుడు గోపీక్రిష్ణ, గాయకులు సుమన్ కల్యాణ్‌పూర్, ఘంటసాల బృందంలో ఉంటూ ప్రపంచవ్యాప్తంగా పర్యటనలు చేశారు. వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేసేవాడుకాడంతో ఆయనపై ఉన్న అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే మిమిక్రీ రంగంలోకి ప్రవేశించారు. ఇవే కాకుండా వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి ఇంటికిరాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. అలా మొదలైంది నేరెళ్ల మిమిక్రీ ప్రస్థానం

బాల్యం నుంచే..

వేణుమాధవ్‌కు చిన్నతనం నుంచే ధ్వన్యనుకరణ కళ అలవోకగా అబ్బింది. పక్షులను, జంతువులను అనుకరించేవాడు. ఆ తర్వాత గ్రామంలోని వ్యక్తులను అనుకరించి ఆశ్చర్యపరిచేవాడు. వేణుమాధవ్ 16 ఏళ్ల వయసులో తన మిమిక్రీ కేరీర్‌ను ప్రారంభించాడు ప్రముఖులను, రాజకీయ నాయకులను, తెలంగాణ మాండలికాన్ని అనుకరిస్తూ ప్రజాదరణ పొందాడు. చిత్తూరు నాగయ్య అంటే ఆయనకు అపారమైన అభిమానం. ఆయన గొంతును అనుకరించడంతోనే నేరెళ్ల మిమిక్రీ కెరీర్ మొదలైంది. హైస్కూల్లో చదువుతున్న రోజుల్లోనే నాగయ్య సినిమాంటే పడిచచ్చేవారాయన. వ్యక్తులనే కాకుండా సంగీత వాద్యాలని, సన్నివేశాల్ని కూడా అనుకరించి మిమిక్రీ కళని కొత్తపుంతలు తొక్కించారు. ఇంగ్లీష్ సినిమాల్లోని నటీనటుల గొంతులు, ముఖ్యమైన సన్నివేశాలు, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్‌తో సహా వినిపించడం ఆయన ప్రత్యేకత. టెన్ కమాండెంట్స్ సినిమాలోని కీలక సన్నివేశాన్ని అరగంట పాటు డైలాగ్స్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, గుర్రాల సకిలింపులు, డెక్కల చప్పుడు అన్నింటితో సహా ఏక కాలంలో మిమిక్రీ చేయడం ద్వారా సన్నివేశాన్ని సజీవంగా ప్రేక్షకుల ముందు ఆవిష్కరించడంతో నేరెళ్ల పేరు అంతర్జాతీయంగా మార్మోగిపోయింది. హామ్లెట్, మెకాన్నస్ గోల్డ్ వంటి ప్రసిద్ధ హాలీవుడ్ సినిమాల సీన్స్ కూడా అనుకరించి ప్రశంసలు పొందారు. సర్వేపల్లి స్వరాన్ని అనుకరించడమే కాకుండా ఆయన రూపాన్ని కూడా అభినయించడం నేరెళ్ల జీవితాన్ని మలుపుతిప్పింది. అంతర్జాతీయ వేదిక మీద అప్పటి అమెరికా అధ్యక్షుడు కెన్నెడి గొంతును మిమిక్రీ చేయడం, దానికి యునైటెడ్ నేషన్స్ సభ్యులు కరతాళ ధ్వనులతో లేచి నిలబడి అభినందించడం విశేషం.

దేశ విదేశాల్లో..

దేశ విదేశాల్లో ఆయన లెక్కలేనన్ని ప్రదర్శనలు ఇచ్చారు. 1964లో అస్ట్రేలియా పర్యటనతో మొదలైన ఆయన విదేశీ ప్రదర్శనలు నిరంతరంగా సాగాయి. ఏకంగా ఐక్యరాజ్య సమితి వేదికగా ప్రదర్శన ఇవ్వడం ఆయనతో పాటుగా మిమిక్రీ కళకు దక్కిన అరుదైన గౌరవంగా భావించవచ్చు. నేరెళ్ల వేణుమాధవ్ కళారంగసేవకు ప్రపంచమే అబ్బురపడింది. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించింది. కాకతీయ, ఆంధ్రా, జేఎన్‌టీయూ యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. కనకాభిషేకాలు, గండపెండేరాలు, ఉగాది పురస్కారాలు, కళాప్రపూర్ణ బిరుదులు.. ఒకటా రెండా లెక్కలేనన్ని అవార్డులు వరించాయి. రాజా-లక్ష్మి ఫౌండేషన్ చెన్నై వారు రాజలక్ష్మి అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ది బుక్ ఆఫ్ తెలంగాణ రికార్డ్స్ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశాయి. వేణుమాధవ్ మీద ఉన్న అభిమానంతో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో పాటు పలువురు సుప్రసిద్ధకవులు తమ పుస్తకాలను ఆయనకు అంకితమిచ్చారు. 2018 జూన్ 19న వరంగల్‌లోని ఆయన తన స్వగహంలో మరణించారు. నేరెళ్ల మిమిక్రీ కళకు చేసిన సేవకు గుర్తింపుగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆయన పేరున ఆడిటోరియం నిర్మాణం జరిగింది. దీని ప్రాంగణంలో ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

'మెంటల్' ఆస్పత్రి నిధులు మాయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



సాంకేతికత పెరగటం, మానసిక ఆందోళనలతో పాటు యువత వ్యసనాల బారిన పడుతుండటంతో మానసిక రుగ్మతలు పెరిగిపోతున్నాయి. వృత్తిరీత్యా ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబకలహాలు, అప్పులు, భార్యాభర్తల మధ్య వివాదాలు, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి బానిసలుగా మారి చాలామంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇటీవల విడుదలైన జాతీయ మానసిక ఆరోగ్య నివేదికలో ప్రతీ ఏడుగురిలో ఒకరు మానసిక ఆందోళనలు, సమస్యలతో బాధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20శాతం మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని అంచనా. వరంగల్ ఎంజీఎంలోని సైకియాట్రిస్ట్ విభాగానికి ప్రతీరోజు వంద మందికి పైగా మానసిక సమస్యలకు చికిత్స కోసం వస్తున్నారు. 40 నుంచి 60మంది వరకు ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు అస్పత్రుల్లో రోజుకు 600మందికి పైగా అవుట్ పేషెంట్లు, 100మందికి పైగా ఇన్ పేషెంట్లు చికిత్స పొందుతున్నట్లుగా అంచనా వేస్తున్నారు. మానసిక రుగ్మతులు పెరిగితే హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ అస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. పల్లె ప్రాంతంలో కంటే అధికంగా పట్టణ ప్రాంత ప్రజలే మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.

రూ.33కోట్లతో అస్పత్రి

ఉత్తర తెలంగాణకు కేంద్రంగా ఉన్న వరంగల్‌లో మెంటల్ అస్పత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎంజీఎం అస్పత్రికి అనుబంధంగా కేఎంసీ అవరణలో మానసిక వైద్యశాలను నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రానికి 2016లో లేఖ రాసింది. ఎంజీఎం అస్పత్రి ఆవరణలో స్థలలభ్యత లేకపోవటంతో మెంటల్ అస్పత్రి నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పటి కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ అలోక్‌మాథూర్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40శాతం భాగస్వామ్యంతో వరంగల్‌లో మానసిక అస్పత్రి నిర్మాణానికి ముందుకు వచ్చాయి. కేఎంసీ ఆవరణలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.33కోట్ల వ్యయంతో 75 పడకల సామర్థ్యంతో మెంటల్ దవాఖానాను నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. అస్పత్రి భవనాల నిర్మాణాలకు రూ.19.80కోట్లు, మిగతా నిధులతో అస్పత్రికి కావాల్సిన టెక్నిల్ ఎక్విప్‌మెంట్, నాన్ టెక్నికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు కేటాయించారు. అస్పత్రి భవనాల్లో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, ఫోరెనిక్స్ సైన్స్, అడాలసెంట్ సైకాలజీ, క్రిమినల్ సైకాలజీ, చైల్డ్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్, కౌన్సెలింగ్ తదితర విభాగాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడేళ్లు గడిచినా మెంటల్ అస్పత్రికి కనీసం భూమి పూజా కూడా నిర్వహించలేదు.

రూ.12కోట్ల కేంద్ర నిధుల జాడేది..?

తెలంగాణలో హైదరాబాద్ మినహా ఇతర ప్రాంతాల్లో ఎక్కడ కూడా మానసిక రుగ్మతులకు చికిత్స చేసే అస్పత్రులు లేవు. సమాజంలో పెరిగిపోతున్న మానసిక రుగ్మతులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వరంగల్‌లో ఏర్పాటు చేసే మానసిక అస్పత్రికి నిధుల విడుదల చేసింది. 60:40శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో నిధులు కేటాయించాలి. అయితే కేంద్రం తన వాటా 60శాతం అంటే రూ.19.80కోట్లు విడుదల చేయాల్సి ఉంది. దీంతో 2018 ఫిబ్రవరి 6వ తేదీన వరంగల్ మెంటల్ అస్పత్రికి రూ.12కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. తన వాటాలో 60శాతం నిధులను తొలి విడతలోనే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా నిధులను కూడా అస్పత్రి నిర్మాణ పనులు పూర్తయిన తరువాత అస్పత్రి ఎక్విప్‌మెంట్ కోసం నిధులు విడుదల చేస్తామని ప్రకటించింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా తన వాటా నిధులను విడుదల చేసి వరంగల్‌లో మెంటల్ అస్పత్రి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టాల్సి ఉంది.

కానీ, గత ప్రభుత్వం మెంటల్ అస్పత్రికి నిధులు కేటాయించకపోగా, కేంద్రం విడుదల చేసిన రూ.12కోట్లను వరంగల్ మానసిక అస్పత్రి నిర్మాణానికి ఖర్చు చేయకుండా దారిమళ్లించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెంటల్ అస్పత్రి నిర్మాణంపై పలుమార్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా ఫలితం లేకుండా పోయిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మెంటల్ అస్పత్రికి కేటాయించిన నిధులు ఏమయ్యాయో చెప్పాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై ఒత్తిడి తెచ్చినా సమాధానం లేకపోవటంతో ఇప్పటికి మెంటల్ అస్పత్రి నిధుల దారి మళ్లింపు వైద్య, ఆరోగ్యశాఖలో మిస్టరీగానే మిగిలిందనే చర్చ జరుగుతోంది. ఏడేళ్లకు పైగా వరంగల్ మెంటల్ అస్పత్రికి గత ప్రభుత్వ నిర్లక్ష్యం గ్రహణంగా పట్టుకుందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినప్పటికీ మెంటల్ అస్పత్రి నిర్మాణంపై దృష్టి పెట్టకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లక్నవరంలో 'లేడీ' గంతులు



కెమెరాకు చిక్కిన చుక్కల జింకలు

అటవీ సంపద క్షీణిస్తున్న తరుణంలో వణ్యప్రాణుల మనుగుడ ప్రమాదంలో పడింది. నీటి లభ్యత, చెట్ల నరికివేత, వేటగాళ్ల ఉచ్చులు, తదితర కారణాలతో జీవాలు అంతరించిపోతున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ములుగు జిల్లా లక్నవరం అటవీ ప్రాంతంలో చుక్కల జింకలు ప్రత్యక్షమయ్యాయి. హాయిగా, స్వేచ్ఛగా పచ్చిక బయళ్లను మేస్తూ సంచరిస్తుండగా 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి. అయితే వణ్యప్రాణులను సంరక్షించి, జీవవైవిధ్యాన్ని కాపాడడానికి అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ కొద్దిపాటి వణ్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చులకు బలికాకుండా అటవీశాఖ అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టాలని వణ్యప్రాణ ప్రేమికులు కోరుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/హనుమకొండ

మందలించినందుకు ప్రాణం తీశారు..

(5వ పేజీ తరువాయి)

కిషన్ దంపతులు వివాహమైన తర్వాత మరిపెడ మండలంలోని డీఎస్‌ఆర్ జెండాల తండాకు వచ్చారు. వీరి సంసారం జీవితానికి ఇద్దరు కుమార్తెలు సంతానం. చిన్న కూతురు పల్లవి డిగ్రీ చేస్తుండగా, ఆమె భూక్య సురేష్ అనే వ్యక్తితో ఫోన్‌లో తరుచూ మాట్లాడుతుండగా తండ్రి కిషన్ మందలించాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య జంగ్నీ, కుమార్తెలు రమ్య, పల్లవి, ఆమె ప్రియుడు సురేష్, బంధువులు బోడ చందు, బోడ దేవేందర్ ఆదివారం రాత్రి కిషన్‌ను చేతులు, కాళ్లను కట్టేసి తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సోమవారం ఖమ్మంలోనే ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

విప్లవ స్వాప్నికుడు.. వెనుదిరగని యోధుడు..

(5వ పేజీ తరువాయి)

వచ్చారు. ప్రస్తుతం ఆంధ్రా, ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రభుత్వంతో జరిపిన శాంతి చర్చల్లోనూ గణేష్ కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతుండటంతో ఆయన తన సహచరులతో కలిసి ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురు కాల్పుల్లో ఆయన, మరో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. దీంతో గాజర్ల రవి 33 ఏళ్ల సాయుధ ప్రస్థానం ముగిసినట్లయింది. రవి కొంతకాలం పాటు ఖమ్మం, కరీంనగర్, వరంగల్ (కేకేడబ్ల్యూ) జిల్లాల కార్యదర్శిగా, అంతకు ముందు నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ బాధ్యుడిగా పనిచేశారు. 1994లో రవి స్ఫూర్తితో మావోయిస్టు పార్టీలో చేరిన అందరి కంటే చిన్నవాడైన గాజర్ల అశోక్ (ఐతు) అనారోగ్య సమస్యల కారణంగా 2015లో పోలీసుల ఎదుట లొంగి పోయారు. కానీ రవి మాత్రం ఉద్యమబాట వీడకుండా ఆఖరుదాక అజ్ఞాత జీవితంలోనే ఉండిపోయా రు. ఉద్యమంలో చేరిన ముగ్గురు అన్నదమ్ము ల్లో ఇద్దరు ఎన్‌కౌంటర్లలో అసువులు బాయటంతో వెలిశాల గ్రామం విషాదంలో మునిగి పోయింది. గాజర్ల రవితో పనిచేసిన నాటి సహచరులు, చిన్ననాటి మిత్రులు శోకసంద్రంలో మునిగి పోయారు. నిర్బంధం కారణంగా ఆయన కుటుంబం చాలా కాలం క్రితమే హనుమకొండ, మంచిర్యాల ప్రాంతాలకు వలస వె ళ్లింది. రవి మావోయిస్టు పార్టీలో పనిచేసిన స్వ రూప అనే సహచర సభ్యురాలిని వివాహం చే సుకోగా, ఆమె కొన్నేళ్ల క్రితం ఏవోబీలో జరిగిన రామగూడ ఎన్‌కౌంటర్ లో మృతి చెందారు.

చర్చల్లో కీలకంగా..

గణేష్ 2004లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ తరపున రాజశేఖర్‌రెడ్డితో జరిగిన శాంతి చర్చల బృందంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచడంలో ప్రధాన పాత్ర పోషించారు. అంతేకాకుండా శాంతి చర్చల సందర్భంగా హైదరాబాద్‌లో ఉన్న సాయుధ సభ్యులు, సానుభూతిపరులపై ప్రభుత్వం పెట్టిన నిఘా పట్ల అప్పట్లో ప్రభుత్వ ప్రతినిధులతో కటువుగా మాట్లాడి సంచలనం సృష్టించారు. మావోయిస్టు ఉద్యమంలో 33 ఏళ్ల పాటు రాజీపడకుండా పనిచేసి కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్నారు. ఆయన ఎన్‌కౌంటర్‌తో అటు అంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంతాలకే కాకుండా ఇటు తెలంగాణలోనూ ఆ పార్టీకి కొలుకోలేని దెబ్బ తగిలినట్లయింది.

ఉలిక్కిపడిన వెలిశాల


గాజర్ల రవి అలియాస్ గణేశ్ మరణ వార్తతో వెలిశాల గ్రామం ఉలిక్కి పడింది. 33 ఏళ్లుగా ఉద్యమంలో ఉన్న గణేశ్ మారేడిమిల్లి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, ఉద్యమ సహచరులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఉద్యమవీరుడి మరణంతో ఉద్యమాల పురిటి గడ్డ వెలిశాలతో పాటు అనేక ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, గాజర్ల రవి సోదరులు సమ్మయ్య, ఆశోక్ ఘటనా స్థలానికి వెళ్లినట్లు సమాచారం. గణేష్ కుటుంబ సభ్యులంతా హనుమకొండలో స్థిరపడ్డారు. స్వగ్రామంలో ఎవరూలేని కారణంగా అంత్యక్రియలు వెలిశాలలో నిర్వహిస్తారా.. హనుమకొండలో చేస్తారా.. అనే సమాచారం తెలియాల్సి ఉంది.

ఎన్‌ఐఏ టార్గెట్

మావోయిస్టు పార్టీలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కేంద్ర కమిటీలో ఉన్న నలుగురైదుగురిలో గణేష్ సీనియర్ నేత. 2016 అక్టోబరు 25, డిసెంబరు 2వ తేదీల్లో ఏవోబీలో భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్లలో గణేష్ మృతి చెందారంటూ ప్రచారం జరిగింది. ఆ తరువాత పెద్దగా గాజర్ల రవి పేరు వినిపించలేదు. అయితే 2023 జనవరిలో కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఒరిస్సా రాష్ట్రంలో పలు చోట్ల గణేష్ పోస్టర్ల విడుదల చేసింది. గణేష్‌ను పట్టించిన వారికి రూ.10లక్షల రివార్డును ప్రకటించింది. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో 2012 ఫిబ్రవరి 10న బీఎస్‌ఎఫ్ బలగాలపై జరిగిన దాడిలో బీఎస్‌ఎఫ్ కమాండెంట్ జేఆర్.కాశ్యన్, సెకండ్ ఇన్ కమాండ్ రాకేష్‌శరాన్, ఇన్స్‌పెక్టర్ అశోక్‌యాదవ్, ఏఎస్సై జితేంద్రకుమార్‌లు మృతి చెందారు. ఈ కేసుతో పాటు అనేక కేసుల్లో గణేష్ నిందితుడిగా ఉన్నారు. వీటితో పాటు తెలంగాణ, ఏపీ, చత్తీస్‌గడ్, ఒరిస్సాలో అనేక హింసాత్మక కార్యక్రమాల్లో గణేష్ ప్రమేయం ఉన్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా, తెలంగాణలో గణేష్‌పై రూ.40లక్షల రివార్డు ఉంది.

ప్రాణం తీసిన భూ వివాదం

- అన్నను కత్తులు, కర్రలతో కొట్టి చంపిన తమ్ముళ్లు
- అడ్డం వచ్చిన తండ్రికి గాయాలు
- మహబూబాబాద్ జిల్లా సీరోలులో ఘటన



వల్లపు కృష్ణ (ఫైల్)

సీరోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీరోలులో జరిగిన భూ వివాదంలో ఒకరు హత్యకు గురయ్యారు. సొంత అన్ననే తమ్ముళ్లు హతమార్చారు. ఈ దారుణం మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండల కేంద్రానికి చెందిన వల్లపు లింగయ్యకు మొదటి భార్య మాణిక్యమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు కృష్ణ జన్మించారు. 1982 డిసెంబరు 8న మాణిక్యమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. యేడాది తర్వాత లింగయ్య ఇదే మండలం కాంపల్లికి చెందిన నర్సమ్మను వివాహం చేసుకున్నాడు. నర్సమ్మకు ఇద్దరు కుమారులు నరేష్, మహేష్‌లు జన్మించారు. లింగయ్యకు సుమారు 16ఎకరాల వ్యవసాయభూమి ఉండ గా, మొదటి భార్య మాణిక్యమ్మ కుమారు డు కృష్ణ (43), రెండో భార్య నర్సమ్మకు ఇద్దరు కుమారులు నరేష్, మహేష్‌లకు సమానంగా తలా నాలుగు ఎకరాల చొప్పున పట్టా చేయించారు. మిగిలిన నాలుగు ఎకరాలు తల్లిదండ్రులు తమ జీవనోపాధికోసం ఉంచుకున్నారు. కృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే పంపకాల్లో మహేష్‌కు వచ్చిన భూమి రోడ్డుకు వచ్చిందని, అందరికీ రోడ్డుకు వచ్చేవిధంగా పంపకాలు ఉండాలని కృష్ణ పలుమార్లు తం డ్రికి చెప్పేవాడు. ఇదే విషయమై మూడేళ్లుగా అన్నదమ్ముల మధ్య పంచాయితీలు తరుచుగా జరుగుతున్నాయి. దీంతో కోపం పెంచుకున్న తమ్ముళ్లు నరేష్, మహేష్‌లు అన్న కృష్ణను ఎలాగైనా అడ్డు తొలగించుకుని ఆయన భూమిని స్వాధీనం చేసుకోవాలని పథకం పన్నారు. ఇందు కోసం కృష్ణకు చెందిన భూమి కౌలుకు తీసుకున్న వ్యక్తిని బెదిరించారు. భూమిని తీసుకునేందుకు కౌలుదారులు ఎవరూ రాకపోవడంతో యేడాదిగా భూమి అలాగే ఉంది. దీంతో ఈ సారైనా కౌలుకు ఇచ్చి పోదామని హైదరాబాద్ నుంచి కృష్ణ సీరోలుకు వచ్చారు. ఇదే అదనుగా భావించిన సోదరులు నరేష్, మహేష్, వారిరువురు భార్యలతో పాటు మరో బంధువు వ్యవసాయ భూమి వద్ద ఘర్షణ పడ్డారు. కత్తులు, కర్రలతో దాడి చేసి హత్యచేసి పరారయ్యారు. కృష్ణపై దాడి చేస్తుండగా అక్కడే ఉన్న తండ్రి లింగయ్య అడ్డుకోగా తండ్రిపై కూడా కుమారులు దాడిచేసి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం కృష్ణ మృతదేహాన్ని మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ తండ్రి లింగయ్య జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య సత్యవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు.

పేరుకే పెద్దలు.. అవినీతిలో గద్దలు..

- కింది స్థాయి సిబ్బందితో వసూళ్లు చేయిస్తున్న కొందరు విద్యాశాఖాధికారులు
- బయటపడిన సందర్భాల్లో అసలు దొంగలు సేఫ్
- డీఈవో కార్యాలయాల్లో పైసలిస్తేనే కదులుతున్న ఫైళ్లు
- ఏసీబీ వలలో ములుగు డీఈవో, జూనియర్ అసిస్టెంట్ చిక్కడంపై చర్చ

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖాధికారుల కార్యాలయాలు భ్రష్టు పట్టిపోతున్నాయి. కొందరు డీఈవోలు, వారి కిందిస్థాయి అధికారులు ఆమ్యామ్యాలకు మరిగి విచ్చలవిడిగా అవినీతి పాల్పడుతున్నారు. వీరి అవినీతి యావతో కిందిస్థాయి ఉద్యోగులు బలిపశువులు అవుతున్నారు. ప్రతీ పనికి లెక్కగడుతూ డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు స్కూళ్ల అనుమతులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రతీ పనికి ఓ రేటును ఫిక్స్ చేసి మరీ డీఈవో కార్యాలయాల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ సోమవారం రెండ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ములుగు జిల్లా డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ అంశం ఇప్పుడు విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇంతకుముందెన్నడూ విద్యాశాఖలో ఏసీబీకి నేరుగా పట్టుబడిన వారెవరు లేరని, వీరే మొట్టమెదటి వారని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

డీఈవో ఆఫీసుల్లో పని కావాలంటే చేతులు తడపాల్సిన దుస్థితికి డీఈవో ఆఫీసులు చేరుకున్నాయంటే అతిశయోక్తి కాదు. డీఈవో కార్యాలయాల్లో జరిగే ప్రతీ పనికి లెక్కగట్టి మరీ సిబ్బందితో ఉన్నతాధికారులు వసూళ్లు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేటు పాఠశాలలు, ఉపాధ్యాయులకు సంబంధించిన పనులకు సంబంధించి రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు తెగబడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కిందిస్థాయి సిబ్బందిని పురమాయిస్తూ వారిచేత వసూళ్లు చేయిస్తూ విద్యాశాఖలోని ఉన్నతాధికారులు సేఫ్ జోన్‌లో ఉంటున్నట్లు చెబుతున్నారు. డబ్బులు దండుకుంటున్న ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందిపై నిందలు మోపుతున్నారని వారు వాపోతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొందరు ఎఫ్ఏసీ డీఈవోలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో అర్హతలు లేకున్నా గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం వీరిని డీఈవోలుగా నియమించింది. కింది స్థాయి నుంచి ఆమ్యామ్యాలకు అలవాటుపడిన వీరంతా సహజంగానే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. కొంతమంది డీఈవోలు తమ చేతికి మట్టి అంటకుండా కిందిస్థాయి సిబ్బందిని పురమాయిస్తూ, తమ అనుయాయులను సీసీలుగా నియమించుకుంటూ వారి ద్వారా అక్రమార్జన చేస్తున్నట్లు తెలుస్తోంది.

అవినీతి వ్యవహారాల్లో దొరికిన సందర్భాల్లో తమపై వేటు వేస్తూ ఉన్నతాధికారులు పబ్బం గడుపుకుంటున్నట్లు కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు వసూలు చేసి ఇవ్వడమే కాకుండా బలిపశువులమై పోతున్నామని వారు ఆక్రోశిస్తున్నారు. డీఈవో కార్యాలయాలపై నిఘా బృందాలు దృష్టి సారిస్తే ఎన్నో అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు అంటున్నారు.

లక్ష కొట్టు.. కాంట్రాక్టు పట్టు.. అన్నాడు!

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నట్లు తెలిపారు. ఆ ఫైల్‌ను విద్యుత్ ఏఈ, డీఈలు ధ్రువీకరించి, జిల్లా విద్యుత్ అధికారి వద్దకు అప్రోవల్ చేసినట్లు తెలిపారు. టెండర్ ఫైల్‌ను అప్రూవ్ చేయాలంటే రూ.లక్ష లంచం ఇవ్వాలని బాధిత కాంట్రాక్టర్లను ఎస్‌ఈ నరేష్ డిమాండ్ చేసినట్లు తెలిపారు. చేసేదేమిలేక నరేష్‌కు ఈనెల 14న రూ.20 వేలు బాధిత కాంట్రాక్టర్లు ఇచ్చారు. మిగిలిన రూ.80 వేలు ఇవ్వలేక వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో మహబూబాబాద్ హస్తినాపురం కాలనీలోని తన ఇంటి వద్ద నరేష్ బాధితుల నుంచి రూ. 80 వేలు లంచం తీసుకుంటుండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయానికి తీసుకువెళ్లి అధికారిని విచారించి రికార్డులను పరిశీలించారు. తర్వాత అతన్ని అరెస్టు చేసి గురువారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఉలిక్కిపడిన అధికారులు..

ఎస్‌ఈ నరేష్ క్లాస్-1 కాంట్రాక్టర్ల నుంచి లంచం తీసుకుంటుండడగా వరంగల్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పడ్డుకోవడంతో జిల్లాలోని వివిధ శాఖల అధికార యంత్రాంగం ఉలిక్కిపడ్డారు. గతంలో జిల్లా రవాణా శాఖ అధికారి, సబ్ రిజిస్ట్రార్, ఇతర శాఖల్లో చిరు ఉద్యోగులు ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం విధితమే. ఆ ఘటనలు మరువకముందే మరో జిల్లాస్థాయి అధికారి అంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టబడడంతో అధికారుల్లో గుబులు మొదలైంది.

పీడించడం వల్లే పట్టించాం..

విద్యుత్ లైన్ మెయింటెనెన్స్, మరమ్మతులకు సంబంధించిన పనుల కోసం తక్కువ కోట్ చేయడంతో టెండర్ రద్దు చేశారు. తిరిగి టెండర్ వేస్తే అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఏఈ, డీఈలు ఫైల్ ధృవీకరించారని, ఎస్‌ఈ నరేష్ మాత్రం రూ. లక్ష ఇస్తేనే ఫైల్ అప్రోవల్ చేస్తానని తమను మానసికంగా ఒత్తిడి చేసి, డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించి అధికారిని పట్టించామని క్లాస్-1 కాంట్రాక్టర్లు అజారుద్దీన్, నజీరుద్దీన్ తెలిపారు.

- ఎస్‌కే అజారుద్దీన్, నజీరుద్దీన్, క్లాస్-1 కాంట్రాక్టర్లు

నిరుపయోగంగా టెల్‌ఫోన్ భవనం

వడ్డేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ పాత గ్రామ పంచాయతీ ప్రాంతంలోని టెలిఫోన్ భవనం రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంటోంది. భవన ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు మందుబాబులకు అడ్డాగా మారింది. టెలిఫోన్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. రెండు దశాబ్దాలుగా టెలిఫోన్ భవనం అధికారుల ఆలనా పాలన కొరవడి నిరుపయోగంగా మారింది. పిచ్చి మొక్కలు, నిరుపయోగమైన చెట్లు ఏపుగా పెరిగి పాములు, తేళ్లకు ఆవాసంగా మారింది. రాత్రివేళల్లో మందుబాబులకు నిలయంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు మునిసిపల్ కమిషనర్ స్పందించి నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


గోపాల్‌పూర్‌లో నిరుపయోగంగా ఉన్న టెలిఫోన్ భవనం


జీఎంను సన్మానిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

రైల్వే జీఎంకు ఘన సన్మానం

కాజీపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందుతున్న రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను బుధవారం కాజీపేట మజ్దూర్ యూనియన్ నాయకులు సికింద్రాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, డివిజనల్ జనరల్ సెక్ర టరీ శంకర్ రావులు మాట్లాడారు. జీఎం అరుణ్‌కుమార్ జైన్ తీసుకున్న నిర్ణయాల వల్ల ఇండియన్ రైల్వేలోనే సికింద్రాబాద్ జోన్ అగ్రగామిగా నిలిపారన్నారు. 15వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసిన ఘనత కూడా ఆయనదే అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, డీజిల్ లోకో బ్రాంచ్ ఛైర్మన్ ఎస్కే జానీ, సెక్రటరీ పి.వేదప్రకాశ్, ట్రెజరర్ జి.రాజేశ్వర్ రావు, వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ టాపర్‌కు అభినందనలు


విద్యార్థిని అభినందిస్తున్న కేయూ ఉపాధ్యాయ బృందం

హసన్‌పర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ బైపీసీ విభాగంలో 430 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిన మునుగు ఆదిత్యను కాకతీయ ప్రభుత్వ కళాశాల ఆంగ్ల విభాగం అధ్యాపకులు అభినందించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ సునిత అధ్యక్షతన జరిగిన అభినందన సభలో స్టేట్‌టాపర్ సాధించడంలో కృషిచేసిన అధ్యాపక బృందాన్ని, విద్యార్థి ఆదిత్యను అభినందించి సన్మానించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతూ ఉత్తమఫలితాలు సాధించే పేద విద్యార్థులకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్ డాక్టర్ టీఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ భూక్య శ్రీనివాస్, డాక్టర్ రాంభాస్కర్ రాజు, డాక్టర్ దినకర్, శ్రీకాంత్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

హార్టికల్చర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వడ్డేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ (హరితహారం) కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి వారు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హార్టికల్చర్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌తోపాటు ఐడీ నంబర్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రంజిత్, మమత, పుష్పతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో ప్రజల భాగస్వామ్యం కీలకం


మొక్కను నాటుతున్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్

హసన్‌పర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్‌లో ప్రజల భాగస్వామ్యం కీలకమని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టు దేవస్థానం కమ్యూనిటీ హాలులో బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షతన సంకల్ప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దేవస్థానం ఆవరణలో మొక్కలు నాటి వికసిత్ భారత్ 2047 ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పార్టీ బలోపేతం, యోగా దినోత్సవం, రచ్చబండ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంల బీజేపీ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జి ముత్తిరెడ్డి కేశవరెడ్డి, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపెల్లి కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్ తాళ్ల శ్యాం, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసరాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

వరంగల్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణలను హనుమకొండ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్స్ శివకుమార్, సీతారెడ్డి ఆధ్వర్యంలో బుధవారంతొలగించారు. బస్టాం డ్ చుట్టుపక్కల ఉన్న ఆస్పత్రులు, లాడ్జిల ఎదుట వాహనాలు పార్కింగ్ చేయకుండా ఆయా సంస్థల యాజమానులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు అనవసరంగా రోడ్డలపై ఆటోలు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని హెచ్చరించారు. వ్యాపార సంస్థల యాజమానులు రోడ్లపై వాహనాలు పార్కిం గ్ చేసి ట్రాఫిక్ అంతరాయం కల్గిస్తే కఠిన చర్యలుంటాయన్నారు.


ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బండిని తొలగిస్తున్న పోలీసులు

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్ పాయి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయి అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని 66 డివిజన్‌ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, స్మార్ట్‌సిటీ పనులకు నిధుల కేటాయింపుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 66 డివిజన్‌లలో ఏఈలకు కేటాయించిన పనులను సంబంధిత డీఈలు పర్యవేక్షించాలని అన్నారు. జాబ్‌చార్ట్ మేరకు సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు సంతోష్‌బాబు, మాధవీలతతో పాటు స్మార్ట్‌సిటీ ప్రతినిధులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్


సీపీకి మొక్కను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్‌లోని పలు అంశాలపై ఇరువురు చర్చించారు.


వరంగల్ రైల్వేస్టేషన్‌లో పోలీస్ జాగిలంతో డ్రగ్ కంట్రోల్ సిబ్బంది తనిఖీ

డ్రగ్ కంట్రోల్ టీం తనిఖీలు

వరంగల్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో పోలీసు జాగిలంతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల బ్యాగ్‌లను, రైల్వేస్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో డ్రగ్ కంట్రోల్ టీం ఇన్‌స్పెక్టర్ వై.సతీష్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై మనోజ్, నాగారాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వర్సిటీలో ఆర్‌వో వాటర్ ప్లాంట్స్ ప్రారంభం

కేయూ క్యాంపస్ జూన్ 18, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాల, వర్సిటీ క్యాంపస్ లోని ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌తో పాటు పద్మాక్షి మహిళ హాస్టల్‌లో 3 ఆర్‌వో వాటర్ ప్లాంట్లను జూన్19న గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు కేయూ హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, లా కళాశాల హాస్టల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చల్లా శ్రీనివాస్‌లు తెలిపారు. బాల వికాససంస్థ మూడు ఆర్‌ఓ ప్లాంట్లను విద్యార్థుల సౌకర్యార్థం విరాళంగా అందిస్తోందని తెలిపారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హాస్టల్ డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.

జింబోకు సహృదయానుబంధ పురస్కారం

కవితా ప్రసాద్ పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంగారి రాజేందర్

హనుమకొండ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ సాహితీ, సాంస్కృతిక సంస్థల్లో ఒకటైన సహృదయ ఏటా అందించే సహృదయానుబంధ పురస్కారాన్ని ఈసారి డాక్టర్ మంగారి రాజేందర్ (జింబో)కు ప్రధానం చేసింది. బుధవారం హనుమకొండ వడ్డెపెల్లి రోడ్డులోని పీఆర్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కార ప్రదానం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా చాకలి అయిలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ, విశిష్ట అతిథిగా జాతీయ సాహిత్య పరిషత్తు రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి మావుడూరు సూర్యనారాయణ మూర్తి హాజరయ్యారు. డాక్టర్ జి.గిరిజా మనోహర్‌బాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు రాళ్లబండి కవితా ప్రసాద్ సాహితీ ప్రస్థానం, సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆశువుగా రాసిన శతకాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సహృదయ కార్యవర్గ సభ్యులు జూలూరి నాగరాజు, నీత వెంకట్, కళా రాజేశ్వర్‌రావు అంపశయ్య నవీన్, డాక్టర్ ఏవీ నర్సింహారావు, లక్ష్మీకాంతారావు, మల్యాల మనోహర్, రాళ్లబండి నాగినీ దేవి, సంవరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాళ్లబండి కవిత ప్రసాద్ రాసిన కవిత వనం, సప్తగిరి ధామ కలియుగ సార్వభౌమ అనే రెండు పుస్తకాలను ఆయన కుమారుడు సంవరణ్, నాగినిదేవి ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు.

సైనికుల సంక్షేమానికి పాటుపడాలి

రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ రమేశ్ కుమార్


విరాళం చెక్కును సైనిక అధికారులకు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ జూన్ 18, (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల కోసం ప్రాణాలను అర్పిస్తున్న సైనికుల సంక్షేమం కోసం అందరూ పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ పి.రమేశ్‌కుమార్ ఉద్బోధించారు. బుధవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అకూట్ అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీరాజ్‌కుమార్‌ల నేతృత్వంలో సైనికు సంక్షేమం కోసం రూ. 3,07,610ల చెక్‌ను రమేశ్‌కుమార్‌కు అందచేశారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. 'అర్మెడ్ ఫోర్సెడ్ ఫ్లాస్ డే ఫండ్'గా కేయూ బోధన సిబ్బంది ఒక రోజు బేసిక్ పే వేతనాన్ని సైనికుల సంక్షేమం కోసం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. సైనికుల సంక్షేమం కోసం నిధుల పట్ల అప్రమత్తంగా ఉంటామని పారదర్శకతతో వ్యవరిస్తామని చెప్పారు. సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు సహకరిస్తామని చెప్పారు. సైనికుల సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధివంటి ఎన్నో పథకాలున్నాయని వివరించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సైనికుల సేవలు చిరస్మరణీమని కొనియాడారు. ప్రజల భద్రతకు పాటుపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకూట్ అధ్యక్షకార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, రాజ్‌కుమార్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సవితాజ్యోత్స్న, బొద్దిరెడ్డి రమారెడ్డి, షయేదా, డాక్టర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

హనుమకొండ రెవెన్యూ డివిజన్ అధికారి రమేష్ రాథోడ్


రెవెన్యూ సదస్సులో ఆర్‌డీవోకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

హసన్‌పర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా ఉంటూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడమే ప్రభుత్వ ఉద్దేశమని హనుమకొండ రెవెన్యూ డివిజన్ అధికారి రమేష్ ఆథోడ్ అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సదస్సును హనుమకొండ ఆర్‌డీవో సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాస్తులో ఉండి పట్టా పాసు పుస్తకాలు లేని వారు, క్రయవిక్రయాల ఆధారాలు కలిగిన భూ కొనుగోలుదారులు, కొనుగోలు చేసినప్పటికి పాత పట్టాదారు పేర్లు రికార్డులలో వస్తున్నవారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దారు నేతృత్వంలో విచారణ జరిపి హక్కుదారులకు హక్కులు కల్పిస్తామని తెలిపారు. ప్రతీ ఒక్కరు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకొని భూ భారతి హక్కు చట్టం ద్వారా హక్కులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చల్ల ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు ఎం.డి.రహీంపాషా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మారపల్లి చంద్రారెడ్డి, చిర్ర తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


డీఈవో ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసుతుల కల్పించాలని ధర్నా నిర్వహించిన అనంతరం సూపరింటెండెంట్ జీఎస్.ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారావు మట్లాడుతూ.. వసతులు కల్పించకుండా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు విద్యను బలోపేతం చేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖాధికారులు ఎలాంటిచర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య ను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావ్య, అనూష, వంశీ, చారి, శ్రీజ, సాధన తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్ డైరెక్టర్‌గా ఎల్‌పీ రాజ్‌కుమార్ కొనసాగింపు

కేయూ క్యాంపస్ జూన్ 18, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్‌గా గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ను మరో ఏడాది కొనసాగిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి రాజ్‌కుమార్‌కు కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో ఉత్తర్వులను అందచేశారు.

జీవితంలో యోగా భాగం కావాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి

కేయూ క్యాంపస్ జూన్ 18, (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతీ ఒక్కరి జీవితంలో భాగం కావాలని కేయూ వర్సిటీ మహిళ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పిలుపునిచ్చారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా యోగా వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురువు శ్రీనివాస్ విద్యార్థులకు యోగాసానాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ కె.కవిత, డాక్టర్ జి.మధుశ్రీ, టి.అన్నపూర్ణ, సంధ్య, సోమలింగం పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

వడ్డేపల్లి : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 20న ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యోగా వేడుకల్లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి భూపతిరాజు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యోగా సాధకుడు నాగిళ్ల వేణుశర్మ, జయశ్రీ, శ్రీవిద్య, రాజేష్ పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.108కోట్లు విడుదల

రెండోరోజు మరికొంత మంది రైతుల ఖాతాల్లో జమ

హనుమకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల సాగుకు ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా బుధవారం జిల్లాలో మూడెకరాల వరకు ఉన్న రైతులకు ఎకరానికి రూ.6వేల చొప్పున వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. దీంతో జిల్లాలో 14 మండలాల్లోని 163 గ్రామాల్లో 1,28,900మంది రైతులకు జమ అయింది. నేరుగా రైతు ఖాతాల్లోనే భరోసా పెట్టుబడి సాయం జమ అవుతున్నదని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తెలిపారు.

మండలాలవారీగా..

భీమదేవరపల్లి మండలంలో 9,726 మంది రైతులకు రూ.9,39,67,924, ధర్మసాగర్ మండలంలోని 10,743 మంది రైతులకు రూ.9,68,01,646, ఎల్కతుర్తి మండలంలోని 10,714 మంది రైతులకు రూ.9,15,71,487, హనుమకొండ మండలంలోని 1,207 మంది రైతులకు రూ.6731917, హసన్‌పర్తి మండలంలోని 12,954 మంది రైతులకు రూ.9,62,22,069, ఐనవోలు మండలంలోని 11,731 రైతులకు రూ.10,31,78,657, కమలాపూర్ మండలంలోని 14,745 మంది రైతులకు రూ.12,20,81,008, కాజీపేట మండలంలోని 5,277 మంది రైతులకు రూ.3,37,87,652, వేలేరు మండలంలోని 7,430 మంది రైతులకు రూ.7,38,23,587, ఆత్మకూరు మండలంలోని 9,802 మంది రైతులకు రూ.75859761, దామెర మండలంలోని 7,175 మంది రైతులకు రూ.6,27,51,166, నడికూడ మండలంలోని 9,947 మంది రైతులకు రూ.87073576, పరకాల మండలంలోని 6,954 మంది రైతులకు రూ.5,63,72,007, శాయంపేట మండలంలోని 10,495 మంది రైతులకు రూ. 8,49,13,355 రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి.

ఆకతాయిలకు షీటీం పోలీసుల కౌన్సెలింగ్

వరంగల్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చిల్డ్రన్ పార్కులో మహిళలను వేధిస్తున్న ఆకతాయిలను షీటీం పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సీఐ సుజాత మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం షీటీం పనిచేస్తోందని, సామాజిక మాధ్యమాలలో మహిళలు ఎలాంటి వ్యకిగత సమాచారాన్ని, ఫొటోలను అప్‌లోడ్ చేయొద్దని సూచించారు. మహిళలు వేధింపులకు గురైతే 8712685257 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.



ఇల్లు అందంగా...

ఇంట్లోకి ప్రవేశించగానే తాజాగా అహ్లాదకరమైన అనుభూతి కలిగేలా ఉండాలని ప్రతిఒక్కరూ కోరుకుంటూ ఉంటారు. అందుబాటులో ఉన్నవాటితోనే ఇంటిని అందంగా అలంకరించుకుంటారు కూడా. ఇలా ఇంటిని మరింత శోభాయమానంగా మార్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే...



- ఇంటిని పూర్తిగా ఫర్నిచర్‌తో నింపేయకూడదు. ఇంటి విస్తీర్ణాన్ని అనుసరించి ఫర్నిచర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇల్లు చిన్నగా ఉంటే మల్టీపర్పస్ ఫర్నిచర్‌ను ఎంచుకోవచ్చు. ఇంట్లో సామాన్లను చిందరవందరగా పడేయకుండా ఎక్కడికక్కడ పొందికగా సర్దుకోవాలి.
- ఇంట్లోకి రాగానే హాల్ విశాలంగా వెలుతురుతో కనిపిస్తే బాగుంటుంది. సోఫా వెనక గోడకి పోల్కా డాట్స్, పేపర్ ఫ్యాన్‌లు, చిన్న చిన్న పూలచెట్లు-సరస్సు-ఎగిరే పక్షుల డిజైన్లతో ఉన్న స్టిక్కర్లు అంటిస్తే ఇల్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. సోఫాకి ఇరుపక్కలా మొక్కల కుండీలు పెడితే తాజా అనుభూతి కల్గుతుంది. సోఫా మీద వెల్వెట్ పిల్లోలు, టీపాయ్ మీద ఫ్లవర్ వాజ్ అదనపు ఆకర్షణగా నిలుస్తాయి.
- ఇల్లు అందంగా కనిపించేలా చేయడంలో కర్టెన్లదే ప్రధాన పాత్ర. లేత రంగుల్లో డిజిటల్ ప్రింటింగ్ ఉన్న కర్టెన్లు ఇంటికి శోభనిస్తాయి. కిటికీలకు రకరకాల పక్షులు, పచ్చిక బయళ్లు, సాగర తీరాలు, రాజభవనాల బొమ్మలతో కూడిన కర్టెన్లు వేస్తే ఇంటికి మరే ప్రత్యేకమైన అలంకరణ అవసరం ఉండదు.
- వంటగదిని సౌకర్యవంతంగా ఏర్పాటు చేసుకోవడం మాత్రమే కాదు అందంగా తీర్చిదిద్దుకోవడం కూడా చాలా ముఖ్యం. అల్మారాలు, కప్‌బోర్డులకు అందమైన లామినేషన్ షీట్లు అమరిస్తే చూడడానికి బాగుంటుంది. సిరామిక్, క్రిస్టల్, పీవీసీ, చెక్క సామాగ్రిని వాడితే వంటగది ఆకర్షణీయంగా ఉంటుంది.
- పడక గది, పిల్లల గది చిన్నగా ఉన్నాయనిపిస్తే నేలమీద చిన్నపాటి కార్పెట్ పరచి గది మూలల్లో పొడవుగా పెరిగే మొక్కల కుండీలు పెడితే చాలు గది విశాలంగా ఉన్నట్లు కనిపిస్తుంది.

అతిగా తాగితే..!

కొందరికి ఉదయం, సాయంత్రం టీ లేదా కాఫీ తాగడం అలవాటు. అయితే వర్షాకాలంలో వాతావరణం మారి చిరుజల్లులు మొదలవగానే సమయంతో సంబంధం లేకుండా టీ తాగుతుంటారు. ఇలా అతిగా టీ, కాఫీలు తీసుకోవడం వలన పలు అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం..



- టీ, కాఫీల్లో కెఫిన్ ఉంటుంది. ఇది కడుపులో యాసిడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దాంతో గుండెలో మంట వచ్చే ప్రమాదముంది.
- కడుపు ఉబ్బరం, ఎసిడిటి సమస్యలు కూడా వస్తాయి.
- టీ, కాఫీలు అతిగా తాగడం వలన శరీరంలో చక్కెర స్థాయిలు పెరిగిపోతాయి. ఫలితంగాడయాబెటిస్, ఊబకాయం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.
- టీ, కాఫీ వలన కొలెస్ట్రాల్ పేరుకుపోయి, గుండె సంబంధిత వ్యాధులకు దారి తీయవచ్చు.
- కెఫిన్ మెలటోనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దాంతో నిద్ర సరిగా పట్టదు.
- టీ, కాఫీల్లో ఉండే సుక్రోజ్ కాలేయం, చిన్న ప్రేగు మీద చెడు ప్రభావం చూపుతుంది.



కుప్పడం చీరలు.. చాలా మందికి ఇంకా తెలియని అద్భుతమైన నేత చీరలు. తాజాగా ఈ చీరలకు 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా జాతీయ అవార్డు లభించింది. దీనిని వచ్చే నెల 14వ తేదీన ఢిల్లీలో అందిస్తారు..

విభిన్నం

కుప్పడం చీరలకు కొత్త గుర్తింపు

విపత్కర పరస్థితుల్లో

వాతావరణం ప్రతికూల సమయాల్లో మగ్గం సాగక చాలా ఇబ్బందులు పడుతుంటాము. ఇటువంటి పరిస్థితులలో ప్రత్యేక భరోసా కల్పించాలి. కూలీల ధరలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఆకలి కేకలు తప్పడంలేదు. చేనేత కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి.

- భువనేశ్వరి, చేనేత కార్మికురాలు



బాపట్ల జిల్లాలోని చీరాలకు జాతీయోద్యమంలో ఒక ప్రత్యేకత ఉంది. స్వదేశీ ఉద్యమంలో భాగంగా మహాత్మాగాంధీకి మద్దతుగా ఈ ప్రాంత ప్రజలు విదేశీ గుడ్డలను బహిష్కరించారు. వేల సంఖ్యలో నేత కార్మికులు గుడ్డలను నేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ రోజుల్లో దీనిని చాలా మంది ఒక అరుదైన సంఘటనగా అభివర్ణించేవారు. ఆ సమయంలో ప్రారంభమయిన నేత ఉద్యమం కొనసాగుతూ వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన చాలా కాలం తర్వాత కూడా చీరాలకు చెందిన నేతకు.. ముఖ్యంగా కుప్పాడం చీరలకు మంచి ఆదరణ లభించింది. కానీ ఆధునిక కాలంలో నేత వస్త్రాలకు ఆదరణ తగ్గటంతో కుప్పాడం చీరలను నేసేవారి సంఖ్య కూడా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం చీరాల ప్రాంతంలో ఐదువేల నేత మగ్గాలు ఉంటే- కేవలం రెండు వేల మగ్గాలపై మాత్రమే చీరలను నేస్తున్నారు. తాజాగా వచ్చిన జాతీయ అవార్డు వల్ల దేశ వ్యాప్తంగా ఈ చీరలకు ఆదరణ పెరుగుతుందని.. ఎక్కువ మంది కొనుగోలు చేస్తారని స్థానిక చేనేత కార్మికులు ఆశిస్తున్నారు.

ప్రత్యేకతలివే...

చీరకు అంచు ఒక ప్రత్యేకతను ఇస్తుంది. ఈ అంచు ఎంత భిన్నంగా ఉంటే- చీర అంత అందంగా తయారవుతుంది. సాధారణంగా దేశంలో వివిధ ప్రాంతాల్లో నేసే నేత చీరల అంచు ఐదు అంగుళాలకు మించదు. కానీ కుప్పాడం చీరల అంచు మాత్రం 18 అంగుళాలు ఉంటుంది. "చీర అంచే కుప్పడం ప్రత్యేకత. ఈ అంచులో నేసే డిజైన్లు మిగిలిన చేనేతలకు భిన్నంగా ఉంటాయి. నేతలోనే ఈ అంచు కూడా తయారవుతుంది. ఈ అంచులను తయారుచేయటానికి ప్రత్యేకమైన నాడులు.. అచ్చులు ఉంటాయి. ఒక సారి నేసిన తర్వాత చీరలోనే అంచు కలిసిపోతుంది.." అంటారు ఈ చీరలను నేసే హెచ్చిన భువనేశ్వరి. ఈ చీరలను నేయటానికి ఎక్కువ సమయం కూడా పడుతుంది. "రోజుకు ఇద్దరు పనిచేస్తే- ఒక చీర నేయటానికి మూడు నుంచి నాలుగు రోజులు పడుతుంది. అందువల్ల ఖరీదు పెరుగుతుంది. మంచి కుప్పడం సిల్క్ చీరను తయారుచేయటానికి ముడి సరుకుతో కలిపి 3 నుంచి 8వేల వరకూ అవుతుంది. పట్టణాలలో పెద్ద పెద్ద దుకాణాలలో వీటిని రెట్టింపు ధరకు అమ్ముతారు" అంటారు భువనేశ్వరి.



కాలంతో పరిగెట్టి...

ఈ ఆధునిక యుగంలో ప్రజలు కొత్త కొత్త డిజైన్లను కోరుకుంటున్నారు. ఈ డిజైన్లను అందించలేని చేనేతలకు ఎక్కువ డిమాండ్ ఉండటం లేదు. "కొత్త డిజైన్లు తయారుచేసి మార్కెట్‌లో ప్రవేశపెట్టాలంటే డిమాండ్ ఎక్కువగా ఉండాలి. అంతే కాకుండా ఈ కళపై ఆసక్తి ఉండాలి. ఈ ఆసక్తి రావాలంటే యువతీ, యువకులకు మంచి వేతనాలు లభించాలి. ప్రభుత్వం నుంచి బ్యాంకుల నుంచి ప్రోత్సాహం లభించాలి. ప్రస్తుతం కుప్పడం చీరల నేత విషయంలో మేము ఎదుర్కొంటున్న సమస్యలివే.." అంటారు మాస్టర్ వీవర్ సిద్ది బుచ్చేశ్వరరావు. ప్రస్తుతం ఎక్కువ ఆదరణ లేకపోయినా- ప్రతి రోజూ కనీసం రెండు వేల మంది కార్మికులు మగ్గాలపై చీరలను నేస్తున్నారు. ఈ చీరకు లభించిన జాతీయ అవార్డు వల్ల ప్రజలకు ఈ చీరలపై అవగాహన పెరుగుతుందని.. దీని ద్వారా డిమాండ్ వస్తుందని చేనేత కార్మికులు ఆశిస్తున్నారు. వీరి ఆశలు ఫలించాలని.. ఈ చీరలకు జాతీయ, అంతర్జాతీయ వ్యాప్తంగా గుర్తింపు రావాలని కోరుకుందాం.

• తాళ్లూరి ప్రదీప్, చీరాల

కౌన్సెలింగ్

లింఫొడీమా ఎందుకు?

డాక్టర్! నాకు ముంజేయి వాపు ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితి ఎంతో అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇలా ఎందుకు జరుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారం సూచించగలరు?

- ఓ సోదరి, హైదరాబాద్

Q A

దీన్ని లింఫోడీమా అంటారు. లింఫోడీమా అంటే అవయవ వాపు. లింఫ్ గ్రంథుల నుంచి స్రవించే స్రావం కణజాలాలకు చేరకుండా, నిల్వ ఉండిపోతే ఇలా జరుగుతుంది. ఫలితంగా ఆయా ప్రదేశాలతో సంబంధం ఉన్న కాళ్లు, చేతులు, ముఖం... వాచిపోతాయి.

వాపు నియంత్రణ మన చేతుల్లోనే

ఈ సమస్య క్రమేపీ పెరుగుతుంది. కాబట్టి ప్రారంభంలోనే గుర్తించి జాగ్రత్తపడడం అవసరం. లింఫోడీమా వాపు సాధారణ వాపు కంటే భిన్నంగా ఉంటుంది. కాళ్లలో తలెత్తే లింఫోడీమా అయినా, చేతుల్లో తలెత్తే లింఫోడీమా అయినా, వేళ్ల పైన ఉండే చర్మం ఉబ్బిపోయి, వేళ్లతో పట్టుకుని లాగడానికి సాధ్యపడదు. ఇలా ప్రారంభంలోనే గుర్తిస్తే బిగుతైన 'లింఫాటిక్ గార్మెంట్స్' వేసి వాపును అదుపులో ఉంచుకోవచ్చు.



చికిత్స ఇలా

లింఫ్ స్రావం పేరుకుపోవడం కారణంగా లింఫోడీమా తలెత్తినప్పుడు, ఆ స్రావాన్ని తిరిగి ఆ ప్రదేశం నుంచి వెనక్కి వెళ్లేలా చేయడమే ఈ సమస్యకు ప్రధాన చికిత్స. ఇందుకోసం మూడు రకాల పద్ధతులను అనుసరించాలి. అవేంటంటే....

మర్దన: మర్దన వల్ల మూసుకుపోయిన నాళాలు తెరుచుకోకపోయినా, చర్మం అడుగున కొత్త నాళాలు ఏర్పడేలా చేయవచ్చు. ఫలితంగా స్రావం వెనక్కి వెళ్లిపోతుంది. అయితే మర్దన కోసం ఎలాంటి నూనెలూ వాడకూడదు. మర్దన విధానం వైద్యుల దగ్గరే నేర్చుకుని అనుసరించాలి.

శుభ్రత: లింఫోడీమా తలెత్తిన అవయవం చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. మరీ ముఖ్యంగా వేళ్ల సందుల్లో ఎక్కువగా శుభ్రం చేసుకోవాలి. కేవలం చర్మం శుభ్రం చేసుకోవడానికే ఉదయం, సాయంత్రం చెరొక అరగంట కేటాయించాలి. జీరో పిహెచ్ రకం సబ్బునే వాడాలి. లేదంటే వాపు వల్ల ఏర్పడే ముడతల్లో బ్యాక్టీరియా చేరి ఇన్‌ఫెక్షన్లు మొదలవుతాయి. ఇలా కొత్తగా వచ్చే ఇన్‌ఫెక్షన్లు తిరిగి లింఫ్ నాళాలను మూసుకుపోయేలా చేసి పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తాయి.

లింఫాటిక్ కంప్రెషన్ పంప్: ఈ పరికరం కూడా అవయవాల్లో పేరుకుపోయిన స్రావాన్ని వెనక్కి పంపిస్తుంది. ప్రారంభంలో వైద్యుల సహాయంతో ఈ చికిత్స తీసుకోవాలి. తర్వాత ఇంట్లోనే ఉపయోగించుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం గంట నుంచి గంటన్నర సమయం పాటు ఈ పరికరాన్ని ఉపయోగించాలి.

ఈ జాగ్రత్తలన్నీ నేర్చుకుని, అనుసరించడం కోసం ఆస్పత్రిలో వైద్యుల దగ్గర 8 రోజుల పాటు శిక్షణ తీసుకోవలసి ఉంటుంది. ఈ జాగ్రత్తలు పాటించగలిగితే లింఫోడీమాను 70% నుంచి 80% వరకూ తగ్గించవచ్చు. అయితే వాపు తగ్గినా కంప్రెషన్ గార్మెంట్స్ జీవితాంతం వాడుతూనే ఉండాలి.

ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్ష

లింఫోడీమాలో చర్మానికి గాయమైతే సూక్ష్మజీవులు తేలికగా ఆకర్షితమవుతాయి. దాంతో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. ఈ అవకాశాలు ఎక్కువ కాబట్టి ఎటువంటి ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే వీలు లేకుండా 'లాంగ్ టర్మ్ యాంటీబయాటిక్స్' తీసుకోక తప్పదు. ఈ చికిత్సలో భాగంగా తక్కువ మోతాదులో ప్రతి 21 రోజులకు ఒక ఇంజక్షన్ తీసుకోవలసి ఉంటుంది. అలాగే బాడీ మాస్ ఇండెక్స్ 30 కంటే తక్కువ ఉన్న వారితో పోలిస్తే, అంతకంటే ఎక్కువ ఉన్న వారిలో లింఫోడీమా వచ్చే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు అదుపులో ఉంచుకోవడం అవసరం.

డాక్టర్ రాజా వి. కొప్పాల,
ఫెలో ఇన్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ,
ఎవిస్ హాస్పిటల్, హైదరాబాద్.

విజయానికి మార్గాలు...

ఎందులోనైనా విజయం సాధించాలంటే మంచి క్రమశిక్షణతోపాటు సానుకూలదృక్పథాన్ని అలవరచుకోవాలి. వీటితోపాటు కొన్ని నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకుంటే మార్గం సుగమం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు..

- వినడం, మాట్లాడడం, స్పందించడం అనేవి విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ముందుకు సాగేందుకు దిశానిర్దేశం చేస్తాయి. అనుకున్నది సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇలాంటి కమ్యూనికేషన్ స్కిల్స్ మీద దృష్టి పెట్టడం తప్పనిసరి.
- భావోద్వేగాలను నియంత్రించుకోవడం అలవాటు చేసుకోవాలి. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి. సమిష్టి కృషి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి. జట్టు సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం చేయాలి.
- సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి. సమాజంలోని వ్యక్తులను అర్థం చేసుకోవడం, వారిని సరిగా అంచనా వేయగల్గడం నేర్చుకోవాలి. అనుబంధాలకు విలువ ఇస్తూనే నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలి.
- లక్ష్య సాధన కోసం స్వీయ ప్రేరణ అత్యవసరం. ఏదైనా సాధించాలనే తపనే ముందుకు నడిపిస్తుంది.
- సమయపాలన అనేది ఎన్నో పనులను సఫలీకృతం చేస్తుంది. ఉత్పాదకతను మెరుగుపరచి వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడుతుంది.
- ఆలోచనా విధానాన్ని సానుకూలంగా మార్చుకోవాలి. సత్సంబంధాలను ఏర్పరచుకోవాలి. వ్యక్తిగత బలహీనతలను అధిగమించే ప్రయత్నం చేయాలి. కొత్త అంశాల గురించి తెలుసుకోవడానికి ఉత్సుకతతో ఉండాలి. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.
- ఏదైనా సమస్య ఎదురైనప్పుడు విశ్లేషణాత్మకంగా ఆలోచించి పరిష్కారమార్గాన్ని అన్వేషించడం నేర్చుకోవాలి. దీనివల్ల ఆలోచనా సామర్థ్యం పెరుగుతుంది. మనో నిబ్బరం అలవడుతుంది.
- మార్పులను స్వీకరించడం అలవాటు చేసుకోవాలి. వాటికి అనుగుణంగా నడచుకోవడం, కొత్త సవాళ్లను ఎదుర్కోవడం అనేవి అనుభవాన్ని పెంచుతాయి. విజయానికి చేరువ చేస్తాయి.



పెద్ద చదువులకు నోచుకోలేదు... అడుగడుగునా కట్టుబాట్లు... చిన్న వయసులోనే వివాహం, కుటుంబ బాధ్యతలు... ఆర్తి రాణా జీవితం అందరు తెహ్రీ మహిళల్లాంటిదే. కానీ పేదరికం నుంచి బయటపడి, స్వావలంబన సాధించాలనే పట్టుదలతో ఆమె ముందుకు నడిచారు. ఆమె కృషి 44 గ్రామాలకు చెందిన 10 వేల మంది ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదం చేసింది. 'నారీశక్తి' అవార్డుతో సహా పలు పురస్కారాలు అందుకున్న ఆర్తి కథ ఇది...



మహిళ ఆర్థిక స్వావలంబనకు..

"**మా**ది ఉత్తరప్రదేశ్‌లోని గోబరోలా గ్రామం. లఖీంపూర్ ఖెరీ జిల్లాలోని పలియా బ్లాక్‌లో థారు గిరిజన తెగ ప్రజలు నివసిస్తున్న 46 గ్రామాల్లో అది ఒకటి. నేపాల్‌ను ఆనుకొని ఉంటుంది. నేపాల్‌లో, దేశంలోని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్ రాష్ట్రాల్లో మా తెగవారు అధికం. వ్యవసాయం, పశువుల పెంపకం మా ప్రధాన వృత్తి. పితృస్వామ్య భావాలు, కట్టుబాట్లు మా గ్రామాల్లో ఇప్పటికీ ఎక్కువే. అలాంటిది నలభయ్యేళ్ళ క్రితం ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. ఆడపిల్లల్ని చదివించేవారు కాదు. పన్నెండేళ్ళకే పెళ్ళి చేసేవారు. అప్పటి నుంచి వాళ్ళకు ఇల్లు, సంసారమే లోకం. తమ గ్రామం బయట ఏం ఉంటుందో చూడకుండానే వాళ్ళు జీవితకాలం గడిపేసేవాళ్ళు. అలాంటి చోట పుట్టి ఎనిమిదో తరగతి వరకూ చదవడం పెద్ద విషయమే. నాకు పెద్ద చదువులు చదవాలని ఉండేది. దానికి మా ఇంట్లో ఒప్పుకోలేదు. పద్ధెనిమిదేళ్ళు రాకుండానే పెళ్ళి చేశారు. రెండేళ్ళకల్లా పిల్లలు, వాళ్ళ బాధ్యతలు. 'వాళ్ళా ఈ గ్రామంలో... అరకొర చదువులతో, పేదరికంలో మగ్గిపోవాల్సిందేనా' అనే బాధ నన్ను వేధిస్తూ ఉండేది. మా అత్తవారింట్లో మగ్గం ఉండేది. ఇంటి ఖర్చుల కోసం వాటి మీద నేయడం నేర్చుకున్నాను. కుట్టుపని కూడా చేసేదాన్ని.

గ్రామం దాటి మొదటిసారి...

2008లో... 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ప్రతినిధులు మా ప్రాంతంలోని దుద్వా నేషనల్ పార్క్‌ను సందర్శించారు. మా ఇంట్లో మగ్గం మీద నేస్తున్న నన్ను చూశారు. గ్రామీణ ప్రజల్లో హస్తకళా నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉపాధి అవకాశాలు కల్పించే శిక్షణ కార్యక్రమంలో చేరాల్సిందిగా వారు నన్ను ప్రోత్సహించారు. సీతాపూర్ నగరంలో శిక్షణ. మా ఇంట్లో వద్దంటే పట్టుపట్టి ఒప్పించాను. నేను మా గ్రామం దాటి బయటకు వెళ్ళడం అదే మొదటిసారి. ఆ శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది. మగ్గంపై మరింత నైపుణ్యంతో వస్త్రాలు ఎలా నేయవచ్చనేది నేర్చుకున్నాను. అలాగే మ్యాట్లు, బాస్కెట్లు, బ్యాగ్‌ల తయారీ తెలుసుకున్నాం.

ఆంక్షలు తగ్గాయి...

మా శిక్షణ ముగిసిన తరువాత... జిల్లా మేజిస్ట్రేట్ మాకు సర్టిఫికెట్లు అందజేశారు. మేము గ్రామాల్లో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసుకొని, మిగిలినవారికి చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తే... దానికి అవసరమైన వనరులు సమకూరుస్తామని చెప్పారు. మా పంచాయతీ తరఫున ఆ బాధ్యతలు నాకు అప్పగించారు. మొదట మా పంచాయతీ అంతా తిరిగాను. 'జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్' (ఎన్ఆర్ఎల్ఎం) తరఫున మహిళా బృందాల ఏర్పాటు కోసం ప్రయత్నించాను. కానీ తమ ఇంట్లోని ఆడవారు బయటకు వెళ్ళడానికి ఏ కుటుంబం ఒప్పుకోలేదు. కష్టపడి రెండు బృందాలను తయారు చేసి శిక్షణ ఇచ్చాను. 'ఎన్ఆర్ఎల్ఎం' నుంచి సాయం అందింది. ఉత్పత్తులు తయారు చేసి, విక్రయించడం ప్రారంభించాం. ఈలోగా తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల పెంపుడు పశువులు మరణించడం, వ్యవసాయం లాభదాయకంగా లేకపోవడం, మరోవైపు మా బృందాల ద్వారా మహిళలు ఆదాయం పొందుతూ ఉండడంతో... గ్రామస్తుల్లో మెల్లగా మార్పు వచ్చింది. ఆ తరువాత వెనుతిరిగి చూసింది లేదు. ఇప్పటివరకూ నా నేతృత్వంలో 44 గ్రామాల్లో 350 గ్రూపులు ఏర్పడ్డాయి. పదివేల మంది మహిళలు శిక్షణ పొందారు. వారిలో చాలామంది రూ.10-15 వేల కనీస ఆదాయం పొందుతున్నారు. దీంతో గ్రామాల్లో పరిస్థితుల కూడా క్రమంగా మారాయి. ఇప్పుడు మహిళలపై ఆంక్షలు బాగా తగ్గాయి. ఆడపిల్లలను కూడా బాగా చదివించాలనే ఆలోచన పెరిగింది.

స్థానికమైనవే ముడిసరుకుగా...

సభ్యుల సంఖ్య పెరగడంతో మార్కెట్‌ను విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. మేము సాధారణంగా ముడి సరుకుల కోసం సీతాపూర్ వరకూ వెళ్ళాల్సి వచ్చేది. కరోనా సమయంలో అది వీలు కాకపోవడంతో... మా ప్రాంతంలో పుష్కలంగా పెరిగే మూంజ్ గడ్డితో బాస్కెట్లు, పెన్ను స్టాండుల్లాంటి వస్తువుల తయారీని సభ్యులకు నేర్పించాం. దాని కోసం ఐటిడిపి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌ల సాయం తీసుకున్నాం. ఇప్పుడు ఎక్కువగా స్థానికంగా దొరికే వాటినే ముడిసరుకుగా ఉపయోగిస్తున్నాం. చేనేత వస్త్రాలు, హస్తకళాకృతులతో పాటు నిత్యం వినియోగించే బాస్కెట్లు, బ్యాగులు, డోర్‌మ్యాట్లు, పూల కుండీలు, పేపర్ స్టాండ్‌లు, మొబైల్ కవర్లు, శాండల్స్‌తో సహా ఎన్నెన్నో రూపొందిస్తున్నాం. వాటికి మంచి ఆదరణ లభిస్తోంది."

అవి పురోగతి సాధించాలంటే...

నా కృషికి గుర్తింపుగా 2016లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'రాణీ ఝాన్సీ లక్ష్మీబాయ్ బ్రేవరీ అవార్డు' ఇచ్చింది. 2022లో 'నారీ శక్తి' పురస్కారంతోపాటు, 'గ్రామస్వరాజ్ అవార్డ్' లాంటివి ఎన్నో అందుకున్నాను. ఒకప్పుడు మా గ్రామం తప్ప మరేదీ తెలియని నేను దేశమంతటా తిరిగాను. మా బృందాలు సాధించిన ఆర్థిక స్వావలంబన గురించి ఎన్నో సమావేశాల్లో ప్రసంగించాను. గ్రామీణ ప్రాంతాలు, పురుషాధిక్యత ఇప్పటికీ ఉన్న సమాజాలు పురోగతి సాధించాలంటే మహిళల ఆర్థిక స్వావలంబనే ఏకైక మార్గం.

ఇవి తినిపించాలి

పసిపిల్లలకు ఆరోనెల రాగానే అన్నప్రాసన చేసి ఘనాహారాన్ని తినిపించడం మొదలుపెడతారు. అప్పటివరకూ తల్లిపాలు మాత్రమే తాగుతారు కాబట్టి పిల్లల జీర్ణాశయం సున్నితంగా పనిచేస్తూ ఉంటుంది. ఇది అన్ని రకాల ఆహారపదార్థాలను జీర్ణం చేయలేదు. అందుకే త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారాన్ని మాత్రమే ఈ పిల్లలకు తినిపించాలి. ఆ వివరాలు...

- బాగా పండిన అరటి పండు గుజ్జును తినిపించవచ్చు. ఇందులో పొటాషియం, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల్లో మలబద్ధకం సమస్యను నివారిస్తాయి. యాపిల్, బొప్పాయి పండ్లను కూడా గుజ్జులా చేసి పెట్టవచ్చు.
- పచ్చి బఠానీలను కుక్కర్లో ఉడికించి మెత్తగా మెదిపి కొద్దికొద్దిగా తినిపించాలి. ఇందులో ఎ, సి విటమిన్లతో పాటు ప్రొటీన్లు, ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు ఉంటాయి. ఇవి పిల్లల ఎదుగుదలకు తోడ్పడతాయి.
- చిలగడ దుంపలను బాగా కడిగి ఉడికించి తొక్క తీసి వ్రేళ్లతో మెత్తగా చిదిమి తినిపించవచ్చు. ఇందులో అధికంగా గ్లూకోజ్ ఉంటుంది. ఇది పిల్లలకు శక్తిని అందిస్తుంది.
- అవకాడోను కూడా మెత్తగా చేసి తినిపించడం మంచిది. ఇందులో ఆరోగ్యకరమైన క్రొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల మెదడు పనితీరుని మెరుగుపరుస్తాయి.



- రకరకాల కూరగాయలను మెత్తగా ఉడికించి పెట్టవచ్చు. టమాటా రసం, ఉడికించిన కందిపప్పు మీద తేరిన నీరు లాంటివి తాగించవచ్చు. మెత్తగా వండిన అన్నం, క్వినోవాలతోపాటు బొంబాయిరవ్వ ఉప్మా, ఇడ్లీ లాంటివాటిని మెల్లగా అలవాటు చేయాలి.
- క్యారెట్‌కు తొక్క తీసి ఉడికించి తినిపించాలి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు పిల్లలకు రోగ నిరోధక శక్తిని అందిస్తాయి. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- మధ్యాహ్న సమయాల్లో రాగిజావ, పెసరపప్పు రసం పెట్టవచ్చు. వీటిలోని ప్రోటీన్లు, ఐరన్, కాల్షియం, పీచు పదార్థాలు, ఇతర విటమిన్లు కలిసి పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు సహకరిస్తాయి.



పెద్ద ధన్వాడ రైతులను సంకెళ్లతో అలంపూర్ కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

పెద్ద ధన్వాడ రైతులకు బేడీలు

- ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనకు సంబంధించి 40మందిపై కేసులు
- 12 మందిని జైలు నుంచి అలంపూరు కోర్టుకు తీసుకొస్తుండగా బేడీలు వేసిన పోలీసులు

లంపూరు చౌరస్తా/గద్వాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళన కేసులో రిమాండ్‌లో ఉన్న పెద్ద ధన్వాడ రైతులను పోలీసులు బుధవారం బేడీలతో కోర్టుకు తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు ముగ్గురు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ కంపెనీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ 12 గ్రామాల ప్రజలు ఆందోళనబాట పట్టిన విషయం తెలిసిందే. కంపెనీ యజమానులు ఈ నెల 3న రాత్రి సిబ్బందిని, యంత్రాలను పెద్దధన్వాడకు తరలించారు. ఇదేమని ప్రశ్నించిన సమీప గ్రామ రైతులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీనితో ఆగ్రహించిన రైతులు కంపెనీ యంత్రాలు, తాత్కాలిక గుడిసెను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 40 మందిపై కేసులు నమోదు చేశారు. అందులో 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 14 రోజుల రిమాండ్ ముగియడంతో వారిని బుధవారం అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టుకు మినీ వ్యానులో తీసుకొచ్చారు. ఇద్దరు, ముగ్గురు చొప్పున కలిపి బేడీలు వేసి వారిని కోర్టులోకి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఇలా సంకెళ్లు వేయడం రైతాంగాన్ని అవమానించడమేనని ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు ఎం.జయరామిరెడ్డి మండిపడ్డారు. కాగా కోర్టు ఈ 12 మంది రైతులకు బెయిల్ మంజూరు చేయడంతో బుధవారం సాయంత్రం విడుదలయ్యారు.

ముగ్గురు పోలీసులపై వేటు..

రైతులకు బేడీలు వేసిన ఘటనకు సంబంధించి ముగ్గురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గద్వాల జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడించారు. "జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోలి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కేసులోని కొందరు వ్యక్తులను పోలీసు అధికారులు మహబూబ్‌నగర్ జైలు నుంచి అలంపూర్ కోర్టుకు తీసుకువచ్చే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా, విధుల పట్ల అజాగ్రత్తగా వ్యవహరించిన ఆర్ఎస్సై చంద్రకాంత్, ఏఆర్ఎస్సై ఆంజనేయులు, సురేశ్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశాం" అని తెలిపారు.

అన్నదాతలకు సంకెళ్లు అమానుషం: కేటీఆర్, హరీశ్‌రావు

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ పోరాడుతున్న అన్నదాతలకు సంకెళ్లు వేయడం అమానుషమని, ఇది సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసత్వానికి పరాకాష్ట అని కేటీఆర్ ఆరోపించారు. మొన్న లగచర్లలో ఇప్పుడు పెద్దధన్వాడలో రైతుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని బుధవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక రేవంత్‌రెడ్డి పాలనలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా, అన్నదాతలపై ఉక్కుపాదం మోపుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.





నరుకుతాం.. చంపుతాం!

వైసీపీ కార్యకర్తల 'నరుకుడు' భాష!.. జగన్ పర్యటనల్లో ఫ్లెక్సీలతో బెదిరింపులు

- పొదిలిలో తొక్కి పడేస్తామని హుంకరింపు
- సత్తెనపల్లిలో 'రప్పా రప్పా' డైలాగులు
- రాజారెడ్డి రాజ్యాంగం తెస్తామని ప్రకటనలు
- ముదురుతున్న వైసీపీ క్షుద్ర రాజకీయం
- రౌడీలకు పరామర్శల పేరిట అరాచకం
- బెట్టింగ్‌లు పెట్టి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తికి విగ్రహం
- రెంటపాళ్ల పర్యటనలో ఇద్దరు మృతి

అమరావతి/ సత్తెనపల్లి/ నర్సరావుపేట/ గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఆ పార్టీ నేతలది అరాచక బాటే.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలుస్తుందంటూ ఏడాది క్రితం బెట్టింగ్‌లు కట్టి డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి విగ్రహ ఆవిష్కరణకు బుధవారం పల్నాడు జిల్లా తెనాలిలోని రెంటపాళ్లకు వెళ్లినా.. వికృత రూప ప్రదర్శనే.. ప్రస్తుతం విపక్ష హోదా కూడా లేని పరిస్థితుల్లోనూ 'మళ్లీ అధికారంలోకి వచ్చాక... చంపేస్తాం, నరికేస్తాం' అని బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. 'ఎవడైనా రానీ.. తొక్కి పడేస్తాం! 2029లో వైఎస్సార్‌సీపీ రాగానే.. గంగమ్మ తల్లి జాతరలో వేట తలలు నరికినట్టు.. రప్పా రప్పా నరుకుతాం నా కొడకల్లారా! వైఎస్ రాజారెడ్డి రాజ్యాంగం.. పల్నాడు నుంచి మొదలు, అన్న వస్తాడు.. అంతు చూస్తాడు!' అంటూ తెనాలి, పొదిలి, సత్తెనపల్లిల్లో జగన్ పర్యటనల్లో వైసీపీ కార్యకర్తలు ప్లకార్డులు, ఫ్లెక్సీలు ప్రదర్శించారు. రెంటపాళ్ల ప్రాంతం సున్నితమైందని, ఇరుకైన వీధులు.. కనుక వంద మందికే పర్యటన పరిమితం చేసుకోవాలని పోలీసులు సూచించినా బుధవారం పట్టించుకోకుండా జగన్ 'అంతా నా ఇష్టం' అనేలా వ్యవహరించారు. అనుమతులతో తనకు పనిలేదని, ఆంక్షలు తనను అడ్డుకోలేవని మందీ మార్బలంతో విచ్చలవిడిగా చెలరేగుతున్న జగన్ హడావిడికి బుధవారం 2 నిండు ప్రాణాలు బలయ్యాయి.



జయవర్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

ఇద్దరి ప్రాణాలు బలి తీసుకున్న జగన్ పర్యటన

పల్నాడు జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటన ఇద్దరి ప్రాణాలు బలితీసుకోవడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. సత్తెనపల్లిలో నృత్యం చేస్తూ కుప్ప కూలిన అదే పట్టణ వైసీపీ కార్యకర్త పి.జయవర్ధన్ రెడ్డి రోడ్డుపై కుప్పకూలాడు. స్థానికులు అతడ్ని ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించాడని వైద్యులు స్పష్టం చేశారు. జయవర్ధన్ రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు 174 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఏటుకూరు సమీప లాల్‌పురం జాతీయ రహదారి వద్ద.. జగన్‌పై పూలు చల్లేందుకొచ్చిన చీలి సింగయ్య (53).. వైసీపీ అధినేత కాన్వాయ్ వాహనం ఢీ కొట్టడంతో కింద పడ్డాడు. అతడి భుజం మీదుగా కారు చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డ సింగయ్యను ఆస్పత్రికి తరలించే వారే కరువయ్యారు. హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ రాజశేఖర్ అక్కడికి చేరుకుని సింగయ్యను జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మరణించాడని వైద్యులు నిర్ధారించారు.



రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తామని ప్లకార్డులు

హెచ్చరికలు బేఖాతరు చేసినందుకే.: ఎస్పీ

జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని వైసీపీ కార్యకర్త సింగయ్య మృతి చెందడానికి పోలీసుల హెచ్చరికలు, ఆదేశాలను బేఖాతరు చేయడమే కారణమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. జగన్ రెంటపాళ్ల పర్యటనలో ఆయన కాన్వాయ్‌లోని 11 వాహనాలతో పాటు అదనంగా మరో 3 వాహనాలకు మాత్రమే అనుమతించినట్లు తెలిపారు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా తాడేపల్లి నుంచే 35కి పైగా వాహనాలతో రెంటపాళ్లకు కాన్వాయ్ బయలుదేరిందన్నారు. మధ్యలో మరికొన్ని వాహనాలు జత కలిశాయని సతీశ్ కుమార్ తెలిపారు. వంద మందికి మించి సమీకరించొద్దని పోలీసులు జారీ చేసిన ఆదేశాలను బేఖాతరు చేశారని చెప్పారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం!

- 'ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమ్మిగ్రేషన్' డైరెక్టర్‌ను అదుపులోకి తీసుకున్న సీఐడీ
- ఇప్పటికే ఐదుగురి అరెస్టు..

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వ్యవహారంలో ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ డైరెక్టర్ సరోజా శిష్యంత్‌ను తాజాగా అరెస్టు చేసినట్లు సీఐడీ అదనపు డీజీ షికా గోయల్ చెప్పారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో 'అబ్రాడ్ స్టడీ ప్లాన్ కన్సల్టెన్సీ' నిర్వహిస్తున్న గంటా అనిల్‌కుమార్ అతని సోదరుడు సునీల్ కుమార్.. మిత్రులతో కలిసి మరో చోట ఈగల్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారన్నారు. వీరంతా కలిసి నిరుద్యోగులకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5 లక్షల నుంచి 8 లక్షల వరకు వసూలు చేసి.. అక్కడ ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని ఆమె వివరించారు. వీరి ద్వారా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని మాల్టా దేశం వెళ్లి మోసపోయిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామన్నారు. ఈ ముఠా హైదరాబాద్‌తో పాటు విజయవాడ, ఢిల్లీలోనూ ఆఫీసులు తెరిచి మోసాలకు పాల్పడ్డారని తెలిపారు.

నల్సార్ వర్సిటీతో సైబర్ సెక్యూరిటీ ఒప్పందం

హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు సైబర్ నేరాల్లో దర్యాప్తునకు సంబంధించి నల్సార్ అధ్యాపకుల సాయాన్ని తీసుకోవడమే కాకుండా నూతన సైబర్ చట్టాలు, ఫోరెన్సిక్ పరిశోధనల గురించి సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తామని షికా గోయల్ వెల్లడించారు.

దేవాదాయ శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో అన్యాయం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

దేవాదాయ శాఖలో దళిత(ఎస్సీ), గిరిజన(ఎస్టీ) ఉద్యోగుల నియామకం, పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కింది స్థాయిలో నియమితులైన వారికి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. వివిధ కేటగిరీల్లో నేరుగా నియమితులైన ఎస్సీ, ఎస్టీ అధికారులకు ఉద్దేశపూర్వకంగా పదోన్నతులు కల్పించకుండా అడ్డుకోవడమే కాకుండా కనీసం అడ్‌హాక్ పదోన్నతులు కూడా ఇవ్వడం లేదని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నత వర్గాలకు చెందిన వారికి ఇష్టానుసారంగా అడ్‌హాక్ పదోన్నతులు ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీనియార్టీ, పదోన్నతుల్ని సమీక్షించాలని హైకోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పరిస్థితిలో మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖలో రిజర్వేషన్ల అమల్లో జరుగుతున్న అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చిత్రమిది



అనంతిక సునీల్‌కుమార్ లీడ్‌రోల్ పోషించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా విజువల్‌గా చాలా బాగుంది. ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చిత్రమిది. ఒక అమ్మాయి జీవిత ప్రయాణమే '8 వసంతాలు' సినిమాగా మీ ముందుకొస్తోంది. తప్పకుండా మీకు నచ్చుతుంది' అన్నారు. 'ఇది చాలా డిఫరెంట్ మూవీ. కథ బాగా నచ్చి మేము చేసిన ఈ ప్రయత్నం మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని నవీన్ యెర్నేని అన్నారు. ఫణీంద్ర నర్సెట్టి మాట్లాడుతూ 'మా నిర్మాతలు ఒక మంచి కథతో వస్తే సినిమా తీస్తారు అనే దానికి మా '8 వసంతాలు' చిత్రం ఓ నిదర్శనం. ఈ సినిమాతో ఒక మంచి చిత్రాన్ని నిర్మించారనే పేరు వారికి వస్తుంది. అనంతిక నటన ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని అన్నారు. అనంతిక మాట్లాడుతూ 'మైత్రీ లాంటి పెద్ద నిర్మాణ సంస్థలో సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. ఫణీంద్ర గారి వల్ల ఈ సినిమాలో ఒక బలమైన పాత్రను చేశాను. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం' అన్నారు.

వచ్చే నెలలో కెన్యాకు



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'ఎస్ఎస్ఎంబీ 29' వర్కింగ్ టైటిల్. ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ కెన్యాలో ప్రారంభమవుతున్నట్లు తెలిసింది. వచ్చే నెలాఖరు నుంచి 15 రోజుల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుతో పాటు ప్రియాంక కూడా పాల్గొంటారని సమాచారం. అడవి నేపథ్యంలో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తారట. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా మొదటి భాగాన్ని 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


కాంతారావు తనయుడికి ఆర్థిక సాయం



ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుకల్లో ఆయన రఘుపతి వెంకయ్యనాయుడు అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డుతో పాటు ప్రభుత్వం అందించిన నగదులో అధిక శాతం సామాజిక సేవకే ఖర్చుచేస్తానని ఆయన తెలిపారు. అలనాటి మేటి నటుడు కాంతారావు కుమారుడు రాజా ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇంటి అద్దెకు కూడా కష్టంగా ఉందన్న విషయం తెలుసుకున్న యండమూరి రాజాను ఇంటికి పిలిచి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు.

ఇంతకంటే నేను కోరుకునేదేమి లేదు

శేఖర్ కమ్ముల



'దర్శకుడిగా నా 25 ఏళ్ల ప్రయాణాన్ని తరచి చూసుకున్నప్పుడు ఉద్వేగానికి లోనయ్యా. ఒక చిన్న ఇంట్లో తొలి సినిమా తీసిన నేను ఇప్పుడు 'కుబేర' లాంటి పెద్ద సినిమా తీయగలిగాను. ప్రేక్షకులు నాకు చాలా ప్రేమని ఇచ్చారు. వారు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నాకు చాలా ఆనందాన్నిచ్చే విషయం. నా సినిమాలను ఆదరించిన ప్రేక్షకులు దర్శకుడిగా నాకంటూ ఒక స్థాయిని ఇచ్చారు. ఈ జీవితంలో ఇంతకంటే నేను కోరుకునేదేం లేదు' అని శేఖర్ కమ్ముల అన్నారు. ధనుష్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మీడియాతో ముచ్చటించారు.

- బిలియనీర్ వర్సెస్ బెగ్గర్... అనే లైన్ ఆసక్తికరంగా అనిపించి కథగా మలిచాను. ధనవంతులు, పేదల మధ్య జరిగే కథ ఇది. రెండు ప్రపంచాల మధ్య సంఘర్షణలా ఉంటుంది. కథను సిద్ధం చేసే క్రమంలో అదొక ఎమోషనల్ థ్రిల్లర్‌గా రూపొందింది. జీవితంలో ఇక తనకు ఏమీ వద్దు అనుకునే బిచ్చగాడు, ప్రపంచంలో అన్నీ తన సొంతం కావాలని కోరుకునే బిలియనీర్ మధ్య పోరాటం ఆసక్తికరంగా ఉంటుంది.
- నా కెరీర్‌లో అగ్రనటులతో, భారీ బడ్జెట్‌తో తీసిన చిత్రం ఇదే. నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు సహకారం వల్లే ఇది సాధ్యమైంది. సినిమాకోసం ఏదడిగినా కాదనకుండా సమకూర్చారు. ఈ చిత్రంలో కథానాయకుడి పాత్రను ధనుష్ తప్ప వేరెవ్వరూ చేయలేరు. అంత అద్భుతంగా నటించారు. ఎంత కష్టమైన షాట్ అయినా ఆయన సింగిల్ టేక్‌లో చేస్తారు. ఈ కథలో నాగార్జున బలమైన పాత్ర చేశారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. రష్మిక పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది. ఆమె పాత్ర ప్రభావం బలంగా ఉంటుంది.
- ఈ మధ్యకాలంలో విభిన్న కథాంశాలతో చిత్రాలు వస్తున్నాయి. కానీ ఇలాంటి ఒక గొప్ప కథను నేను చెప్పినందుకు ఆనందంగా ఉంది. ఇది తప్పకుండా చెప్పాల్సిన కథ. సమాజంలో చైతన్యాన్ని తీసుకొస్తుంది. కథా నేపథ్యం వల్లే ఇది పాన్ ఇండియా చిత్రం అయింది తప్ప మేం కావాలని చేసింది కాదు. దేశం మొత్తం రిలేట్ అయ్యే కథ ఇది. తెలుగు, తమిళ భాషల్లో చిత్రీకరణ జరపడం వల్ల కొంచెం ఎక్కువ సమయం పట్టింది.
- సున్నితమైన భావోద్వేగాలు, సామాజికపరమైన అంశాలతో సినిమాలు చేస్తాడంటూ నాకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ అయింది. అయితే నాకంటూ ఒక మార్క్ ఉండాలని నేనెప్పుడూ సినిమాలు చేయలేదు. ఏ సినిమా చేసినా కథకు అవసరమైనది మాత్రమే చేశాను.

ఇచ్చిన ఫైళ్లు సరిపోతాయి.. ఇక వద్దు!

» కాళేశ్వరం పత్రాలపై సర్కారుకు పీసీ ఘోష్ కమిషన్ లేఖ

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల విచారణతో ముడిపడిన పత్రాలన్నీ తమకు చేరాయని.. మిగతా ఫైళ్లు అక్కర్లేదని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రభుత్వానికి తెలిపింది. ఈ మేరకు బుధవారం నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించిన నిర్ణయాలు మంత్రివర్గ ఆమోదంతోనే తీసుకున్నట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదముందా..? ఒకవేళ ఉంటే ఆ పత్రాలు ఇవ్వాలని కమిషన్ ఈనెల 13న ప్రభుత్వానికి లేఖ రాయగా.. అదే రోజు అధికారులంతా వెళ్లి కమిషన్‌కు పత్రాలు సమర్పించారు. 2014-2023 మధ్యకాలంలో 96 మంత్రివర్గ సమావేశాలు జరగ్గా... ఎందులోనూ ప్రాజెక్టులరీ ఇంజనీరింగ్‌కు కానీ, కాళేశ్వరం పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అనుమతులు ఇవ్వలేదని తేలింది. అయితే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సవరణ అంచనాలకు మాత్రమే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారని గుర్తించారు. ఈ క్రమంలోనే జస్టిస్ పీసీ ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదికకు తుది రూపు ఇచ్చే పనిలో పడ్డారు. ఈ నెలాఖరున లేదా జూలై మొదటి వారంలో కమిషన్ ప్రభుత్వానికి కమిషన్ నివేదికను సమర్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల జేఏసీ ప్రతినిధులు

ఈ నెలాఖరులోపు బకాయిలు చెల్లించాల్సిందే

» ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వానికి కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తి

» వృత్తివిద్యా కళాశాలల సంఘాలన్నీ.. జేఏసీగా ఆవిర్భావం

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రకటించిన విధంగా ఈనెల 30వ తేదీలోగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మా, న్యాయ, మేనేజ్మెంట్ కళాశాలల ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌పై చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న ఉన్నత విద్యాసంస్థల సంఘాలన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చి సంయుక్త కార్యాచరణ సంఘం (జేఏసీ)గా ఏర్పడ్డాయి. దీనికి అధ్యక్షుడిగా అరోరా విద్యాసంస్థల ఛైర్మన్ నిమ్మటూరి రమేశ్‌బాబు ఎన్నికయ్యారు. వివిధ విద్యాసంస్థల ఛైర్మన్లతో కలిపి మొత్తం 30 మందితో సభ్యులతో పాలకవర్గం ఏర్పడింది. బుధవారం జరిగిన జేఏసీ తొలి సమావేశంలో అనేక తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2023-24 విద్యా సంవత్సరం వరకున్న బకాయిలను వచ్చే మూడు నెలల్లో, 2024-25 బకాయిలను ఈ ఏడాది చివరిలోగా విడుదల చేయాలని సమావేశంలో తీర్మానించారు. 2025-26 నుంచి ప్రతి ఏటా నాలుగు విడతలుగా క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. బకాయిలు భారీగా ఉండటంతో విద్యాసంస్థల నిర్వహణ కష్టసాధ్యంగా మారిందని జేఏసీ ప్రతినిధులు రమేశ్ బాబు, కోటల శంకరప్ప, రవికుమార్, కొడాలి కృష్ణారావు, కాటం సునీల్ కుమార్, తదితరులు పేర్కొన్నారు.

4 రోజులు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ముందే వచ్చినప్పటికీ, అనుకున్న స్థాయిలో వర్షాలు కురవడం లేదు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఇప్పటివరకు 79 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 48 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. 31 సెంటీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోనే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. మరో ఐదు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగిలిన అన్ని జిల్లాల్లోనూ లోటు వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలెపింగ్ ప్లానింగ్ సొసైటీ నివేదికలో వెల్లడించింది.

సెర్ప్ ద్వారా మహిళలకు డ్రైవింగ్ శిక్షణ

మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా మహిళలకు భారీ వాహనాలు, బస్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా డ్రైవర్‌గా సేవలందిస్తున్న సరితా నాయక్‌ను బుధవారం సచివాలయంలో ఆమె సత్కరించారు. భారీ వాహన ఉచిత శిక్షణకు ఆమెను రోల్ మోడల్‌గా నియమించారు. ప్రభుత్వంతో చర్చించి ఆర్టీసీలో మహిళా డ్రైవర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంవోడ బ్యూవో స్వచ్ఛంద సంస్థ సహకారంతో మహిళలకు ఉచిత బస్ డ్రైవింగ్ శిక్షణ కార్యచరణ పోస్టర్‌ను సీతక్క ఆవిష్కరించారు.

ఫారం-VI

(సెక్షన్- నియమం,19 యొక్క ఉప నియమం (1))
(మరియు సెక్షన్- 11(1) యొక్క చట్టం, 30/2013)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
ప్రాథమిక ప్రకటన

ఎఫ్/6879/2025 — తేది:09.06.2025
నెం:G/799/2025 — తేది:10.06.2025
గెజిట్ నెం:34/2025 — తేది:10.06.2025

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా జయమ్మ చెరువు నిర్మాణం కొరకు నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలం, పేరపళ్ళ గ్రామం పరిధిలో మొత్తం **ఎ.326.34** గుంటలు భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.

తెలంగాణ ప్రభుత్వం నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయే భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ, పునరావాసం మరియు పునస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టంలోని అధ్యాయం 2 మరియు 3 యొక్క దరఖాస్తు నుండి మినహాయించడానికి తేది:12.02.2025 నాడు G.O.Ms.No.3 జారీచేసింది. అందువలన ఆ చట్టంలోని 4 (1) సెక్షన్ ప్రకారం సామాజిక ప్రభావ అంచనా నిర్వహించబడలేదు. బాధిత కుటుంబాల పునరావాసం మరియు పునస్థాపన కోసం నారాయణపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిర్వాహకుడిగా నియమితులయ్యారు.

అందువలన పై తెలిపిన సదరు ప్రాజెక్టు కొరకు నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలం, పేరపళ్ళ గ్రామం యొక్క మొత్తం **ఎ.326.34 గుంటలు** విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెలిపిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూ స్వభావం	భూమి వర్గం	సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు పేరు/ అనుభవదారు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు రకం	సంఖ్య	కట్టడాలు రకం	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	57	పట్టా	తరి	1.26	గంటె నాగరత్నమ్మ భర్త చంద్రమౌళి	58	56	55	59	-	-	-	-
2	58/1	పట్టా	తరి	0.25	అంజప్ప తండ్రి చిన్న హన్మప్ప	91	59	111	91	-	-	-	-
3	58/2 అ	పట్టా	తరి	0.09	కిష్టప్ప తండ్రి చంద్రప్ప	91	59	111	91	-	-	-	-
4	58/2 ఆ	పట్టా	తరి	0.09	కిష్టప్ప తండ్రి చంద్రప్ప	91	59	111	91	-	-	-	-
5	58/2 ఇ	పట్టా	తరి	0.08	బ్రహ్మమ్మ తండ్రి చంద్రప్ప	91	59	111	91	-	-	-	-
6	59/అ/2	పట్టా	తరి	0.15	దాసరి బాల్‌రాజ్ తండ్రి దాసరి కిష్టప్ప	58	60	57	91	-	-	-	-
7	59/అ/1	పట్టా	తరి	0.14	దాసరి లక్ష్మణ్ తండ్రి దాసరి కిష్టప్ప	58	60	57	91	-	-	-	-
8	59	పట్టా	తరి	0.02	Person Not identified	58	60	57	91	-	-	-	-
9	61/ఇ/1	పట్టా	మెట్ట	0.07	కానగర్ల పెద్దసాయిబన్న తండ్రి నర్సప్ప	91	63	60	72	-	-	-	-
10	61/ఇ/అ	పట్టా	మెట్ట	0.08	వెంకటప్ప తండ్రి లాలప్ప	91	63	60	72	-	-	-	-
11	61/అ	పట్టా	మెట్ట	0.32	కానగర్ల బాలప్ప తండ్రి కిష్టప్ప	91	63	60	72	-	-	-	-
12	61/ఇ/1	పట్టా	మెట్ట	0.08	కానగర్ల బస్సప్ప తండ్రి శివప్ప	91	63	60	72	-	-	-	-
13	61/ఇ	పట్టా	మెట్ట	0.08	కానగర్ల నర్సిములు తండ్రి నర్సప్ప	91	63	60	72	-	-	-	-
14	61/ఈ	పట్టా	మెట్ట	0.16	పార్వతమ్మ భర్త నర్సిములు	91	63	60	72	-	-	-	-
15	61/ఆ	పట్టా	మెట్ట	0.32	కానగర్ల మణెమ్మ భర్త బసప్ప	91	63	60	72	-	-	-	-
16	61/అ/అ1	పట్టా	మెట్ట	0.08	కానగర్ల భీమప్ప తండ్రి సాయిబన్న	91	63	60	72	-	-	-	-
17	61/క/క2/1	పట్టా	మెట్ట	0.04	కానగర్ల జనలింగప్ప తండ్రి గోపాల్	91	63	60	72	-	-	-	-
18	61/క/క2/2	పట్టా	మెట్ట	0.04	కానగర్ల బాల్‌రాజ్ తండ్రి గోపాల్	91	63	60	72	-	-	-	-
19	62/అ	పట్టా	తరి	0.14	కానగర్ల బాలప్ప తండ్రి కిష్టప్ప	61	63	63	72	-	-	-	-
20	62/ఈ	పట్టా	తరి		కానగర్ల బసప్ప తండ్రి శివప్ప	61	63	63	72	-	-	-	-
21	62/ఆ	పట్టా	తరి		పార్వతమ్మ భర్త నర్సింములు	61	63	63	72	-	-	-	-
22	62/ఇ	పట్టా	తరి		కానగర్ల మణెమ్మ భర్త బసప్ప	61	63	63	72	-	-	-	-
23	62/అ/అ	పట్టా	తరి		కానగర్ల భీమప్ప తండ్రి సాయిబన్న	61	63	63	72	-	-	-	-
24	62/క 1/1	పట్టా	తరి		కానగర్ల జనలింగప్ప తండ్రి గోపాల్	61	63	63	72	-	-	-	-
25	62/క 1/2	పట్టా	తరి		కానగర్ల బాల్‌రాజ్ తండ్రి గోపాల్	61	63	63	72	-	-	-	-
26	72	పట్టా	మెట్ట	14.37	బాజా సైముల్లా తండ్రి బాజా అబ్దుల్లా[illegible]	91	90	62	75	[illegible]	268, 4, 10, 14, 20, 15, 14, 3, 1, 1, 2	[illegible]	-
27	73/అ	పట్టా	మెట్ట	0.29	రాంగోపాల్ తండ్రి బాలప్ప మిద్దెమిది	91	74	91	91	[illegible]	10, 4, 1	[illegible]	-
28	73/ఆ/అ	పట్టా	మెట్ట	0.15	భీమప్ప తండ్రి నాగప్ప	91	74	91	91	-	-	-	-
29	73/అ/అ/1	పట్టా	మెట్ట	0.15	మిద్దెమీది హన్మంతు తండ్రి ఆశన్న	91	74	91	91	[illegible]	4, 3	-	-
30	73/అ/1	పట్టా	మెట్ట	0.14	మిద్దెమీది రాములు తండ్రి ఆశప్ప	91	74	91	91	-	-	-	-
31	73/ఈ/అ	పట్టా	మెట్ట	0.11	సాయిబన్న మిద్దెమీది తండ్రి తిమ్మన్న	91	74	91	91	[illegible]	5, 7, 2	-	-
32	73/ఉ	పట్టా	మెట్ట	1.04	మిద్దెమీది బాల్‌రాజ్ తండ్రి మిద్దెమీది చిన్న మొగలప్ప	91	74	91	91	[illegible]	4, 2	-	-
33	73/ఇ/అ	పట్టా	మెట్ట	1.03	మిద్దెమీది బాల్‌రాజ్ తండ్రి మిద్దెమీది చిన్న మొగలప్ప	91	74	91	91	-	-	-	-
34	73	పట్టా	మెట్ట	0.03	Person Not identified	91	74	91	91	-	-	-	-
35	74/ఉ	పట్టా	మెట్ట	1.38	రాంగోపాల్ తండ్రి తండ్రి బాలప్ప మిద్దెమిది	73	75	72	91	-	-	-	-
36	74/అ/అ/2	పట్టా	మెట్ట	0.30	భీమప్ప తండ్రి మిద్దెమీది ఆశన్న	73	75	72	91	-	-	-	-
37	74/ఉ/అ/2	పట్టా	మెట్ట	0.18	భీమప్ప తండ్రి మిద్దెమీది ఆశన్న	73	75	72	91	-	-	-	-
38	74/అ/క	పట్టా	మెట్ట	0.38	మిద్దెమీది అంజప్ప తండ్రి చంద్రప్ప	73	75	72	91	వేప	4	[illegible]	-
39	74/అ	పట్టా	మెట్ట	0.39	మిద్దెమీది అంజప్ప తండ్రి చంద్రప్ప	73	75	72	91	-	-	-	-
40	74/ఊ/అ/4	పట్టా	మెట్ట	0.04	మిద్దెమీది హన్మంతు తండ్రి ఆశన్న	73	75	72	91	-	-	-	-
41	74/ఊ/అ/2	పట్టా	మెట్ట	0.30	మిద్దెమీది హన్మంతు తండ్రి ఆశన్న	73	75	72	91	-	-	-	-
42	74/క/అ/1	పట్టా	మెట్ట	0.09	మిద్దెమీది రాములు తండ్రి ఆశప్ప	73	75	72	91	-	-	-	-
43	74/ఊ/అ/3	పట్టా	మెట్ట	0.18	మిద్దెమీది రాములు తండ్రి ఆశప్ప	73	75	72	91	-	-	-	-
44	74/ఉ/అ/1	పట్టా	మెట్ట	0.09	మిద్దెమీది రాములు తండ్రి ఆశప్ప	73	75	72	91	-	-	-	-
45	74/ఊ/ఊ	పట్టా	మెట్ట	2.00	సాయిబన్న మిద్దెమీది తండ్రి తిమ్మన్న	73	75	72	91	-	-	-	-
46	74/ఊ/ఎ/1	పట్టా	మెట్ట	1.19	మిద్దెమీది కిష్టప్ప తండ్రి నర్సప్ప	73	75	72	91	[illegible]	1, 1, 2	[illegible]	-
47	74/ఊ/ఎ/2	పట్టా	మెట్ట	1.18	మిద్దెమీది ఆనంద్ తండ్రి వెంకటప్ప	73	75	72	91	-	-	-	-
48	75	పట్టా	మెట్ట	2.25	మొగులమ్మ భర్త భర్త సాయన్న	74	18	72	76	[illegible]	3, 1	[illegible]	-
49	76/2/అ/అ	పట్టా	మెట్ట	0.11	సాయన్న తండ్రి నర్సిములు	74	18	72	76	-	-	-	-
50	76/2/అ/క1/1	పట్టా	మెట్ట	0.05	కోనంగేరి ఉదయ్‌కిరణ్ తండ్రి హన్మంతు	74	18	72	76	-	-	-	-
51	76/2/అ/క1/2	పట్టా	మెట్ట	0.05	కోనంగేరి రాంచరణ్ తేజ తండ్రి హన్మంతు	74	18	72	76	-	-	-	-
52	76/3/అ	పట్టా	మెట్ట	0.32	పాపన్న తండ్రి ఊశన్న కేసంగిరి	74	18	72	76	-	-	-	-
53	76/1/అ	పట్టా	మెట్ట	0.13	యాదప్ప తండ్రి కిష్టప్ప	74	18	72	76	-	-	-	-
54	76/1/ఆ	పట్టా	మెట్ట	0.13	బసప్ప తండ్రి కిష్టప్ప	74	18	72	76	-	-	-	-
55	76/1/ఇ	పట్టా	మెట్ట	0.13	కోనంగేరి బాలప్ప తండ్రి కిష్టప్ప	74	18	72	76	-	-	-	-
56	76/2/అ1	పట్టా	మెట్ట	0.03	కిష్టప్ప తండ్రి సాయన్న	74	18	72	76	-	-	-	-
57	76/2/అ/1	పట్టా	మెట్ట	0.08	కోనంగేరి మదురమ్మ భర్త బస్వరాజ్	74	18	72	76	-	-	-	-
58	76/1/ఈ	పట్టా	మెట్ట	0.13	వెంకటప్ప తండ్రి కిష్టప్ప	74	18	72	76	-	-	-	-
59	76/1	పట్టా	మెట్ట	0.13	కోనంగేరి నర్సిములు తండ్రి కిష్టప్ప	74	18	72	76	-	-	-	-
60	76/3/అ5	పట్టా	మెట్ట	0.06	కోనంగేరి అంజనేయులు తండ్రి గోపాల్	74	18	72	76	-	-	-	-
61	76/3/అ4	పట్టా	మెట్ట	0.05	రాములు తండ్రి గోపాల్	74	18	72	76	-	-	-	-
62	76/3/అ3	పట్టా	మెట్ట	0.05	అనూరాధ కోనంగేరి భర్త నాగేష్	74	18	72	76	-	-	-	-
63	76/3/అ6	పట్టా	మెట్ట	0.06	యాదప్ప తండ్రి గోపాల్	74	18	72	76	-	-	-	-
64	76/3/అ1	పట్టా	మెట్ట	0.04	బాలప్ప తండ్రి గోపాల్	74	18	72	76	-	-	-	-
65	76/3/అ2	పట్టా	మెట్ట	0.05	భాస్కర్ కోనంగేరి తండ్రి గోపాల్	74	18	72	76	-	-	-	-
66	76/2/క/1/2	పట్టా	మెట్ట	0.01	బైకెడ్ సాయమ్మ భర్త బైకెడ్ చిన్న కిష్టప్ప	74	18	72	76	-	-	-	-
67	76/2/అ/2	పట్టా	మెట్ట	0.01	బైకెడ్ అమృతమ్మ భర్త శివప్ప	74	18	72	76	-	-	-	-
68	76/2/అ/2	పట్టా	మెట్ట	0.07	బైకెడ్ అమృతమ్మ భర్త శివప్ప	74	18	72	76	-	-	-	-
69	76/2/క/1/1	పట్టా	మెట్ట	0.15	కె.అనంతమ్మ భర్త కె.బసప్ప	74	18	72	76	-	-	-	-
70	76/2/అ/అ	పట్టా	మెట్ట	0.10	కోనంగేరి శివకుమార్ తండ్రి బాలప్ప	74	18	72	76	-	-	-	-
71	77/1/అ1	పట్టా	మెట్ట	0.04	సాయన్న తండ్రి నర్సిములు	78	76	74	78	-	-	-	-
72	77/1/అ2/1	పట్టా	మెట్ట	0.02	కోనంగేరి ఉదయ్ కిరణ్ తండ్రి హన్మంతు	78	76	74	78	-	-	-	-
73	77/1/అ2/2	పట్టా	మెట్ట	0.02	కోనంగేరి రాంచరణ్ తేజ తండ్రి హన్మంతు	78	76	74	78	-	-	-	-
74	77/2/అ/1	పట్టా	మెట్ట	0.12	పాపన్న తండ్రి ఊశన్న కోనంగేరి	78	76	74	78	-	-	-	-
75	77/1/అ	పట్టా	మెట్ట	0.02	యాదప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
76	77/3/అ	పట్టా	మెట్ట	0.04	యాదప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
77	77/2/అ	పట్టా	మెట్ట	0.02	యాదప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
78	77/2/ఈ	పట్టా	మెట్ట	0.02	బసప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
79	77/1/ఇ	పట్టా	మెట్ట	0.02	బసప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
80	77/3/అ	పట్టా	మెట్ట	0.04	బసప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
81	77/2/ఈ1	పట్టా	మెట్ట	0.03	కోనంగేరి బాలప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
82	77/1/ఈ	పట్టా	మెట్ట	0.02	కోనంగేరి బాలప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
83	77/3/ఇ	పట్టా	మెట్ట	0.05	కోనంగేరి బాలప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
84	77/2/ఈ	పట్టా	మెట్ట	0.02	వెంకటప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
85	77/3/ఈ	పట్టా	మెట్ట	0.05	వెంకటప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
86	77/1/ఉ	పట్టా	మెట్ట	0.03	వెంకటప్ప తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
87	77/3	పట్టా	మెట్ట	0.04	కోనంగేరి నర్సిములు తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
88	77/1అ	పట్టా	మెట్ట	0.02	కోనంగేరి నర్సిములు తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
89	77/2/అ	పట్టా	మెట్ట	0.02	కోనంగేరి నర్సిములు తండ్రి కిష్టప్ప	78	76	74	78	-	-	-	-
90	77/1/అ/అ	పట్టా	మెట్ట	0.04	కోనంగేరి కిష్టమ్మ భర్త కోనంగేరి బాలప్ప	78	76	74	78	-	-	-	-
91	78/1/అ/3	పట్టా	మెట్ట	7.19	సాయన్న తండ్రి నర్సిములు	91	87	77	80	-	-	-	-
92	78/1/అ/2/1	పట్టా	మెట్ట		కోనంగేరి ఉదయ్‌కిరణ్ తండ్రి హన్మంతు	91	87	77	80	-	-	-	-
93	78/1/అ/2/2	పట్టా	మెట్ట		కోనంగేరి రాంచరణ్ తేజ తండ్రి హన్మంతు	91	87	77	80	[illegible]	1	-	-
94	78/2/అ	పట్టా	మెట్ట		పాపన్న తండ్రి ఊశన్న కేసంగిరి	91	87	77	80	-	-	-	-
95	78/3/అ	పట్టా	మెట్ట		యాదప్ప తండ్రి కిష్టప్ప	91	87	77	80	-	-	-	-
96	78/3/ఆ	పట్టా	మెట్ట		బసప్ప తండ్రి కిష్టప్ప	91	87	77	80	-	-	-	-
97	78/3/ఇ	పట్టా	మెట్ట		కోనంగేరి బాలప్ప తండ్రి కిష్టప్ప	91	87	77	80	వేప	2	[illegible]	-
98	78/3/ఈ	పట్టా	మెట్ట		వెంకటప్ప తండ్రి కిష్టప్ప	91	87	77	80	-	-	-	-
99	78/3	పట్టా	మెట్ట		కోనంగేరి నర్సిములు తండ్రి కిష్టప్ప	91	87	77	80	-	-	-	-
100	78/2/అ5	పట్టా	మెట్ట		కోనంగేరి అంజనేయులు తండ్రి గోపాల్	91	87	77	80	-	-	-	-
101	78/2/అ4	పట్టా	మెట్ట		రాములు తండ్రి గోపాల్	91	87	77	80	-	-	-	-
102	78/2/అ3	పట్టా	మెట్ట		అనూరాధ కోనంగేరి భర్త నాగేష్	91	87	77	80	-	-	-	-
103	78/2/అ6	పట్టా	మెట్ట		యాదప్ప తండ్రి గోపాల్	91	87	77	80	-	-	-	-
104	78/2/అ1	పట్టా	మెట్ట		బాలప్ప తండ్రి గోపాల్	91	87	77	80	[illegible]	3, 1, 4	-	-
105	78/2/అ2	పట్టా	మెట్ట		భాస్కర్ కోనంగేరి తండ్రి గోపాల్	91	87	77	80	-	-	-	-
106	78/1/అ/అ	పట్టా	మెట్ట		కోనంగేరి కిష్టమ్మ భర్త కోనంగేరి బాలప్ప	91	87	77	80	[illegible]	4, 4	-	-
107	78/1/అ	పట్టా	మెట్ట		బైకెడ్ అమృతమ్మ భర్త శివప్ప	91	87	77	80	-	-	-	-
108	78/1/అ/1	పట్టా	మెట్ట		కె.అనంతమ్మ భర్త కె.బసప్ప	91	87	77	80	-	-	-	-
109	78/1/అ	పట్టా	మెట్ట		కిష్టప్ప తండ్రి సాయన్న	91	87	77	80	-	-	-	-
110	79	పట్టా	మెట్ట	2.07	దాసరి అయ్యప్ప తండ్రి యంకప్ప	78	87	87	81	[illegible]	2, 1	[illegible] (3)	-
111	79/1	పట్టా	మెట్ట	2.06	దాసరి అమృతమ్మ భర్త [illegible]	78	87	87	81	[illegible]	1, 1	[illegible]	-
112	80/1/అ	పట్టా	మెట్ట	0.25	సాయన్న తండ్రి నర్సిములు	91	81	78	83	-	-	-	-
113	80/1/అ/1	పట్టా	మెట్ట	0.12	కోనంగేరి ఉదయ్‌కిరణ్ తండ్రి హన్మంతు	91	81	78	83	-	-	-	-
114	80/1/అ/2	పట్టా	మెట్ట	0.13	కోనంగేరి రాంచరణ్ తేజ తండ్రి హన్మంతు	91	81	78	83	-	-	-	-
115	80/2/అ	పట్టా	మెట్ట	1.37	పాపన్న తండ్రి ఊశన్న కేసంగిరి	91	81	78	83	-	-	-	-
116	80/3/అ	పట్టా	మెట్ట	0.81	యాదప్ప తండ్రి కిష్టప్ప	91	81	78	83	-	-	-	-
117	80/3/ఆ	పట్టా	మెట్ట	0.81	బసప్ప తండ్రి కిష్టప్ప	91	81	78	83	-	-	-	-
118	80/3/ఇ	పట్టా	మెట్ట	0.80	కోనంగేరి బాలప్ప తండ్రి కిష్టప్ప	91	81	78	83	-	-	-	-
119	80/3/ఈ	పట్టా	మెట్ట	0.80	వెంకటప్ప తండ్రి కిష్టప్ప	91	81	78	83	-	-	-	-
120	80/3	పట్టా	మెట్ట	0.81	కోనంగేరి నర్సిములు తండ్రి కిష్టప్ప	91	81	78	83	-	-	-	-
121	80/2/అ5	పట్టా	మెట్ట	0.12	కోనంగేరి అంజనేయులు తండ్రి గోపాల్	91	81	78	83	-	-	-	-
122	80/2/అ4	పట్టా	మెట్ట	0.12	రాములు తండ్రి గోపాల్	91	81	78	83	-	-	-	-
123	80/2/అ3	పట్టా	మెట్ట	0.13	అనూరాధ కోనంగేరి భర్త నాగేష్	91	81	78	83	-	-	-	-
124	80/2/అ6	పట్టా	మెట్ట	0.12	యాదప్ప తండ్రి గోపాల్	91	81	78	83	-	-	-	-
125	80/2/అ1	పట్టా	మెట్ట	0.12	బాలప్ప తండ్రి గోపాల్	91	81	78	83	-	-	-	-
126	80/2/అ2	పట్టా	మెట్ట	0.12	భాస్కర్ కోనంగేరి తండ్రి గోపాల్	91	81	78	83	-	-	-	-
127	80/1/అ/అ	పట్టా	మెట్ట	0.50	కోనంగేరి కిష్టమ్మ భర్త కోనంగేరి బాలప్ప	91	81	78	83	-	-	-	-
128	80/1/క/1	పట్టా	మెట్ట	0.55	బైకెడ్ సాయమ్మ భర్త బైకెడ్ చిన్న కిష్టప్ప	91	81	78	83	-	-	-	-
129	80/1/క/2	పట్టా	మెట్ట	0.02	బైకెడ్ అమృతమ్మ భర్త శివప్ప	91	81	78	83	-	-	-	-
130	80/1/క/అ	పట్టా	మెట్ట	1.00	కె.అనంతమ్మ భర్త కె.బసప్ప	91	81	78	83	-	-	-	-
131	88/ఈ	పట్టా	మెట్ట	1.50	కానగర్ల బస్సప్ప తండ్రి [illegible]	91	662	91	87	-	-	-	-
132	88/ఈ/2	పట్టా	మెట్ట	1.50	కానగర్ల బస్సప్ప తండ్రి [illegible]	91	662	91	87	-	-	-	-
133	88	పట్టా	మెట్ట	1.00	కానగర్ల బసప్ప తండ్రి కిష్టప్ప	91	662	91	87	-	-	-	-
134	88/ఈ1	పట్టా	మెట్ట	0.24	కానగర్ల భీమప్ప భర్త సాయిబన్న	91	662	91	87	-	-	-	-
135	88/ఇ/1	పట్టా	మెట్ట	1.07	బాలరాజు తండ్రి బసప్ప	91	662	91	87	-	-	-	-
136	88/ఇ/2	పట్టా	మెట్ట	1.07	బసంత్ తండ్రి బసప్ప	91	662	91	87	-	-	-	-
137	88/అ/2/2	పట్టా	మెట్ట	0.23	భాస్కర్ గోపాల్ కనగర్ల తండ్రి గోపాల్	91	662	91	87	-	-	-	-
138	88/అ/1	పట్టా	మెట్ట	0.24	భాస్కర్ గోపాల్ కనగర్ల తండ్రి గోపాల్	91	662	91	87	-	-	-	-
139	88/అ 2/1	పట్టా	మెట్ట	0.12	కానగర్ల జనలింగప్ప తండ్రి గోపాల్	91	662	91	87	-	-	-	-
140	88/అ 2/2	పట్టా	మెట్ట	0.12	కానగర్ల బాల్‌రాజ్ తండ్రి గోపాల్	91	662	91	87	-	-	-	-
141	88/అ 2/1	పట్టా	మెట్ట	1.07	కానగర్ల కిష్టప్ప తండ్రి శివప్ప	91	662	91	87	-	-	-	-
142	93/అ	పట్టా	మెట్ట	1.02	బోయిని నర్సప్ప తండ్రి ఊశన్న	138	94	92	105	-	-	-	-
143	94/అ	పట్టా	మెట్ట	2.00	బోయిని నర్సప్ప తండ్రి ఊశన్న	93	98	96	104	-	-	-	-
144	94/అ/2	పట్టా	మెట్ట	0.22	విశ్వనాథరాయనాయక్ తండ్రి గోవిందనాయక్	93	98	96	104	-	-	-	-
145	94/అ/1/1	పట్టా	మెట్ట	1.06	[illegible] తండ్రి గోవిందనాయక్	93	98	96	104	-	-	-	-
146	94/అ/1/2	పట్టా	మెట్ట	0.22	[illegible] తండ్రి గోవిందనాయక్	93	98	96	104	-	-	-	-
147	94	పట్టా	మెట్ట	0.05	[illegible]	93	98	96	104	-	-	-	-
148	95	పట్టా	మెట్ట	1.09	[illegible]	96	97	96	94	-	-	-	-
149	95	పట్టా	మెట్ట	0.13	Person not identified	96	97	96	94	-	-	-	-
150	96/2	పట్టా	మెట్ట	0.33	మహేష్ తండ్రి బోయిని రాములు	93	97	63	93	[illegible]	15, 1	[illegible]	-
151	96/1	పట్టా	మెట్ట	0.33	అశోక్ తండ్రి బోయిని రాములు	93	97	63	93	-	-	[illegible]	-
152	96	పట్టా	మెట్ట	0.03	Person not identified	93	97	63	93	-	-	-	-
153	97/అ	పట్టా	మెట్ట	0.07	విశ్వనాథరాయనాయక్ తండ్రి గోవిందనాయక్	96	111	67	98	-	-	-	-
154	97/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	96	111	67	98	-	-	-	-
155	97/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	96	111	67	98	-	-	-	-
156	97/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	96	111	67	98	-	-	-	-
157	97/అ	పట్టా	మెట్ట	0.07	[illegible]	96	111	67	98	-	-	-	-
158	97/అ	పట్టా	మెట్ట	0.19	[illegible]	96	111	67	98	-	-	-	-
159	97	పట్టా	మెట్ట	0.18	Person not identified	96	111	67	98	-	-	-	-
160	98/అ	పట్టా	మెట్ట	0.07	[illegible]	94	111	97	99	-	-	-	-
161	98/అ	పట్టా	మెట్ట	0.07	[illegible]	94	111	97	99	-	-	-	-
162	98/అ	పట్టా	మెట్ట	0.07	[illegible]	94	111	97	99	-	-	-	-
163	98/అ	పట్టా	మెట్ట	0.07	[illegible]	94	111	97	99	-	-	-	-
164	98/అ	పట్టా	మెట్ట	0.36	[illegible]	94	111	97	99	-	-	-	-
165	98/అ	పట్టా	మెట్ట	0.07	[illegible]	94	111	97	99	-	-	-	-
166	99/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	100	669	98	91	-	-	-	-
167	99/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	100	669	98	91	-	-	-	-
168	99/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	100	669	98	91	-	-	-	-
169	99/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	100	669	98	91	-	-	-	-
170	99/అ	పట్టా	మెట్ట	0.20	[illegible]	100	669	98	91	-	-	-	-
171	99/అ	పట్టా	మెట్ట	0.06	[illegible]	100	669	98	91	-	-	-	-
172	100/అ	పట్టా	మెట్ట	0.03	[illegible]	101	99	102	99	-	-	-	-
173	100/అ	పట్టా	మెట్ట	0.03	[illegible]	101	99	102	99	-	-	-	-
174	100/అ	పట్టా	మెట్ట	0.03	[illegible]	101	99	102	99	-	-	-	-
175	100/అ	పట్టా	మెట్ట	0.03	[illegible]	101	99	102	99	-	-	-	-
176	100/అ	పట్టా	మెట్ట	0.03	[illegible]	101	99	102	99	-	-	-	-
177	100/అ	పట్టా	మెట్ట	0.08	[illegible]	101	99	102	99	-	-	-	-
178	100/అ/1	పట్టా	మెట్ట	0.08	[illegible]	101	99	102	99	-	-	-	-
179	101	పట్టా	మెట్ట	1.27	బోయిని నర్సప్ప తండ్రి ఊశన్న	118	100	102	173	-	-	-	-
180	102	పట్టా	మెట్ట	18.07	[illegible]	111	99	104	101	-	-	-	-
181	103	పట్టా	మెట్ట	1.35	[illegible]	104	99	104	102	-	-	-	-
182	104	పట్టా	మెట్ట	1.12	[illegible]	105	99	91	102	-	-	-	-
183	105	పట్టా	మెట్ట	1.95	[illegible]	138	104	93	107	-	-	-	-
184	106	పట్టా	మెట్ట	1.13	[illegible]	107	104	105	102	-	-	-	-
185	107	పట్టా	మెట్ట	1.15	[illegible]	134	106	105	108	-	-	-	-
186	108	పట్టా	మెట్ట	2.01	[illegible]	130	111	107	109	-	-	-	-
187	109	పట్టా	మెట్ట	0.14	[illegible]	129	114	108	116	-	-	-	-
188	111/64	లావణి పట్టా	మెట్ట	1.08	[illegible]	111	111	111	111	వేప	2	-	-
189	111/13/1	లావణి పట్టా	మెట్ట	0.01	[illegible]	111	111	111	111	-	-	-	-
190	111/13/2	లావణి పట్టా	మెట్ట	0.06	[illegible]	111	111	111	111	వేప	1	-	-
191	111/2/2	లావణి పట్టా	మెట్ట	0.05	[illegible]	111	111	111	111	-	-	-	-
192	111/10	లావణి పట్టా	మెట్ట	0.20	[illegible]	111	111	111	111	-	-	-	-
193	111/22	లావణి పట్టా	మెట్ట	0.20	[illegible]	111	111	111	111	-	-	-	-
194	111/61	లావణి పట్టా	మెట్ట	1.00	[illegible]	111	111	111	111	-	-	-	-
195	111/105/అ	లావణి పట్టా	మెట్ట	0.18	[illegible]	111	111	111	111	-	-	-	-
196	111/105/ఆ	లావణి పట్టా	మెట్ట	0.16	[illegible]	111	111	111	111	-	-	-	-
197	111/107	లావణి పట్టా	మెట్ట	0.18	[illegible]	111	111	111	111	-	-	-	-
198	111/80	లావణి పట్టా	మెట్ట	0.00	[illegible]	111	111	111	111	-	-	-	-
199	111/51/అ	లావణి పట్టా	మెట్ట	0.30	[illegible]	111	111	111	111	[illegible]	1	-	-
200	111/51/ఆ	లావణి పట్టా	మెట్ట	0.30	[illegible]	111	111	111	111	-	-	-	-
201	111/51/ఇ	లావణి పట్టా	మెట్ట	0.30	[illegible]	111	111	111	111	-	-	-	-
202	111/51/ఈ	లావణి పట్టా	మెట్ట	0.30	[illegible]	111	111	111	111	-	-	-	-
203	111/60	లావణి పట్టా	మెట్ట	0.30	[illegible]	111	111	111	111	వేప	15	-	-
204	111	ప్రభుత్వ		38.38	ప్రభుత్వ భూమి	111	111	111	111	-	-	-	-
205	92/అ	లావణి పట్టా	మెట్ట	5.00	[illegible]	92	92	92	92	-	-	-	-
206	92/24/2	లావణి పట్టా	మెట్ట	1.09	[illegible]	92	92	92	92	-	-	-	-
207	92/24/1	లావణి పట్టా	మెట్ట	1.09	[illegible]	92	92	92	92	-	-	-	-
208	92/24/3	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	92	92	92	92	-	-	-	-
209	92/15	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	92	92	92	92	-	-	-	-
210	92/1/2	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	92	92	92	92	-	-	-	-
211	92/1/1	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	92	92	92	92	-	-	-	-
212	92/అ	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	92	92	92	92	-	-	-	-
213	92/అ	లావణి పట్టా	మెట్ట	1.00	[illegible]	92	92	92	92	-	-	-	-
214	92/అ	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	92	92	92	92	-	-	-	-
215	92/అ	లావణి పట్టా	మెట్ట	1.16	[illegible]	92	92	92	92	-	-	-	-
216	92/1	లావణి పట్టా	మెట్ట	2.00	[illegible]	92	92	92	92	-	-	-	-
217	92	ప్రభుత్వ		35.00	ప్రభుత్వ భూమి	92	92	92	92	-	-	-	-
218	55/1	పట్టా	తరి	0.10	కొనంగేరి మదురమ్మ భర్త [illegible]	111	54	111	57	-	-	-	-
219	55/ఆ	పట్టా	తరి	0.10	[illegible]	111	54	111	57	-	-	-	-
220	55/2	పట్టా	తరి	0.10	కొనంగేరి మాణిక్యమ్మ భర్త కొనంగేరి నర్సప్ప	111	54	111	57	-	-	-	-
221	55/4	పట్టా	తరి	0.09	కొనంగేరి మాణిక్యమ్మ భర్త కొనంగేరి నర్సప్ప	111	54	111	57	-	-	-	-
222	56	పట్టా	తరి	0.03	బుగ్గప్ప తండ్రి హన్మన్న	57	53	54	60	-	-	-	-
223	60/అ/ఇ	పట్టా	మెట్ట	0.23	అశోక్ తండ్రి బసప్ప	59	64	56	61	-	-	-	-
224	60/అ/1	పట్టా	మెట్ట	0.10	[illegible]	59	64	56	61	-	-	-	-
225	60/అ	పట్టా	మెట్ట	0.10	[illegible]	59	64	56	61	-	-	-	-
226	60/అ	పట్టా	మెట్ట	0.21	[illegible]	59	64	56	61	-	-	-	-
227	60/అ	పట్టా	మెట్ట	0.10	[illegible]	59	64	56	61	-	-	-	-
228	60/అ	పట్టా	మెట్ట	0.14	[illegible]	59	64	56	61	-	-	-	-
229	60/అ/1	పట్టా	మెట్ట	0.10	[illegible]	59	64	56	61	-	-	-	-
230	60/అ/1	పట్టా	మెట్ట	0.13	[illegible]	59	64	56	61	-	-	-	-
231	60/అ	పట్టా	మెట్ట	0.10	[illegible]	59	64	56	61	[illegible]	1	[illegible]	-
232	60/అ	పట్టా	మెట్ట	0.08	[illegible]	59	64	56	61	-	-	-	-
233	60/అ	పట్టా	మెట్ట	0.11	[illegible]	59	64	56	61	-	-	-	-
234	60/అ	పట్టా	మెట్ట	0.13	[illegible]	59	64	56	61	-	-	-	-
235	60/అ	పట్టా	మెట్ట	0.15	[illegible]	59	64	56	61	-	-	-	-
236	60/అ	పట్టా	మెట్ట	0.16	[illegible]	59	64	56	61	-	-	-	-
237	60/అ/2	పట్టా	మెట్ట	0.13	[illegible]	59	64	56	61	-	-	-	-
238	60/అ/2	పట్టా	మెట్ట	0.15	[illegible]	59	64	56	61	-	-	-	-
239	60/అ/2	పట్టా	మెట్ట	0.10	[illegible]	59	64	56	61	-	-	-	-
240	60/అ/1	పట్టా	తరి	0.07	[illegible]	59	64	56	61	-	-	-	-
241	63/అ	పట్టా	తరి		[illegible] (0.19) [illegible] (0.61)	63	63	63	63	-	-	-	-
242	63/ఈ1	పట్టా	తరి	0.05	[illegible]	63	63	63	63	-	-	-	-
243	63/ఇ	పట్టా	తరి	0.05	[illegible]	63	63	63	63	-	-	-	-
244	69	పట్టా	తరి	0.50	[illegible]	71	70	71	72	[illegible]	2	[illegible]	-
245	70	పట్టా	మెట్ట	0.10	[illegible]	69	19	68	21	-	-	-	-
246	70/అ/1	పట్టా	మెట్ట	0.01	[illegible]	69	19	68	21	-	-	-	-
247	70/అ/3	పట్టా	మెట్ట	0.04	[illegible]	69	19	68	21	-	-	-	-
248	70/అ/2	పట్టా	మెట్ట	0.02	[illegible]	69	19	68	21	-	-	-	-
249	70/అ/4	పట్టా	మెట్ట	0.04	[illegible]	69	19	68	21	-	-	-	-
250	71/2	పట్టా	తరి	0.06	[illegible]	63	69	66	72	-	-	-	-
251	71/1/2	పట్టా	తరి	0.05	[illegible]	63	69	66	72	-	-	-	-
252	71/1/1	పట్టా	తరి	0.10	[illegible]	63	69	66	72	-	-	-	-
253	71/అ/1	పట్టా	తరి	0.05	[illegible]	63	69	66	72	-	-	-	-
254	71/అ/2	పట్టా	తరి	0.08	[illegible]	63	69	66	72	-	-	-	-
255	81/అ/అ1	పట్టా	మెట్ట	1.00	[illegible]	80	87	79	82	-	-	-	-
256	81/అ/1	పట్టా	మెట్ట	1.00	[illegible]	80	87	79	82	-	-	-	-
257	81/అ/2	పట్టా	మెట్ట	0.10	[illegible]	80	87	79	82	-	-	-	-
258	81/అ/2	పట్టా	మెట్ట	0.10	[illegible]	80	87	79	82	-	-	-	-
259	81/అ/1	పట్టా	మెట్ట	0.30	[illegible]	80	87	79	82	-	-	-	-
260	81/అ/1	పట్టా	మెట్ట	0.38	[illegible]	80	87	79	82	-	-	-	-
261	84/అ/1	పట్టా	మెట్ట	0.20	[illegible]	85	660	83	87	-	-	-	-
262	84/అ/2	పట్టా	మెట్ట	0.20	[illegible]	85	660	83	87	-	-	-	-
263	84/అ/3	పట్టా	మెట్ట	1.00	[illegible]	85	660	83	87	-	-	-	-
264	84/అ/2	పట్టా	మెట్ట	1.00	[illegible]	85	660	83	87	-	-	-	-
265	84/అ	పట్టా	మెట్ట	2.37	[illegible]	85	660	83	87	-	-	-	-
266	84/ఉ	పట్టా	మెట్ట	1.00	[illegible]	85	660	83	87	-	-	-	-
267	85	పట్టా	మెట్ట	2.10	[illegible]	87	84	662	87	-	-	-	-
268	85/అ/1/1	పట్టా	మెట్ట	4.09	[illegible]	87	84	662	87	-	-	-	-
269	85/అ/1/2	పట్టా	మెట్ట	0.35	[illegible]	87	84	662	87	-	-	-	-
270	85/అ/2	పట్టా	మెట్ట	0.33	[illegible]	87	84	662	87	-	-	-	-
271	87/45/1	లావణి పట్టా	మెట్ట	1.00	[illegible]	87	87	87	87	-	-	-	-
272	87/48	లావణి పట్టా	మెట్ట	0.25	[illegible]	87	87	87	87	-	-	-	-
273	87/35	లావణి పట్టా	మెట్ట	0.27	[illegible]	87	87	87	87	-	-	-	-
274	87/38	లావణి పట్టా	మెట్ట	2.13	[illegible]	87	87	87	87	-	-	-	-
275	87/57	లావణి పట్టా	మెట్ట	0.04	[illegible]	87	87	87	87	-	-	-	-
276	87/59	లావణి పట్టా	మెట్ట	[illegible]	[illegible]	87	87	87	87	-	-	-	-
277	87/60	లావణి పట్టా	మెట్ట	1.19	[illegible]	87	87	87	87	-	-	-	-
278	87/62	లావణి పట్టా	మెట్ట	0.06	[illegible]	87	87	87	87	-	-	-	-
279	87/04	లావణి పట్టా	మెట్ట	5.00	[illegible]	87	87	87	87	-	-	-	-
280	87/66	లావణి పట్టా	మెట్ట	3.00	[illegible]	87	87	87	87	-	-	-	-
281	87/10	లావణి పట్టా	మెట్ట	1.00	[illegible]	87	87	87	87	-	-	-	-
282	87/130	లావణి పట్టా	మెట్ట	1.00	[illegible]	87	87	87	87	-	-	-	-
283	87/131	లావణి పట్టా	మెట్ట	1.00	[illegible]	87	87	87	87	-	-	-	-
284	87/102	లావణి పట్టా	మెట్ట	0.20	[illegible]	87	87	87	87	-	-	-	-
285	87/02	లావణి పట్టా	మెట్ట	0.20	[illegible]	87	87	87	87	-	-	-	-
286	87/02	లావణి పట్టా	మెట్ట	0.20	[illegible]	87	87	87	87	-	-	-	-
287	87/01	లావణి పట్టా	మెట్ట	0.20	[illegible]	87	87	87	87	-	-	-	-
288	87/07	లావణి పట్టా	మెట్ట	2.21	[illegible]	87	87	87	87	-	-	-	-
289	87/87	లావణి పట్టా	మెట్ట	1.20	[illegible]	87	87	87	87	-	-	-	-
290	87	ప్రభుత్వ	-	1.18	ప్రభుత్వ భూమి	87	87	87	87	-	-	-	-
291	106/అ/1/1	పట్టా	మెట్ట	1.13	[illegible]	111	111	111	102	-	-	-	-
292	106/అ/1/2	పట్టా	మెట్ట	0.24	[illegible]	111	111	111	102	-	-	-	-
293	106/అ/2	పట్టా	మెట్ట	0.24	[illegible]	111	111	111	102	-	-	-	-
294	106/అ/2	పట్టా	మెట్ట	0.29	[illegible]	111	111	111	102	-	-	-	-
295	106/అ/1/1	పట్టా	మెట్ట	1.13	[illegible]	111	111	111	102	-	-	-	-
296	660/అ/1	పట్టా	మెట్ట	0.06	[illegible]	665	111	111	111	-	-	-	-
297	660/అ/2	పట్టా	మెట్ట	0.06	[illegible]	665	111	111	111	-	-	-	-
298	660/ఇ	పట్టా	మెట్ట	0.07	[illegible]	665	111	111	111	-	-	-	-
299	660/ఈ	పట్టా	మెట్ట	0.07	[illegible]	665	111	111	111	-	-	-	-
300	662	పట్టా	మెట్ట	1.00	రావప్ప తండ్రి శంకరప్ప	662	662	662	662	-	-	-	-
301	662/అ	పట్టా	మెట్ట	1.00	శివప్ప తండ్రి శంకరప్ప	662	662	662	662	-	-	-	-
302	662/ఆ	పట్టా	మెట్ట	1.00	మల్లప్ప తండ్రి శంకరప్ప	662	662	662	662	-	-	-	-
303	662/ఇ	పట్టా	మెట్ట	1.00	శివలింగప్ప తండ్రి శంకరప్ప	662	662	662	662	-	-	-	-
304	662/ఈ	పట్టా	మెట్ట	2.00	మల్లప్ప తండ్రి భీమప్ప	662	662	662	662	-	-	-	-
305	662/ఉ	పట్టా	మెట్ట	2.00	ఈరమ్మ భర్త మల్లప్ప	662	662	662	662	-	-	-	-
306	66/అ/1	పట్టా	మెట్ట	0.07	మల్లికార్జున్ తండ్రి నాగప్ప	662	662	662	662	-	-	-	-
307	66/అ/2	పట్టా	మెట్ట	0.07	మహేశ్ తండ్రి నాగప్ప	662	662	662	662	-	-	-	-
308	663	పట్టా	మెట్ట	0.05	రావప్ప తండ్రి శంకరప్ప	63	63	63	63	-	-	-	-
309	661/అ	పట్టా	మెట్ట	0.05	శివప్ప తండ్రి శంకరప్ప	63	63	63	63	-	-	-	-
310	66/అ/1/అ	పట్టా	మెట్ట	1.00	అంజమ్మ భర్త తిప్పన్న	664	664	664	664	-	-	-	-
311	66/అ/1/అ	పట్టా	మెట్ట	0.10	కుకల భాగ్యమ్మ భర్త బాలప్ప	664	664	664	664	-	-	-	-
312	66/అ/2	పట్టా	మెట్ట	0.10	కుకల గోరమ్మ భర్త బాలప్ప	664	664	664	664	-	-	-	-
313	664/అ	పట్టా	మెట్ట	1.00	బసప్ప తండ్రి తిప్పన్న	664	664	664	664	-	-	-	-
314	664/అ	పట్టా	మెట్ట	0.06	ఈడిగ సరోజ భర్త సాయన్న	664	664	664	664	-	-	-	-
315	664/ఇ	పట్టా	మెట్ట	0.06	నర్సిములు తండ్రి తిపన్న	664	664	664	664	-	-	-	-
316	18/2/అ/2	లావణి పట్టా	మెట్ట	0.20	మల్లప్ప తండ్రి బసప్ప	18	18	18	18	-	-	-	-
317	18/2/అ/అ	లావణి పట్టా	మెట్ట	0.20	గడం కృష్ణయ్య తండ్రి నర్సిములు	18	18	18	18	-	-	-	-
318	18/1/అ/2	లావణి పట్టా	మెట్ట	0.20	చిన్న కిష్టప్ప తండ్రి బసప్ప	18	18	18	18	-	-	-	-
319	18/2/ఇ/1	లావణి పట్టా	మెట్ట	0.02	బైకెడ్ కిష్టప్ప తండ్రి బసప్ప	18	18	18	18	-	-	-	-
320	18/1/అ/1	లావణి పట్టా	మెట్ట	0.20	బైకెడ్ కిష్టప్ప తండ్రి బసప్ప	18	18	18	18	-	-	-	-
321	18/2/అ	లావణి పట్టా	మెట్ట	0.32	గడం గోవర్ధన్ తండ్రి నర్సిములు	18	18	18	18	-	-	-	-
322	18/2/అ/3	లావణి పట్టా	మెట్ట	0.26	నర్సప్ప తండ్రి బసప్ప	18	18	18	18	-	-	-	-
323	18/1/అ	లావణి పట్టా	మెట్ట	0.25	హన్మంతు తండ్రి బసప్ప	18	18	18	18	-	-	-	-
324	18/4	లావణి పట్టా	మెట్ట	1.00	వెంకటప్ప తల్లి చంద్రమ్మ	18	18	18	18	-	-	-	-
325	18/3	లావణి పట్టా	మెట్ట	0.20	సత్యమ్మ భర్త అంతప్ప	18	18	18	18	-	-	-	-
326	18/3/ఇ	లావణి పట్టా	మెట్ట	0.20	శంకర్ తండ్రి అంతప్ప	18	18	18	18	-	-	-	-
327	18/2/ఇ/అ	లావణి పట్టా	మెట్ట	0.20	గడం బాలమ్మ భర్త గడ్డం బసప్ప	18	18	18	18	-	-	-	-
328	91/1	పట్టా	మెట్ట	0.14	గోపాల్ తండ్రి నర్సప్ప	91	91	91	91	-	-	-	-
329	91/2	పట్టా	మెట్ట	0.13	న్నిములు తండ్రి నర్సప్ప	91	91	91	91	-	-	-	-
330	91/3	పట్టా	మెట్ట	0.27	దేవేంద్రప్ప తండ్రి తిర్పలయ్య	91	91	91	91	-	-	-	-
331	83/అ/1	పట్టా	మెట్ట	0.22	హన్మంతు తండ్రి బస్సన్న	91	81	80	84	-	-	-	-
332	83/అ/1/2/2	పట్టా	మెట్ట	1.15	జనలింగప్ప తండ్రి రాములు	91	81	80	84	-	-	-	-
333	83/అ/2/1/1	పట్టా	మెట్ట	0.08	యు బాలిరెడ్డి తండ్రి రామ్‌రెడ్డి	91	81	80	84	-	-	-	-
334	83/అ/2/2	పట్టా	మెట్ట	0.22	బిక్కి భీమప్ప తండ్రి కిష్టప్ప	91	81	80	84	-	-	-	-
335	83/అ/1/2/1/1	పట్టా	మెట్ట	0.10	బైకాని నర్సిములు తండ్రి హన్మంతు	91	81	80	84	-	-	-	-
336	83/అ/1/2/1	పట్టా	మెట్ట	0.15	బాస్కర్ రెడ్డి తండ్రి యు. బాలిరెడ్డి	91	81	80	84	-	-	-	-
337	83/అ/2	పట్టా	మెట్ట	0.22	బాస్కర్ రెడ్డి తండ్రి యు. బాలిరెడ్డి	91	81	80	84	-	-	-	-
338	83/అ/1/1	పట్టా	మెట్ట	1.17	యు. మాధవరెడ్డి తండ్రి యు.వెంకటరెడ్డి	91	81	80	84	-	-	-	-
339	83/అ/2/1/2	పట్టా	మెట్ట	0.15	యు. లక్ష్మి తండ్రి యు.వెంకటరెడ్డి	91	81	80	84	-	-	-	-
340	83/అ/2/1/2	పట్టా	మెట్ట	0.16	ఉట్కూరు వెంకట్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి	91	81	80	84	-	-	-	-
341	83/అ/1	పట్టా	మెట్ట	0.17	మేకల కృష్ణ తండ్రి మేకల నరసింహ	91	81	80	84	-	-	-	-
342	83/అ/1	పట్టా	మెట్ట	0.17	మేకల సుజాత తండ్రి మేకల రాజు	91	81	80	84	-	-	-	-
343	83/అ/3	పట్టా	మెట్ట	0.17	మేకల వెంకటేష్ తండ్రి మేకల నరసింహ	91	81	80	84	-	-	-	-
344	83/అ/2/1/1/3	పట్టా	మెట్ట	0.22	బైకాని వెంకటమ్మ భర్త నర్సిములు	91	81	80	84	-	-	-	-
345	83/అ/1/[illegible]	పట్టా	మెట్ట	0.19	బైకాని వెంకటమ్మ భర్త నర్సిములు	91	81	80	84	-	-	-	-
346	83/అ/1/[illegible]	పట్టా	మెట్ట	0.01	ఉట్కూర్ భీమ్‌రెడ్డి తండ్రి బలవంత్‌రెడ్డి	91	81	80	84	-	-	-	-
347	83/అ/1/[illegible]	పట్టా	మెట్ట	0.09	మిస్కిన్ అనిల్ కుమార్ తండ్రి హన్మంత్‌రావ్	91	81	80	84	-	-	-	-
348	83/అ/1/1/2	పట్టా	మెట్ట	0.14	శోభారాణి తండ్రి భాస్కర్‌రెడ్డి	91	81	80	84	-	-	-	-
	మొత్తం			326.34									

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టము నెం.30/2013లో న్యాయమైన సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల ప్రకారం పైన పేర్కొనబడిన వారందరికీ ఈ ప్రకటన రూపొందించబడింది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, నారాయణపేట మరియు రెవిన్యూ డివిజినల్ అధికారి, నారాయణపేట భూ సేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును.

తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్-కం-సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేసేట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు & భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందిని అధికారిగా అధికారమిచ్చుటకు.

చట్టం సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు/ కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూములపై ఏవైనా రుణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవి ఏ వ్యక్తి చేయరాదు.

పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్మెంట్ కొరకు ఆసక్తి/ ప్రభావితమయ్యే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేది. నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టర్/ అధీకృత సమక్షంలో సమర్పించవచ్చును.

సం/-	సం/-	సం/-
భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట	అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నారాయణపేట	జిల్లా కలెక్టర్ నారాయణపేట

DIPR RO No.235/LA-PP/ADVT/Publication/2025-26

గిల్ సేన.. సాధించేనా?

రేపటి నుంచే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్


ప్రాక్టీస్‌లో గిల్, నితీశ్, శార్దూల్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టెస్టుల్లో భారత్, ఇంగ్లండ్ పోరు దశాబ్దాలనాటిది. 1932 నుంచి ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తున్నా సిరీస్ గెలిచిన సందర్భం ఒక్కటే..! అంటే పర్యాటక జట్టుకు ఎంత కష్టమో రికార్డులను చూస్తేనే అర్థమవుతోంది. 2007లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0తో దక్కించుకుంది. నాటింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో జహీర్ ఖాన్ నిప్పులు చెరగగా.. సచిన్, గంగూలీ, లక్షణ్ బ్యాట్‌తో చెలరేగడంతో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. లార్డ్స్, ఓవల్‌లో జరిగిన మ్యాచ్‌లను టీమిండియా డ్రాగా ముగించింది. ఆ తర్వాత రోహిత్ శర్మ, కోహ్లీ, అశ్విన్, బుమ్రాలతో భారత్ మేటి జట్టుగా ఎదిగినా.. ఇంగ్లండ్‌లో మాత్రం మరో సిరీస్‌ను సొంతం చేసుకోలేక పోయింది. 2021 పర్యటనలో భారత్ 2-1తో ఆధిక్యం సాధించినా.. కరోనా కారణంగా సిరీస్‌లో నాలుగో, ఆఖరి టెస్టును 2022కు వాయిదా వేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ ఓడడంతో సిరీస్ 2-2తో సమమైంది.

సంధి దశలోనే..

ఈసారి పర్యటనలో యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగుతోంది. కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్‌తో జట్టులో అనుభవలేమి కనిపిస్తోంది. అయితే, అరంగేట్రం బ్యాటర్ సాయి సుదర్శన్, యశస్వీ జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, రిషభ్ పంత్, జడేజాతో బ్యాటింగ్ బలంగానే ఉంది. పేస్ విభాగానికి బుమ్రా, సిరాజ్ ప్రధానం కాగా.. అశ్విన్ లేకపోవడంతో స్పిన్ భారం జడేజాపైనే పడనుంది. మరోవైపు ఇంగ్లండ్ పరిస్థితి కూడా టీమిండియాలాగే సంధి దశలో ఉంది. అండర్సన్, బ్రాడ్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి సిరీస్ ఇది. ఓవర్టన్, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్‌తో బౌలింగ్ విభాగం కొత్తగా కనిపిస్తోంది.

ఇరు జట్ల ముఖాముఖి

మొత్తం ఆడిన టెస్టులు	36
భారత్ గెలిచినవి	11
ఇంగ్లండ్ నెగ్గినవి	17
డ్రాగా ముగిసినవి	8

బ్యాటింగ్ వికెట్ సిద్ధమా!

లీడ్స్: వేడి వాతావరణం, ఇంగ్లండ్ బజ్‌బాల్ నేపథ్యంలో శుక్రవారం నుంచి జరిగే తొలి టెస్టుకు ఎలాంటి పిచ్‌ను సిద్ధం చేస్తారా? అనేది ఆసక్తిగా మారింది. అయితే, లీడ్స్ గ్రౌండ్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ మాత్రం మొదటి టెస్ట్‌కు చక్కని బ్యాటింగ్ వికెట్ లభించే అవకాశం ఉందని చెప్పాడు. సాధారణంగా ఈ గ్రౌండ్‌లో సిరీస్ మధ్యలో మ్యాచ్‌ను నిర్వహిస్తుంటారు. కానీ, ఈసారి తొలి మ్యాచ్‌నే ఇక్కడ షెడ్యూల్ చేయడం ఎక్కువమంది దృష్టిని ఆకర్షిస్తోంది. 'చక్కని వికెట్ కావాలని ఇంగ్లండ్ కోరుతోంది. బంతి బ్యాట్‌మీదకు రావాలని చెప్పార'ని రాబిన్సన్ చెప్పాడు. తొలి రోజు పేసర్లకు అనుకూలించినా.. వేడి వాతావరణం కారణంగా పిచ్ ఫ్లాట్‌గా మారే అవకాశాలున్నాయన్నాడు. అంతగా అనుభవంలేని భారత బ్యాటర్లకు కూడా ఇది అనుకూలమన్నాడు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకొనే చాన్సుందన్నాడు.

ఆ ఆల్‌రౌండర్ ఎవరు?

టీమిండియా తుది జట్టు కూర్పు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్థానం కోసం నితీశ్ కుమార్, శార్దూల్ ఠాకూర్ పోటీపడుతుండడంతో..ఎవరు తుది జట్టులో ఉంటారోనన్న ఆసక్తి నెలకొంది. ఆస్ట్రేలియా టూర్‌కు శార్దూల్‌ను పక్కనబెట్టి నితీశ్‌కు అవకాశం ఇచ్చారు. మెల్‌బోర్న్ టెస్టులో శతకం బాదిన నితీశ్ బ్యాట్‌తో ఆకట్టుకొన్నా, బంతితో రాణించలేక పోయాడు. పరుగులను నియంత్రించగలుగుతున్నా.. వికెట్ల విషయంలో నితీశ్ వెనకబడ్డాడు. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్ స్థానానికి అతడు న్యాయం చేస్తాడా? అనే ప్రశ్న తలెత్తుతోంది. పైగా గాయం నుంచి కోలుకొన్న నితీశ్ ఫిట్‌నెస్‌పై సందేహాలున్నాయి. ఇక.. 2023 డిసెంబరులో దక్షిణాఫ్రికాతో టెస్టు తర్వాత ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బందిపడిన శార్దూల్ ఠాకూర్ క్రమంగా కోలుకొన్నాడు. దేశవాళీల్లో రాణించి మళ్లీ టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. పైగా ఇంగ్లండ్ గడ్డపై ఆడిన అనుభవంతోపాటు పార్ట్‌నర్‌షిప్ బ్రేకర్‌గా ఠాకూర్‌కు పేరుంది. బ్యాట్‌తోనూ ఆకట్టుకొంటున్న అతడు ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ సెంచరీ సాధించాడు.

నేనైతే అతడే అంటాను: రవిశాస్త్రి

పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్థానం కోసం నితీశ్, శార్దూల్‌లలో ఎవర్ని ఎంపిక చేయాలన్న అంశంపై టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి ఆసక్తికరమైన సమాధానం చెప్పాడు. తానైతే ఠాకూర్‌వైపే మొగ్గుచూపుతానని శాస్త్రి అన్నాడు. 'నేనైతే ముగ్గురు పేసర్లు, శార్దూల్‌తో ఆడతా. నితీశ్, ఠాకూర్ మధ్య ఒకరిని ఎంపిక చేయడం కష్టమే. కానీ, ఎక్కువ ఓవర్లు బౌలింగ్ చేయగల సామర్థ్యం ఎవరికి ఉందనేది ముఖ్యం. నితీశ్ 12-14 ఓవర్లు వేయగలిగితే అతడికే నా మద్దతు. ఎందుకంటే అతడు కూడా బ్యాటింగ్ చేయగలడ'ని రవి చెప్పాడు. బుమ్రా, సిరాజ్‌తోపాటు ప్రసిద్ధ్ కృష్ణను మూడో పేసర్‌గా ఎంపిక చేయాలన్నాడు.

ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

బ్రాండ్ అంబాసిడర్‌గా కంగన



న్యూఢిల్లీ: నటి, పార్లమెంట్ సభ్యురాలు కంగన రనౌత్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైంది. ఈ మెగా టోర్నమెంట్ ఈ సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 5 వరకు ఢిల్లీ వేదికగా జరగనుంది. వంద దేశాలకు పైగా పారా అథ్లెట్లు పోటీపడే ఈ చాంపియన్‌షిప్‌నకు అసలైన అంబాసిడర్ కంగన అని భారత పారాలింపిక్ కమిటీ తెలిపింది. అంబాసిడర్ హోదాలో మన చాంపియన్లకు మద్దతుగా నిలిచే అదృష్టం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని కంగన వ్యాఖ్యానించింది.

విరాట్ స్థానం గిల్‌దే..



హెడింగ్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడని వైస్-కెప్టెన్ పంత్ తెలిపాడు. తాను ఐదో స్థానంలోనే బరిలో దిగుతానని బుధవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించాడు. విరాట్ రిటైరైన నేపథ్యంలో నాలుగో నెంబర్‌లో ఎవరు బ్యాటింగ్ చేస్తారోననే చర్చ బయలుదేరింది. దానికి పంత్ తెరదించాడు. 'మూడో నెంబర్ బ్యాటర్‌పై ఇంకా చర్చ జరుగుతోంది. కానీ 4, 5 స్థానాలలో ఎవరొస్తారో ఖరారైంది. గిల్ నాలుగో నెంబర్‌లో బరిలో దిగే చాన్సుంది. నేను మాత్రం ఐదో స్థానంలోనే బ్యాటింగ్ చేస్తా' అని పంత్ వివరించాడు.

రూ. 538 కోట్లు చెల్లించాల్సిందే..

బీసీసీఐకి బాంబే హైకోర్టు షాక్

కొచ్చి టస్కర్స్ కేసులో తీర్పు

ముంబై: బాంబే హైకోర్టులో బీసీసీఐకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ జట్టు కొచ్చి టస్కర్స్‌కు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. కొచ్చి ఫ్రాంచైజీకి రూ. 538 కోట్లు పరిహారంగా చెల్లించాలని ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. వివరాలేంటంటే.. ఐపీఎల్‌లో కొచ్చి టస్కర్స్ 2011 సీజన్‌లో మాత్రమే ఆడింది. ఆపై తమతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ టస్కర్స్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ తొలగించింది. బ్యాంకు గ్యారెంటీనీ సరైన సమయంలో అందజేయకపోవడంతో ఆ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు వివరించింది. దాంతో కొచ్చి జట్టు 2012 ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. ట్రిబ్యునల్ కొచ్చికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. తొలగింపునకు పరిహారంగా రూ. 538 కోట్లను టస్కర్స్‌కు చెల్లించాలని బోర్డును ఆదేశించింది. అయితే ట్రిబ్యునల్ తీర్పును బాంబే హైకోర్టులో బీసీసీఐ సవాలు చేసింది. దీనిపై విచారించిన ఏకసభ్య ధర్మాసనం జడ్జి ఆర్‌ఐ చాగ్లా బీసీసీఐ పిటిషన్‌ను కొట్టివేశారు. కొచ్చికి రూ. 538 కోట్లు చెల్లించాలన్న ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ తీర్పును సమర్థించారు. కాగా..తీర్పుపై బీసీసీఐ స్పందన తెలియరాలేదు. హైకోర్టును తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేస్తుందేమో చూడాలి.

పాక్‌తో భారత్ తొలి పోరు

మహిళల టీ20 వరల్డ్‌కప్-2026

షెడ్యూల్ విడుదల



దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్-2026లో తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇంగ్లండ్‌లో వచ్చే ఏడాది జూన్ 12 నుంచి జూలై 5 వరకు.. 24 రోజులపాటు జరిగే పొట్టికప్ షెడ్యూల్‌ను ఐసీసీ బుధవారం విడుదల చేసింది. టోర్నీలో పాల్గొనే 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌తోపాటు రెండు క్వాలిఫయర్ జట్లు.. గ్రూప్-2లో వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంకతోపాటు రెండు క్వాలిఫయర్ టీమ్‌లు ఆడనున్నాయి. జూన్ 12న ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో శ్రీలంక తలపడనుండగా.. ఇదే వేదికపై 14న జరిగే పోరులో పాక్‌తో భారత్ ఆడనుంది. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. జూన్ 30, జూలై 2న సెమీ ఫైనల్స్.. జూలై 5న లార్డ్స్‌లో టైటిల్ ఫైట్ జరగనున్నాయి.

కోహ్లీ లేకపోవడంతో..

ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్



లీడ్స్: బ్లాక్‌బస్టర్‌లాంటి టెస్ట్ సిరీస్‌లో విరాట్ కోహ్లీవంటి గొప్ప ఆటగాడిని ఎదుర్కోలేకపోవడం ఎంతో విచారకరమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. కోహ్లీ లేని భారత జట్టులో మునుపటి పోరాటతత్వం, గెలవాలన్న తపన సన్నగిల్లుతాయని అన్నాడు. టెస్ట్ ఫార్మాట్‌కు గత నెలలో విరాట్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అంతకుముందు కొద్ది రోజుల కిందటే రోహిత్ శర్మ కూడా టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో సంధి దశలో ఉన్న భారత జట్టు యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో ఇంగ్లండ్‌ను ఐదు టెస్ట్‌ల్లో ఢీకొనబోతోంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విడుదల జేసిన ఓ వీడియోలో స్టోక్స్..కోహ్లీ నిష్క్రమణపై తన అభిప్రాయాలను వెల్లడించాడు. మైదానంలో తామిద్దరిదీ ఒకే తరహా మైండ్‌సెట్ అనీ, అతనితో తలపడే అవకాశం లభించకపోవడం తనకే మాత్రం నచ్చడంలేదని స్టోక్స్ చెప్పాడు. ఇదే విషయాన్ని కోహ్లీకి మెసేజ్ చేశానని అన్నాడు. 'జెర్సీ నెంబర్ 18ని విరాట్ తనదిగా చేసుకున్నాడు. ఇకపై ఆ నెంబర్ ఏ భారత జట్టు క్రికెటర్ జెర్సీపైనా కనిపించకపోవడాన్ని జీర్ణించుకోవడం కష్టమే. కోహ్లీ ఆ నెంబర్‌కు అంతలా వన్నె తెచ్చాడు' అని బెన్ చెప్పుకొచ్చాడు.

విరాట్‌లేని లోటు సుస్పష్టం: బాయ్‌కాట్

ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రోహిత్ శర్మకన్నా విరాట్ కోహ్లీలేని లోటు భారత్‌కు స్పష్టంగా కనిపిస్తుందని దిగ్గజ బ్యాటర్ బాయ్‌కాట్ అభిప్రాయపడ్డాడు. 'కోహ్లీ లేకపోవడం టీమిండియాపై పెను ప్రభావం చూపుతుంది' అన్నాడు.

ఇంగ్లండ్‌కు సూర్యకుమార్



న్యూఢిల్లీ: టీమిండియా టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లండ్ వెళ్లాడు. స్పోర్ట్స్ హెర్నియా (గజ్జల్లో లేదా పొత్తి కడుపులో నొప్పి) సంబంధిత గాయానికి చికిత్స కోసం అతను ఇంగ్లండ్ వెళ్లినట్టు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. అవసరమైతే సూర్య తన గాయానికి శస్త్రచికిత్స కూడా చేయించుకునే అవకాశముందని తెలిపాడు. ఐపీఎల్ ముగిశాక సూర్య ముంబై టీ20 టోర్నీలో ఆడాడు. ఆ టోర్నీ సందర్భంగా అతనికి నొప్పి తీవ్రమైనట్టు సమాచారం. 'గాయానికి చికిత్స తీసుకోవడానికి ఇదే సరైన సమయమని సూర్య భావించాడు. చికిత్స అనంతరం పునరావాసం కోసం అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరనున్నాడు' అని బీసీసీఐ అధికారి పేర్కొన్నాడు.

బంగ్లాదేశ్ 484/9

శ్రీలంకతో తొలి టెస్ట్

గాలె: శ్రీలంకతో తొలి టెస్ట్‌లో రెండో రోజు ఆఖరికి బంగ్లాదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లకు 484 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ 292/3 స్కోరుతో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 192 పరుగులు జోడించి 6 వికెట్లు కోల్పోయింది. కిందటి రోజు బ్యాటర్లు షంటో (148), ముష్ఫికర్ రహీమ్ (163) నాలుగో వికెట్‌కు 264 పరుగులు జోడించారు. అనంతరం లిటన్ దాస్ (90) జతగా ఐదో వికెట్‌కు ముష్ఫికర్ మరో 149 రన్స్ జత చేశాడు. అయితే రెండు గంటల పాటు వర్షంతో ఆటకు అంతరాయం ఏర్పడి తిరిగి మొదలయ్యాక లంక బౌలర్లు విజృంభించారు. 20.4 ఓవర్లు బౌల్ చేసి 61 పరుగులే ఇచ్చి 5 బంగ్లా వికెట్లు పడగొట్టారు.

క్విటోవాకు వింబుల్డన్ వైల్డ్‌కార్డ్



లండన్: రెండుసార్లు వింబుల్డన్ చాంపియన్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్)కు ఆ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వైల్డ్‌కార్డ్ లభించింది. దీంతో ఈనెల 30 నుంచి జరిగే వింబుల్డన్‌లో క్విటోవా నేరుగా మెయిన్ డ్రాలో తలపడనుంది. ఏడాదిన్నరపాటు ఆటకు దూరంగా ఉన్న ఆమె.. ప్రస్తుతం 572వ ర్యాంక్‌లో ఉంది.

పీఎస్‌యూల స్వచ్ఛంద డీలిస్టింగ్‌కు

సెబీ లైన్ క్లియర్

» రీట్స్, ఇన్విట్స్‌కు ఈక్విటీ షేర్ల హోదా

» క్యూఐపీ వెల్లడి నిబంధనల సరళీకరణ



న్యూఢిల్లీ: పెట్టుబడుల మార్కెట్‌లో మరిన్ని సంస్కరణలకు సెబీ శ్రీకారం చుట్టింది. చైర్మన్ తుహిన్ పాండే అధ్యక్షతన బుధవారం సమావేశమైన సెబీ బోర్డు దీనికి సంబంధించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

సెబీ బోర్డు తీసుకున్న కీలక నిర్ణయాలు...

ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) స్వచ్ఛంద డిలిస్టింగ్‌కు అనుమతిస్తూ సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈక్విటీలో 90 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ప్రభుత్వానికి ఉన్న పీఎస్‌యూలకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. కాకపోతే ఇందుకు మెజారిటీ వాటాదారుల ఆమోదంతోపాటు, రెగ్యులేటరీ సంస్థల అనుమతి అవసరం. ఈ సంస్కరణతో పీఎస్‌యూల వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుందని భావిస్తున్నారు.

స్టార్టప్స్- ఈసాప్స్: ఐపీఓల తర్వాత కూడా స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లు ఉద్యోగుల తరహాలో ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్స్ (ఈసాప్స్) కలిగి ఉండేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. కాకపోతే ఐపీఓకు ఏడాది ముందే వీరు ఈ షేర్లను డీమ్యాట్ రూపంలో కలిగి ఉండాలని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఐపీఓల తర్వాత స్టార్టప్‌ల వ్యవస్థాపకులను ప్రమోటర్లుగా పరిగణించి ఈసాప్ షేర్లు కలిగి ఉండేందుకు అనుమతించరు. తాజా సంస్కరణ స్టార్టప్ కంపెనీల దీర్ఘకాలిక వృద్ధిలో ప్రమోటర్లు మరింత మమేకమయ్యేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

ఏఐఎఫ్‌లకు వెసులుబాటు: ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల్లో (ఏఐఎఫ్) మదుపు చేసే వారికి సెబీ కొత్త వెసులుబాటు కల్పించింది. ఇక ఈ మదుపరులు ఏఐఎఫ్‌లు పెట్టుబడులు పెట్టిన అన్‌లిస్టెడ్ కంపెనీల్లో అదనపు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిస్తారు. కాకపోతే ఏఐఎఫ్‌లు ఇందుకోసం ప్రత్యేక పథకంలా ఒక స్వతంత్ర కో ఇన్వెస్ట్‌మెంట్ వెహికల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే ఏఐఎఫ్‌ల మేనేజర్లు అన్ని రకాల మదుపరులకు సలహా సేవలు అందించేందుకూ సెబీ ఆమోదం తెలిపింది.

ప్రభుత్వ రుణ పత్రాలు - ఎఫ్‌పీఐలు: ప్రభుత్వ రుణ పత్రాల్లో విదేశీ పోర్టుఫోలియో మదుపరుల పెట్టుబడుల రిజిస్ట్రేషన్, కంప్లయన్స్ ప్రక్రియను సెబీ మరింత సులభం చేసింది. దీంతో ఎఫ్‌పీఐలు మరింత చురుగ్గా పెద్దగా నష్ట భయం లేని ప్రభుత్వ రుణ పత్రాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమమైంది. వీటికి తోడు ఇన్‌ఫ్రా కంపెనీలు, రియల్ ఎస్టేట్ కంపెనీలు జారీ చేసే ఇన్విట్స్, రీట్స్‌ను ఈక్విటీ షేర్లుగా పరిగణించేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. క్యూఐపీ ఇష్యూల నిబంధనల వెల్లడినీ మరింత సులభతరం చేసింది.

వెంటాడిన యుద్ధ భయం

» 138 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 138.64 పాయింట్ల నష్టంతో 81,444.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41.35 పాయింట్లు కోల్పోయి 24,812.05 వద్ద ముగిసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ముడిచమురు ధరలు పెరుగుతుండటంతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై అమ్మకాలకు మొగ్గుచూపడం ఇందుకు కారణం.

● డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు క్షీణించి రూ.86.43 వద్ద ముగిసింది. ఈక్విటీ నష్టాలు, క్రూడ్ ధరల పెరుగుదల ఇందుకు కారణం.

● అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 77 డాలర్ల ఎగువన ట్రేడైంది.

వెండి సరికొత్త రికార్డు

హైదరాబాద్ మార్కెట్లో కిలో రూ.1.21 లక్షలు

అంతర్జాతీయ విపణిలో 37 డాలర్ల పైకి ఔన్స్ సిల్వర్



వెండి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు బుధవారం రూ.1,000 పెరిగి రూ.1.21 లక్షలకు చేరింది. వెండి ధర పెరగడం వరుసగా ఇది మూడో రోజు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) కూడా వెండి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయిని తాకాయి. జూలై గడువు కాంట్రాక్టు ధర రూ.1,09,748కి, సెప్టెంబరు గడువు కాంట్రాక్టు రేటు రూ.1.11 లక్షలకు ఎగబాకింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న విలువైన లోహాలపైకి దృష్టి మళ్లించారు. అయితే, బంగారం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిల్లో కొనసాగుతుండటంతో వెండిలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు విశ్లేషకులు తెలిపారు. అలాగే, పారిశ్రామిక అవసరాలకు తగినంత స్థాయిలో సరఫరా లేకపోవడం కూడా వెండి ధరలు ఎగబాకడానికి మరో కారణం. దాంతో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) వెండి రేటు ఒక దశలో 37.23 డాలర్లకు చేరింది. 2012 ఫిబ్రవరి తర్వాత వెండికిదే గరిష్ఠ స్థాయి. దశాబ్దానికి పైగా కాలంలో ఔన్స్ సిల్వర్ 37 డాలర్లు దాటడం ఇదే మొదటిసారి.

భవిష్యత్‌లో రూ.2 లక్షలు?

వెండి ధరలు భవిష్యత్‌లో రెట్టింపు కానున్నాయని, ఔన్స్ సిల్వర్ 70 డాలర్లకు చేరుకోవచ్చని రిచ్ డాడ్.. పూర్ డాడ్ పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకీ అంచనా వేశారు. అంతర్జాతీయంగా రాజకీయ భౌగోళిక అనిశ్చితులు పెరుగుతుండటంతోపాటు ఎలక్ట్రానిక్స్ రంగం శరవేగ వృద్ధి నేపథ్యంలో ఇండస్ట్రీ అవసరాలకు తగినంత వెండి సరఫరా జరగకపోవడం ఇందుకు కారణమన్నారు. రాబర్ట్ అంచనాలు నిజమైతే, దేశీయ మార్కెట్లో కిలో వెండి రూ.2 లక్షలు దాటుతుంది.

ఈ ఏడాదిలో రూ.23,000 పెరుగుదల

2025 జనవరి 1న హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.98,000గా ఉంది. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రేటు రూ.23,000 పెరిగింది. ముున్ముందు మరింత ఎగబాకే అవకాశం ఉందని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ వెండి 36.89 డాలర్ల వద్ద కీలక నిరోధ స్థాయిని అధిగమించడమే ఇందుకు కారణం. తదుపరి దశలో 40 డాలర్ల దిశగా పరుగు తీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, 38.34 డాలర్ల స్థాయిలో గట్టి నిరోధం ఎదురుకావచ్చని వారు భావిస్తున్నారు.

రూ.లక్షపైన బంగారం

మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర 10 గ్రాములకు రూ.540 పెరుగుదలతో రూ.1,00,910కి చేరింది. 22 క్యారెట్ల లోహం రేటు రూ.500 పెరుగుదలతో రూ.92,500కు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ఒకదశలో 3,400 డాలర్ల ఎగువన ట్రేడైంది.

విప్రో ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్‌కు

ఫ్రెంచ్ కంపెనీలో మెజారిటీ వాటా

న్యూఢిల్లీ: ఫ్రాన్స్‌కు చెందిన విమానాల విడిభాగాల తయారీదారు లౌక్ గ్రూప్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ (డబ్ల్యూఐఎన్) బుధవారం తెలిపింది. ప్రస్తుతం ప్యారిస్‌లో జరుగుతున్న ఎయిర్‌షోలో ఇరువర్గాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే, ఎంత వాటా, ఎంతకు కొనుగోలు చేస్తున్న వివరాలను మాత్రం డబ్ల్యూఐఎన్ వెల్లడించలేదు. మరికొద్ది నెలల్లో ఈ కొనుగోలు ఒప్పందం పూర్తి కావచ్చని అంచనా. ఈ డీల్ పూర్తయ్యాక కంపెనీ పేరును విప్రో లౌక్‌గా మార్చనున్నారు. 50 ఏళ్ల నాటి కుటుంబ యాజమాన్య సంస్థ అయిన లౌక్ గ్రూప్.. పలు అంతర్జాతీయ ఏరోస్పేస్ కంపెనీలకు విమానాల విడిభాగాలను సరఫరా చేస్తోంది.

ప్యారిస్ ఎయిర్ షోలో రఘు వంశీ

హైదరాబాద్‌కు చెందిన రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్ ప్రస్తుతం పారిస్‌లో జరుగుతున్న 55వ అంతర్జాతీయ ఎయిర్ షోలో తన అధునిక డిఫెన్స్ అండ్ ప్రొపల్షన్ టెక్నాలజీలను ప్రదర్శించింది. దేశీయంగా తయారు చేసిన మైక్రో టర్బోజెట్ ఇంజన్ల నుంచి హై పెర్‌ఫార్మెన్స్ కామికేజ్ డ్రోన్లను ప్రదర్శనలో ఉంచినట్లు కంపెనీ తెలిపింది.

ఎన్‌కేఐ మేనేజింగ్ డైరెక్టర్‌గా సంపత్ కుమార్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ నిప్పన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌కేఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ జీ సంపత్ కుమార్ నియమితులయ్యారు. ఈ కంపెనీకి ఎండీగా ఒక భారతీయుడు నియమితుడు కావడం ఇదే ప్రథమం. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న కత్సుయా పుకసకు కంపెనీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నారు. ఐఐటీ బీహెచ్‌యూ పూర్వ విద్యార్థి అయిన సంపత్ కుమార్‌కు సివిల్ ఇంజనీరింగ్, ఐటి కన్సల్టెన్సీలో 35 సంవత్సరాల అనుభవం ఉంది.

మేక్‌మై ట్రిప్‌లో తగ్గనున్న చైనా వాటా

న్యూఢిల్లీ: చైనా కంపెనీల ఈక్విటీలో వాటా కుదించుకుంటున్న భారత కంపెనీల జాబితాలో ట్రావెల్ బుకింగ్ కంపెనీ మేక్‌మై ట్రిప్ కంపెనీ చేరింది. ఈ కంపెనీ ఈక్విటీలో ప్రస్తుతం చైనా కంపెనీ ట్రిప్.కామ్‌కు 45.34 శాతం వాటా ఉంది. ఈ వాటాను 19.99 శాతానికి కుదించేందుకు మేక్‌మై ట్రిప్ సిద్ధమైంది. ఇందుకోసం చైనా కంపెనీకి ఉన్న వాటా నుంచి 25.35 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. షేర్లుగా మార్చుకోదగిన రుణ పత్రాలు, షేర్ల విక్రయం ద్వారా ఇందుకు అవసరమైన 250 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,617 కోట్లు) సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది.

బిజినెస్

అమెరికాలో

వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్: కీలక స్వల్ప కాలిక వడ్డీరేట్లను 4.25-4.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వు నిర్ణయించింది. చైర్మన్ జెరోం పోవెల్ అధ్యక్షతన జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్స్ కమిటీ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడం వరుసగా ఇది నాలుగో సారి. రిటైల్ ద్రవ్యోల్బణం, నిరుద్యోగం అదుపులోనే ఉన్నా ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని ఫెడ్ రిజర్వు ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు.

వొడాఫోన్ నుంచి శాట్‌కామ్ సర్వీసులు

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పులు, నష్టాల్లో ఉన్నా వొడాఫోన్ ఐడియా కంపెనీ కూడా ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ అనే కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ కంపెనీకి ప్రధాన పోటీదారుగా భావిస్తారు. ఈ ఒప్పందం ద్వారా వొడాఫోన్ ఐడియా కంపెనీ వాణిజ్య, ప్రభుత్వ శాఖలకు స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఈ సేవలు అందిస్తుంది. ఎప్పటి నుంచి సేవలు ప్రారంభమయ్యేది వొడాఫోన్ ఐడియా వెల్లడించలేదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	530
వరంగల్	512	గోదావరి	510
చిత్తూరు	583	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	97
వరంగల్	93	గుంటూరు	102
కరీంనగర్	93	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	87	అనంతపురం	100
గోదావరి	97		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,910 ▲	92,500 ▲	1,21,000 ▲
విజయవాడ	1,00,200 ▲	94,200 ▲	1,12,000 ▲
విశాఖపట్నం	1,02,450 ▲	92,500 ▲	1,21,000 ▲
రాజమండ్రి	1,00,910 ▲	92,500 ▲	1,12,700 ▲
ప్రొద్దుటూరు	98,200 ▲	90,340 ▲	1,08,700 ▲
ముంబై	99,450 ▲	91,100 ▲	1,09,410 ▲


గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

హైటెక్ సిటీలో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్

- ఆసియా పసిఫిక్‌లో మొదటిది.. ప్రపంచంలో ఐదో కేంద్రం
- ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. దిగ్గజ ఐటీ సంస్థ గూగుల్ తన సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) నగరంలో నెలకొల్పింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే ఇది మొట్టమొదటి జీఎస్ఈసీ కాగా.. ప్రపంచంలో ఐదో కేంద్రం. హైటెక్ సిటీలోని దివ్యశ్రీ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు గర్విస్తున్నానని తెలిపారు. "గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులు" అని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్.. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కాగా, ఈ కేంద్రం హైదరాబాద్ ఐటీ రంగాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

'బ్రహ్మోస్'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయండి

- బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధులను కోరిన సీఎం రేవంత్
- సానుకూలంగా స్పందించిన సంస్థ ఎండీ

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోస్ ఏరో స్పేస్‌ను హైదరాబాద్‌కు విస్తరించాలని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఇప్పటికే హైదరాబాద్‌లో రక్షణ రంగానికి సంబంధించి అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బ్రహ్మోస్ ఏరో స్పేస్ విస్తరణకు తెలంగాణను ఎంచుకోవాలని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం చెప్పారు. ఈ ప్రతిపాదనకు బ్రహ్మోస్ ఎండీ జైతీర్థ్ జోషి సానుకూలంగా స్పందించారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

వాసాలమర్రి ప్రజలకు కేసీఆర్ పంగనామాలు

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం: పొంగులేటి

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దేశానికి దశ, దిశ చూపిస్తానంటూ ప్రగల్భాలు పలికిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తాను దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామ ప్రజలకు పంగనామాలు పెట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆ గ్రామ ప్రజలకు కొత్త ఇల్లు రాక పోగా.. ఉన్న ఇల్లు పోయిందన్నారు. దీంతో వాసాలమర్రిలో అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశామని, ఆ పత్రాలను స్వయంగా తానే గురువారం వారికి అందించనున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వాసాలమర్రిలో సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించి, వారికి మంజూరు పత్రాలు అందించనున్నట్టు తెలిపారు.

సామాన్యులకు అందుబాటులోకి ఇసుక: వివేక్

- గనులు, కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాన్యులకు ఇసుకను అందుబాటులో ఉంచడానికి ఒక పటిష్ఠమైన పాలసీని రూపొందిస్తామని మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రిగా సచివాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమంతో పాటు, గనుల శాఖకు సంబంధించి రాబడి వృద్ధి కార్యక్రమాలను పటిష్ఠంగా చేపడతామని తెలిపారు. తనకు కార్మిక శాఖను కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. తన తండ్రి నిర్వహించిన కార్మిక శాఖను తనకు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టాటా టెక్నాలజీస్‌తో కలిసి రాష్ట్రంలోని ఐటీఐల్లో రూ.2,076కోట్ల వ్యయంతో 46అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. సంబంధిత ఫైలుపై మంత్రి తొలి సంతకం చేశారు.

తాగునీటిపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ 1916

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ ద్వారా సత్వర పరిష్కారం చూపేందుకు కొత్త టోల్‌ఫ్రీ నంబర్ 1916ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ తాగునీటి సమస్య ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఇప్పటికే 1800-599-4007 (11-అంకెల) టోల్‌ఫ్రీ నంబర్ ఉందని, అయితే ఈ నంబర్‌ను డయల్ చేయడంలో ప్రజల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని 4 అంకెల టోల్‌ఫ్రీ నంబర్ 1916ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

'మూసీ'లో భూమి కోల్పోయిన వ్యక్తికి 3 నెలల్లో ప్లాట్ ఇవ్వకపోతే జైలే!

- ఐఏఎస్ అర్వింద్ కుమార్‌కు హైకోర్టు హెచ్చరిక

గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను మూడు నెలల్లో అమలు చేయకపోతే రెండు వారాల జైలు శిక్ష అనుభవించడంతో పాటు రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హైకోర్టు అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను హెచ్చరించింది. మూసీ నది అభివృద్ధి పథకంలో భాగంగా భూములు కోల్పోయిన వారికి అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయిస్తామని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ భూమి కోల్పోయిన తనకు ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయలేదంటూ రాంరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పిటిషనర్‌కు హామీ ఇచ్చిన విధంగా అభివృద్ధి చేసిన ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ప్లాట్‌కు సంబంధించిన హక్కు పత్రాలను మూడు నెలల్లో ఇవ్వకపోతే అర్వింద్‌కుమార్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది.

రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

రైతుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యనేతలతో చర్చించి కార్యాచరణ రూపొందించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో కీలక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీఆర్ఎస్ హయాంలో 90శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని పక్కన బెట్టడం, కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టడం వల్ల లక్షల ఎకరాలకు నీరు అందకపోవడం వంటి అంశాలను నాయకులకు కేసీఆర్ వివరించనున్నట్లు తెలిసింది.

శిల్ప లే అవుట్ వంతెనకు పీజేఆర్ పేరు..!

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వైపు నిర్మించిన శిల్ప లే అవుట్ సెకండ్ లెవల్ వంతెనకు దివంగత పి.జనార్దన్‌రెడ్డి(పీజేఆర్) పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ వంతెనకు పీజేఆర్ పేరు పెట్టాలని సూచించారని మేయర్ గద్వాల విజయలక్ష్మి బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ నెల 28న వంతెనను రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 1.20 కిలోమీటర్ల మేర రూ.178 కోట్లతో ఆరు లేన్లుగా వంతెనను నిర్మించారు.

బనకచర్ల పాపం కేసీఆర్‌దే

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేయలేదని.. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి, కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టుల విషయంలో సర్వ పాపాలు చేసి, పాపాల భైరవులుగా మారి రాష్ట్రానికి అన్యాయం చేశారని దుయ్యబట్టారు. వారే ఇప్పుడు.. 'బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మాట్లాడట్లేదు' అంటూ తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ఏపీ శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడిన వెంటనే తాము కేంద్ర మంత్రిని కలిసి.. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు అన్ని వివరాలనూ తెలిపామని సీఎం చెప్పారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రితోనూ చర్చించామని.. ఇప్పటికే ఈ విషయంలో కేంద్ర జల్‌శక్తి మంత్రికి రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ లేఖలు రాశారని గుర్తుచేశారు. అఖిల పక్ష సమావేశం నిర్వహించడం వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలేవీ లేవన్న సీఎం.. భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికలపై ప్రతిపక్షాలను సూచనలు అడిగినట్టు తెలిపారు. రాజకీయ అంశాలకు అవకాశం ఇవ్వకూడదని భావించే.. ఈ భేటీకి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, బీఆర్ఎస్ పార్లమెంటు సభ్యులను ఆహ్వానించామన్నారు. ఆ సమావేశంలో చర్చించిన పలు విషయాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం పేర్కొన్నారు. "గోదావరి, కృష్ణా జలాలకు సంబంధించి 2016 సెప్టెంబరు 21న నాటి కేంద్ర జలశక్తి మంత్రి ఉమాభారతి అధ్యక్షతన జలశక్తిభవన్, న్యూఢిల్లీలో సమావేశం నిర్వహించారు. అందులో అప్పటి సీఎంలు కేసీఆర్, చంద్రబాబుతో పాటు రెండు రాష్ట్రాల మంత్రులు హరీశ్‌రావు, దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఆ సమావేశంలో గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుల నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణాలపై, అనుమతులపై సుదీర్ఘంగా చర్చించారు. 8 పేజీలతో సమావేశం వివరాలను నమోదుచేశారు. అందులో 6వ పేజీలోని రెండో పేరాలో పేర్కొన్న దాని ప్రకారం "గోదావరి జలాల్లో 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్‌లో నిర్మించుకునే ప్రాజెక్టులకు 1000 టీఎంసీల అవసరం ఉంది. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు నీటిని తరలించుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చ"ని పేర్కొన్నారు. అంటే గోదావరిలో 3వేల టీఎంసీలు వృథా అవుతున్నాయి, వాటిని కృష్ణా పరీవాహక ప్రాంతానికి తరలించి తద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే విషయానికి పునాది పడింది అప్పుడే. ఇది అధికారిక సమావేశంలో చెప్పిన విషయం. ఈ విషయం అప్పటి మంత్రి హరీశ్‌కు తెలియదనడం కరెక్ట్‌కాదు. ఈ వివరాలను హరీశ్‌కు పంపుతా" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే ఆ తరువాత.. కేసీఆర్, చంద్రబాబుల మధ్య ఉన్న వైరాలు, అంతరాల వల్ల అది కార్యరూపం దాల్చలేదన్నారు. 2019లో ఏపీలో జగన్ సీఎం అయ్యాక.. తెలంగాణలో కేసీఆర్ రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. వారిద్దరూ 2019 జూన్ 28, ఆగస్టు, సెప్టెంబరు, మళ్లీ ఆ తరువాత ఏడాది ఆగస్టు నెలల్లో.. మొత్తం నాలుగు సార్లు భేటీ అయ్యారని, ఆ సమావేశాల్లోనే జలబంధం ఏర్పడిందని రేవంత్ వ్యాఖ్యానించారు. అప్పట్లో కేసీఆర్ సొంత పత్రికలో ప్రచురించిన పలు కథనాలను సీఎం విలేకరుల సమావేశంలో చూపించారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించడం ద్వారా 'నష్టం తక్కువ లాభం ఎక్కువ' శీర్షికన ప్రచురితమైన కథనాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.


అఖిలపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్, డీకే అరుణ, అసదుద్దీన్



కేసీఆర్ వలనే బనకచర్ల..

ఏపీ సీఎం చంద్రబాబు మొదలుపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును గతంలో 2016లో చంద్రబాబు, కేసీఆర్ మాట్లాడుకున్న అంశాల ప్రాతిపదికనే ముందుకు తీసుకెళ్తున్నారని రేవంత్ ఆరోపించారు. జగన్ సీఎం అయ్యాక.. అప్పటి మంత్రి రోజా ఇంటిదగ్గర కేసీఆర్ ఏం మాట్లాడారో కూడా అందరూ చూశారని పేర్కొన్నారు. "బేసిన్లు లేవు, భేషజాలు లేవు.. కలిసి పనిచేస్తాం. సమర్థమైన సీఎంగా జగన్ ఉన్నారు. నేను పెద్దన్నగా పూర్తిగా సహకరిస్తా. రాయలసీమను రతనాలసీమగా చేస్తా" అని కేసీఆర్ అప్పుడు చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. శాసనసభలో, వివిధ సందర్భాల్లో.. గోదావరి జలాలను పెన్నా ప్రాంతానికి తరలించడానికి ఆమోదించి, ప్రాజెక్టును ప్రారంభించడానికి అవకాశం కల్పించి, ప్రోత్సహించిందే కేసీఆర్, హరీశ్ అని సీఎం దుయ్యబట్టారు. చంద్రబాబు గోదావరి జలాలను బనకచర్ల వరకూ తరలించడానికి 200 టీఎంసీల ప్రాజెక్టుకు ప్రణాళిక రూపొందించారని.. పరోక్షంగా మరో 100 టీఎంసీలను కలిపి మొత్తం 300 టీఎంసీల ప్రాజెక్టుకు సివిల్ వర్క్‌లు పూర్తి చేస్తున్నారని రేవంత్ తెలిపారు. గతంలో చర్చల సందర్భంగా కేసీఆర్.. 400 టీఎంసీల తరలింపునకు ప్రతిపాదన ఇచ్చారని గుర్తుచేశారు. ఆ ప్రతిపాదనల ప్రకారమే చంద్రబాబు వ్యవహరిస్తే.. మొత్తం 400 టీఎంసీలను తీసుకెళ్లినా ఆశ్చర్యం లేదన్నారు. అందుకే ఈ ప్రాజెక్టు గురించి ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడగానే వెంటనే సాగునీటి మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఢిల్లీ వెళ్లి ఫిర్యాదులు చేశామన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్న తమపై హరీశ్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అలా అనుకుంటే పొరపాటే..

"చంద్రబాబు నాయుడుకు సూచన చేస్తున్నా.. కేంద్రంలో పలుకుబడి ఉంది కాబట్టి ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే పొరపాటే" అని సీఎం రేవంత్ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకునేందుకు తమ ప్రణాళికలు తమకు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తమకు భేషజాలు లేవని.. అందరినీ కలిసి సమస్యను వివరిస్తామని.. అప్పటికీ న్యాయం జరగకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. "గోదావరి జలాల్లో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని చంద్రబాబు నమ్మితే.. 968 టీఎంసీలు వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇవ్వాలి" అన్నారు. కృష్ణా జలాల్లో 500 టీఎంసీలు, గోదావరిలో 968 టీఎంసీలు తెలంగాణ వాడుకునేందుకు అనుమతులు ఇచ్చాక.. ఏపీ ఏ నీరు వాడుకున్నా తమకేమీ అభ్యంతరం ఉండదన్నారు. "చంద్రబాబు దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదు. కృష్ణా గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక.. మిగిలిన నీరు మీరు ఎలాగైనా వాడుకోండి" అని వ్యాఖ్యానించారు. గురువారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలను వివరిస్తామన్న సీఎం.. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. "అఖిల పక్ష భేటీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పిలిస్తే సమయం లేదన్న ఆయన.. బుధవారం సాయంత్రం జలశక్తి మంత్రిని ఎలా కలిశారో.. ఎందుకు ముందే కలిశారో.. ఆ రహస్యాలను ప్రజలకు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. "రేపు మేం కలుస్తామని తెలిసి, ఇవాళ వెళ్లి కలవడం వెనుక ఏం కుట్ర ఉందో? అఖిలపక్ష సమావేశానికి రాకుండా ముందుగానే జలశక్తి మంత్రిని కలవాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని ధ్వజమెత్తారు. చట్టప్రకారం గోదావరి జలాల వినియోగంలో వివాదాలను పరిష్కరించుకునేందుకు బోర్డు ఉందని, సీఎం స్థాయి వరకూ కమిటీలు ఉన్నాయని.. విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. అలాంటి బోర్డుకు ఏపీ ప్రభుత్వం నివేదిక ఇవ్వకుండానే.. కేంద్రంలో పలుకుబడి ఉందని నేరుగా పై నుంచి కిందకు అనుమతులు తీసుకొస్తామంటే వీలుకాదని వ్యాఖ్యానించారు. "బోర్డు అనుమతించాక. పర్యావరణ శాఖ మంత్రిని, ఆర్థిక శాఖ మంత్రిని కలవాలి. అలా కాకుండా పైనుంచే కిందకు అనుమతులు తెస్తామంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు.. మేం అభ్యంతరాలను వ్యక్తం చేయడం వల్లనే ఇవాళ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడింది" అని రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తామని, ఎవరితోనైనా కొట్లాడుతామని సీఎం రేవంత్ తేల్చిచెప్పారు. ఇందులో ఎలాంటి శషభిషలూ లేవన్నారు. సామ, దాన, భేద, దండోపాయాల్లో ప్రస్తుతం తాము మొదటి అంకంలో ఉన్నామన్నారు. గోదావరి-బనకచర్లపై అవసరమైతే ప్రధానమంత్రిని కూడా కలుస్తామన్నారు. అప్పటికీ న్యాయం జరగకపోతే.. న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. ముందుగానే న్యాయస్థానాలను ఆశ్రయిస్తే.. కోర్టు వినదన్నారు. కాగా.. గత పాలనలో పదేళ్ల కాలంలో 96 క్యాబినెట్ సమావేశాలు జరిగాయని.. కానీ, ఒక్క భేటీలో కూడా కాళేశ్వరం అనుమతులపై చర్చ జరగలేదని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలో అంచనాలు పెంచుకునేందుకు మాత్రమే అనుమతులు తీసుకోవడంపై చర్చించారని తెలిపారు.

రాష్ట్రానికి పట్టిన చీడ, పీడ.. 'నమస్తే తెలంగాణ': రేవంత్

'ప్రాజెక్టులపై ప్రభుత్వానికి వ్యూహం ఉందా లేదా?' అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు.. 60 ఏళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యూహం ఉందని, అది ఉండటం వల్లనే ఎస్ఆర్ఎస్పీ, మిడ్ మానేరు, సింగూరు, లోయర్ మానేరు ఇలా పలు ప్రాజెక్టులు నిర్మాణం చేశామని సీఎం బదులిచ్చారు. "రాష్ట్ర విభజన తరువాత అధికారం చేపట్టిన పాలకులు రీడిజైన్ పేరుతో రూ.2 లక్షల కోట్లు కొల్లగొట్టి టీ న్యూస్, నమస్తే తెలంగాణ పేపరు పెట్టారు.. ఇప్పుడు అవే రాష్ట్రానికి పట్టిన చీడ.. పీడ" అని ఆయన దుయ్యబట్టారు.

తల ఎక్కడ పెట్టుకుంటావ్ హరీశ్..

హరీశ్‌రావుకు వయసు మీద పడిందని, ఆయన ఇంకా చిన్నపిల్లవాడు కాదని.. ఇకనైనా చిల్లర పనులు మానుకోవాలని సీఎం రేవంత్ హితవు పలికారు. ప్రాజెక్టుల విషయంలో అన్ని అంశాలనూ తాము బహిర్గతం చేసిన నేపథ్యంలో.. ఇప్పుడు హరీశ్ తన తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. "జీవితాంతం, కుటుంబం అంతా అబద్ధాలు చెప్పుకొంటూనే బ్రతుకుతారా?" అని నిలదీశారు. "కడుపునొప్పికి మందు ఉంది కానీ.. హరీశ్‌రావు అసూయకు మందు లేదు.. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు కాళేశ్వరం అనుమతులు ఎందుకు తెచ్చుకోలేదు? అబద్ధాలు చెబుతూ ప్రజలను నమ్మించాలని చూస్తున్నారు. కానీ, నిజాలు నిప్పులాంటివి. అన్నీ బయటకు వస్తాయి" అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అవయవదానం చేసి.. ఆ పార్టీకి చెందిన 8 మంది అభ్యర్థులు గెలిచేలా బీఆర్ఎస్ పని చేసిందని.. అందుకే, హరీశ్ అబద్ధాలు చెబుతుంటే.. కిషన్‌రెడ్డి పరోక్షంగా సహకారం అందిస్తున్నారని రేవంత్ విమర్శించారు. బుధవారం భేటీకి.. దామోదర్‌రావు, సురేశ్‌రెడ్డి రాలేదని, అమాయకుడు వద్దిరాజు రవిచంద్రని పంపారని అన్నారు. ఆయన కూడా తనకు ఇచ్చిన కాగితంలో ఉన్నవాటినే చదివారని.. తాను కొన్ని విషయాలను లేవనెత్తగానే వెళ్లిపోయారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ.1,500 కోట్లు ఉన్నాయని, ప్రమాదంలో మరణించిన పేదలకు పంచిపెడతారేమోనని 18 నెలల నుంచి చూస్తున్నానని.. కానీ పదిపైసలు కూడా ఇవ్వలేదన్నారు. కాగా.. రాయలసీమకు నీళ్లు ఇచ్చే విషయంపై కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యల వీడియోలను సీఎం రేవంత్ విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు.


సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

ఆ సూత్రం బనకచర్లకూ వర్తిస్తుంది

ఏపీ పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే దానికి బదులుగా 45 టీఎంసీల కృష్ణా జలాలు మనకు రావాల్సి ఉంటుందని.. అఖిల పక్ష సమావేశంలో సీఎం రేవంత్ గుర్తుచేశారు. అదే సూత్రం బనకచర్ల ప్రాజెక్టుకూ వర్తిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గోదావరి-బనకచర్లను 200 టీఎంసీల తరలింపు కోసంచేపడుతున్నప్పటికీ ఆ ప్రాజెక్టు మౌలిక సదుపాయాలు 300టీఎంసీలకు సరిపడా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదిలో 120 రోజుల పాటు నీటిని తరలించడానికి అవసరమైన ఏరాట్లు చేస్తున్నారని తెలిపారు. గోదావరి జలాల తరలింపుపై కేసీఆర్ గతంలో అన్న మాటల గురించి సీఎం ప్రస్తావించినప్పుడు.. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర జోక్యం చేసుకుని.. 'దీనిపై రాజకీయం వద్దు' అన్నారు. దీనికి సీఎం.. తాను రాజకీయ అంశాలు ప్రస్తావించట్లేదని స్పష్టం చేశారు. గోదావరి జలాలను శ్రీశైలానికి, అక్కడి నుంచి రాయలసీమకు అందించాలనేదే కేసీఆర్ ఉద్దేశమని అన్నారు. దాంతో వద్దిరాజు సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. ఆయన బయటకు వెళుతుండగా.. మిగిలిన ఎంపీలు సముదాయించడానికి ప్రయత్నించారు. అప్పుడు సీఎం జోక్యం చేసుకుని.. 'వెళ్లనివ్వండి.. ఆయన ఇబ్బందులు ఆయనవి' అని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ సమస్యను లేవనెత్తుతామన్నారు. గోదావరి -బనకచర్లకు వ్యతిరేకంగా ఎంపీలంతా కలిసి ఒక తీర్మానం చేస్తే, దాన్ని కేంద్రానికి అందిద్దామని సీఎం ప్రతిపాదించారు. రాష్ట్రం ఏర్పడ్డాకా బేసిన్ పారామీటర్, బేసిన్ వెంట నివసిస్తున్న జనాభా ఆధారంగా ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811టీఎంసీల్లో 555 టీఎంసీలను తెలంగాణకు కోరాల్సి ఉండగా.. కేవలం 299 టీఎంసీలు చాలని కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారని.. 2021 దాకా ఈ ఒప్పందం కొనసాగిందని సీఎం మండిపడ్డారు. గోదావరి-బనకచర్లకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకెళతామని సీఎం ప్రకటించారు. ఈ సమయంలో డీకే అరుణ జోక్యం చేసుకొని.. 'ఎందుకు తమ్ముడూ (సీఎంనుద్దేశించి) ఏపీ వాళ్ల అంత స్పీడ్. స్పీడ్‌గా పోతున్నరు'అని ప్రశ్నించగా.. 'ఏపీ వాళ్ల అంతే అక్కా.. వాళ్ల ఉదయం 5 గంటలకు లేస్తే.. మనం 11కు లేస్తాం' అని సీఎం సరదాగా జవాబు చెప్పారు. దాంతోసభ్యులంతా గట్టిగా నవ్వారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును నిలువరించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి, ఫిర్యాదు చేయడానికి.. సీఎం రేవంత్ గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంత్రి ఉత్తమ్ బుధవారం రాత్రికే ఢిల్లీకి చేరుకున్నారు. వీరు గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి, గోదావరి-బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్లకుండా కట్టడి చేయాలని కోరనున్నారు. అలాగే.. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమై.. మెట్రో విస్తరణ సహా పలు అంశాలపై చర్చించనున్నారు. సాయంత్రం.. ఇంగ్లండ్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌ను రేవంత్ మర్యాదపూర్వకంగా కలవున్నారు.

చివరి అస్త్రంగా న్యాయపోరాటం

గోదావరి-బనకచర్లపై తెలంగాణ సర్కారు చొరవకు అఖిలపక్షం మద్దతు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్లపై చివరి అస్త్రంగా న్యాయపోరాటం చేయాలని అఖిలపక్షం ఎంపీలు నిర్ణయించారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం చొరవ, చేస్తున్న పోరాటానికి మద్దతిచ్చారు. ఏపీ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై ఎంపీల అభిప్రాయ సేకరణకు బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రెండున్నర గంటలపాటు జరిగిన అఖిలపక్షం సమావేశంలో వారు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, రఘునందన్‌రావు, బీఆర్ఎస్ నుంచి వద్ది రాజు రవిచంద్ర, మజ్లిస్ తరఫున అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నుంచి రేణుకాచౌదరి, మల్లురవి, సురేశ్ షెట్కార్, బలరాంనాయక్, రవికుమార్ యాదవ్, రామసహాయం రఘురామిరెడ్డి, రఘువీర్ రెడ్డి, జి.వంశీ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. డీకే అరుణ, రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బనకచర్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేయదని భావిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ అన్యాయం జరిగితే.. సంఘటితంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. గోదావరి, కృష్ణాల్లో ఏయే ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉంది? ప్రతిబంధకాలేంటి? అని వారు అడగ్గా.. మధ్యలో జోక్యం చేసుకున్న సీఎం.. "ఆ వివరాలను ఎంపీలందరికీ పంపుతాం" అని స్పష్టం చేశారు. మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ సహా.. కేంద్రానికి ఫిర్యాదులు చేసి, అన్ని వేదికలను ఆశ్రయించాకే.. చివరి అస్త్రంగా న్యాయపోరాటం చేద్దామని అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి బోర్డుల సమావేశంలోనూ ఈ అంశాన్ని లేవనెత్తి, పర్యావరణ అనుమతులు రాకుండా కేంద్ర నిపుణుల మదింపు కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అభిప్రాయాలను రేణుకాచౌదరి సమర్థించారు.

పోతిరెడ్డిపాడు ఆగదు: ఉత్తమ్ ఆందోళన

గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును నిర్మించి, గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీకి తరలించినా.. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు కృష్ణా జలాల అక్రమ తరలింపును యథాతథంగా కొనసాగిస్తామని ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)లో ఏపీ ప్రభుత్వం పేర్కొందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. 2014 నాటి గోదావరి జలాల వినియోగం ఆధారంగా ఏపీ పీఎఫ్ఆర్ తయారు చేసిందని అభ్యంతరం తెలిపారు. 2014 తర్వాతికాలంలో నికర జలాల ఆధారంగా గోదావరిపై తెలంగాణలో నిర్మించిన సమ్మక్క సాగర్, సీతారామ, సీతమ్మసాగర్ వంటి ప్రాజెక్టుల నీటి అవసరాలను ఈ నివేదిక పరిగణలోకి తీసుకోలేదని తప్పుబట్టారు. గోదావరి-బనకచర్ల అనుసంధానంపై ఆయన ఎంపీలకు ప్రజెంటేషన్ ఇచ్చారు. "ఏపీ సమర్పించిన ఈ నివేదికను గోదావరి పరీవాహకంలోని రాష్ట్రాలతోపాటు కృష్ణా, గోదావరి బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)లకు కేంద్రం పంపించి.. 15 రోజుల్లోగా అభిప్రాయాలను తెలపాలని కోరింది. ఏపీ పీఎఫ్ఆర్‌లో 968 టీఎంసీల తెలంగాణ హక్కులను విస్మరించారు. జీ10, జీ11 సబ్-బేసిన్లలో రాష్ట్ర హక్కుల ప్రస్తావన లేదు. నికర, మిగులు జలాల ఆధారంగా భవిష్యత్తులో తెలంగాణ చేపట్టనున్న ప్రాజెక్టులకు 'బనకచర్ల' ప్రాజెక్టు ముప్పుగా పరిణమించబోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. తొలుత ప్రాజెక్టులను నిర్మించి, ఆ తర్వాత హక్కులు అడుగుతారని మండిపడ్డారు. బనకచర్లను నిర్మిస్తే.. భవిష్యత్‌లో ఏర్పాటయ్యే గోదావరి ట్రైబ్యునల్ ఎదుట ఇదే వాదనలను వినిపించి, నికర జలాలను కోరే ప్రమాదముందన్నారు. దిగువ ప్రాంతం కావడంతో వరద జలాలపై తమకే ఎక్కువ హక్కులుంటాయనే ఏపీ వాదన చట్ట విరుద్ధమన్నారు. పోలవరం ఆపరేషన్స్‌లో మార్పులను ఉత్తమ్ తప్పుబట్టారు. "బనకచర్లకు పోలవరం నుంచి నీటిని తరలిస్తామని ఏపీ ప్రతిపాదించిన నేపథ్యంలో సీడబ్ల్యూసీ, టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) ఆమోదించిన పోలవరం ఆపరేషన్స్ షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 90 కింద ఏర్పాటైన పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) టీఏసీ అనుమతులకు కట్టుబడి ఉండాలి. ఈ నేపథ్యంలో పీపీఏ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలను తిరస్కరించాలి" అని డిమాండ్ చేశారు. టీఏసీ అనుమతుల్లేకుండా.. బనకచర్ల ప్రాజెక్టును చేపట్టేందుకు వీలుండదని స్పష్టం చేశారు. బనకచర్లను నిర్మిస్తే.. పోలవరంతో తెలంగాణలో ముంపు సమస్య మరింత తీవ్రం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం పట్టణంతోపాటు.. మణుగూరు భారజల ప్లాంట్లకు ప్రమాదం పొంచిఉంటుందన్నారు. తెలంగాణకు అన్ని విధాలుగా అన్యాయం జరిగే బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా.. ముందుకు వెళ్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ దీనిపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ఫిర్యాదు చేయగా.. సానుకూలంగా స్పందించారని, అయితే.. ఏపీ ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టును కేంద్రం తిరస్కరించాలని డిమాండ్ చేశారు. "2018లో గోదావరిలో నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ తేల్చింది. దాంతో.. గోదావరి-కావేరీ అనుసంధానానికి కేంద్రం ప్రతిపాదించింది. అది జరిగి ఉంటే తెలంగాణకు ప్రయోజనం కలిగేది. అయితే.. గత బీఆర్ఎస్ సర్కారు దీన్ని వ్యతిరేకించింది" అని తప్పుబట్టారు. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు, వాటి అవసరాలపై గోదావరి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్‌లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బనకచర్ల ప్రాజెక్టు గురించి వివరించారు. పోలవరం ద్వారా 485.2 టీఎంసీల తరలింపునకు మాత్రమే అనుమతి ఉండగా, మరో 200 టీఎంసీలు తీసుకెళ్లడానికి బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించారని సుబ్రమణ్య ప్రసాద్ తెలిపారు. సమావేశం ముగింపులో ఉండగా.. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వాకౌట్ చేశారు.

పని ఒత్తిడి తట్టుకోలేక చార్టెడ్ అకౌంటెంట్ ఆత్మహత్య

రాయదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తట్టుకోలేక ఓ చార్టెడ్ అకౌంటెంట్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కామారెడ్డికి చెందిన సురేశ్ రెడ్డి(28) మణికొండలో సోదరుడితో ఉంటూ స్థానికంగా ఓ కంపెనీలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న సోదరి ఇంటికి వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. బుధవారం కొండాపూర్ రాజరాజేశ్వర్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రూమ్‌ను అద్దెకు తీసుకున్నాడు. గదిలోకి హీలియం గ్యాస్ సిలెండర్‌ను తీసుకువెళ్లి ముఖానికి కవర్ కట్టుకుని హీలియం గ్యాస్ పీల్చి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఓ డైరీని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసిఉంది.


సురేశ్ రెడ్డి (ఫైల్)


ఆర్టీసీ తొలి మహిళా కండక్టర్లను సన్మానించిన సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

టీజీఎస్ ఆర్టీసీ తొలి మహిళా కండక్టర్లకు సన్మానం

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో తొలి మహిళా కండక్టర్లు అయిన ముగ్గురిని సంస్థ యాజమాన్యం బుధవారం సన్మానించింది. కండక్టర్‌గా 28 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన శ్రీదేవి, అనిత, మెహిదీపట్నం డిపోకు చెందిన శారదను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా రవాణా రవాణా వ్యవస్థలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఈ ముగ్గురిని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో సత్కరించింది. ఈ నేపథ్యంలో శ్రీదేవి, అనిత, శారద సేవలు కొనియాడుతూ టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కూడా సన్మానించింది.

కేంద్రం పరిశీలనలో మెట్రో ఫేజ్-2 డీపీఆర్

- కిషన్‌రెడ్డితో భేటీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్

న్యూఢిల్లీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం పంపిన డీపీఆర్ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పరిశీలనలో ఉందని ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని శ్రమశక్తిభవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో బుధవారం జరిగిన భేటీలో ఖట్టర్ వ్యాఖ్యానించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల స్థితిపై ఇరువురు నేతలు ఈ భేటీలో చర్చించారు. అలాగే, హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారంపై కూడా మాట్లాడుకున్నారు.

ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగనివ్వం:సీఆర్ పాటిల్

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి - బనకచర్ల లింకు ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరనివ్వబోమని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేశారు. శ్రమశక్తి భవన్‌లో ఆయనతో సమావేశమైన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.. ఏపీ సర్కారు నిర్మించ తలపెట్టిన గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్టు పూర్వాపరాలను చర్చించారు. నిబంధనలకనుగుణంగా పరిశీలించి, అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించి పారదర్శకంగా నిర్ణయిస్తామని సీఆర్ పాటిల్ తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఎటువంటి నష్టం వాటిల్లనివ్వబోమని భరోసానిచ్చారు.

రేవంత్‌రెడ్డి పేపర్ టైగర్: కవిత

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నల్లమల పులిబిడ్డనంటూ గొప్పగా చెప్పుకొనే.. రేవంత్‌రెడ్డి ఆ ప్రాంతానికి నష్టం కలిగించేలా ఏపీ జల దోపిడీకి పాల్పడుతుంటే బనకచర్ల ప్రాజెక్టుపై ఎందుకు మాట్లాడడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. తెలంగాణకు నష్టం జరుగుతున్నా పట్టించుకోని ఆయన పులిబిడ్డ కాదు.. కేవలం పేపర్ టైగర్ మాత్రమేనని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు. గోదావరి జలాలను తరలించుకు వెళ్లేందుకు కేసీఆర్ ఒప్పుకొన్నారని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి బీసీబిల్లును సాధించేందుకు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జూలై 17న రాష్ట్రంలో రైల్ రోకో కార్యక్రమం చేపడతామన్నారు.

కిషన్‌రెడ్డిది బాధ్యతా రాహిత్యం:చామల

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై ఏపీ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయమై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతగా వ్యవహరించడం లేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గోదావరి జలాల వినియోగంపై తెలంగాణకు నష్టం జరగకుండా చూడాలని కిషన్‌రెడ్డిని కోరారు. బనకచర్ల ప్రాజెక్టుపై రాష్ట్రం నుంచి ఎన్నికైన 8 మంది బీజేపీ ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గోదావరి నదిపై ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుపై అవగాహన కోసం మంత్రి ఉత్తమ్.. అఖిలపక్ష పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించడం మంచి పరిణామమన్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ వక్రీకరణ:హరీశ్

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు- నాటి సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ వక్రీకరించారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం వక్రబుద్ధితో సీఎం ప్రజల ముందు అసత్యాలు ఉంచారని, కానీ ఆయనకు తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలన్న తపనే లేదని 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అపెక్స్ కౌన్సిల్ సమావేశ అజెండా-5ను దాచి పెట్టి, అజెండా-1 అంశాలే ప్రస్తావించారని హరీశ్ చెప్పారు. గోదావరి- కృష్ణా నదుల అనుసంధాన ప్రాజెక్టులపై ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణను సంప్రదించకుండా ముందుకెళ్లరాదని అజెండా-5లో నాడు కేసీఆర్ స్పష్టంగా పేర్కొన్నారని వెల్లడించారు.

రేవంత్ తన గురువుతో మాట్లాడాలి

- బీజేపీని దోషిగా నిలబెట్టేందుకు ఉత్తమ్ నాటకాలు
- బనకచర్లపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు: అర్వింద్

హైదరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఏపీ చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో బీజేపీని దోషిగా నిలబెట్టేందుకు మంత్రి ఉత్తమ్ ఉత్తరాలు రాస్తూ ఫోన్లు చేస్తూ కొత్త నాటకమాడుతున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. 'చంద్రబాబు కాలేజీలోనే చదివానని చెప్పుకుంటున్న సీఎం రేవంత్ ... గురువుకు తెలంగాణకు జరుగుతున్న నష్టాన్ని వివరించాలని సూచించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు ఆమోదం పలికారన్నారు. కాంగ్రెస్ నాయకులు నీటిపారుదల గురించి అవగాహన లేకుండా బీజేపీపై బురద చల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. ఇంకా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ మీద ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. కానీ కాంగ్రెస్ తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 'ఇదంతా కేసీఆర్ డైరెక్షన్‌లో ఉత్తమ్ చేస్తున్న పని. దానికి నిదర్శనం ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కేసీఆర్ చెప్పినట్లే సీట్లు కేటాయించారు. అతను సగం కాంగ్రెస్, సగం బీఆర్ఎస్ నాయకుడ'ని అర్వింద్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ మార్గదర్శకాలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటుందని, తెలంగాణకు అన్యాయం చేయబోదని ఆయన స్పష్టం చేశారు.

నేనున్న క్యాబినెట్ ముందుకు కాళేశ్వరం తుది నివేదిక రాలేదు

- కమిషన్ ముందు ఈటల అబద్ధాలు: తుమ్మల
- 'ముఖాముఖి'లోనూ పాల్గొన్న మంత్రి

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తాను ఉన్న మంత్రివర్గం ముందుకు కాళేశ్వరం ప్రాజెక్టు తుది నివేదిక రాలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ మంజూరు అంశమూ క్యాబినెట్ ముందుకు రాలేదని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఈటల రాజేందర్ అసత్యాలు మాట్లాడారన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో తుమ్మల కాసేపు చిట్ చాట్ చేశారు. కాళేశ్వరం కమిషన్ మంగళవారం రాసిన లేఖ ప్రభుత్వానికి అందిందని, బహుశా వివరాలను ప్రభుత్వం కమిషన్‌కు ఇప్పటికే ఇచ్చి ఉంటుందని చెప్పారు. ప్రాణహితతో పాటుగా అన్ని పెండింగ్ ప్రాజెక్టులపై సబ్ కమిటీ వేశారన్నారు. రైతు భరోసా విషయంలో బీఆర్ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని తుమ్మల ఓ ప్రకటనలో మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం రోజుల తరబడి, నెలల తరబడి రైతు బంధు నగదు బదిలీ చేపట్టిన సందర్భాలున్నాయని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు రోజుల వ్యవధిలో రూ.5 వేల కోట్లకు పైగా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించిందని చెప్పారు.

50కి పైగా వినతి పత్రాల స్వీకరణ

గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి తుమ్మల వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు మంత్రితో ముఖాముఖిలో పాల్గొని.. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించానని చెప్పారు. జిల్లా కలెక్టర్లు సహా పలువురు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలంటూ సూచించానని తెలిపారు. మొత్తం 50 మందికి పైగా బాధితుల నుంచి వినతి పత్రాలు స్వీకరించినట్లు వెల్లడించారు. కాగా.. 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాత, సాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ పాల్గొని బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.


గాంధీభవన్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి తుమ్మల

ట్యాపింగ్‌కు అనుమతించారా?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారా? ఆ ఫోన్ నంబర్లన్నీ మావోయిస్టులు, ఉగ్రవాద ఆపరేషన్ల కేసులకు సంబంధించినవని నోట్‌లో పేర్కొన్నారా?' తదితర అంశాలపై సమాధానాలు తీసుకున్నట్టు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ప్రభాకర్‌రావు ఎస్ఐబీ చీఫ్ హోదాలో అధీకృత అధికారి కావడంతో.. ఆ విభాగం నుంచి వచ్చిన లేఖలకు అనుమతి ఇచ్చామని జితేందర్, అనిల్‌కుమార్ సమాధానం ఇచ్చినట్టు సమాచారం. ఇక మాజీ డీజీపీలు మహేందర్ రెడ్డి, అంజనీకుమార్, ప్రస్తుత హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తాలకు కూడా ప్రశ్నావళి పంపేందుకు సిట్ అధికారులు సిద్ధమైనట్టు తెలిసింది. నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ నుంచి కూడా సమాచారాన్ని సేకరించాలని భావిస్తున్నట్టు సమాచారం.

షర్మిల, వైసీపీ నేతల ఫోన్లు ట్యాపింగ్..

తెలంగాణ పోలీసులు తన అన్న జగన్ కోసం.. తన ఫోన్‌ను, తన భర్త అనిల్‌కుమార్, పలువురు వైసీపీ నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారని వైఎస్ షర్మిల ఆరోపించారు. అయితే ప్రభాకర్‌రావు బృందం షర్మిలతోపాటు వైసీపీ నాయకులు కాసు మహేశ్‌రెడ్డి, కోటంరెడ్డి వినయ్‌కుమార్‌రెడ్డి ఫోన్లను ట్యాప్ చేసినట్టుగా సిట్ తేల్చినట్టు సమాచారం. రివ్యూ కమిటీకి అధికారికంగా తప్పుడు సమాచారం ఇవ్వడంతోపాటు ఎలాంటి అనుమతులు లేకుండా వేల మందిపై నిఘా కొనసాగించిందని గుర్తించినట్టు తెలిసింది. టెలికాం సర్వీసు ప్రొవైడర్ల వాంగ్మూలాలను సైతం సిట్ అధికారులు నమోదు చేసినట్టు సమాచారం.

మరికొందరి వాంగ్మూలాల నమోదు..

మరోవైపు సిట్ మరికొందరు ఫోన్ ట్యాపింగ్ బాధితుల వాంగ్మూలాలను బుధవారం నమోదు చేసింది. సీఎం రేవంత్ ముఖ్య అనుచరుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి డ్రైవర్ జగదీశ్వర్, పొలిటికల్ స్ట్రాటజిస్టు గుండ్లపల్లి సైదులుతోపాటు గాంధీభవన్‌కు చెందిన కొందరు ఉద్యోగుల వాంగ్మూలాలను సిట్ అధికారులు నమోదు చేశారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌తోపాటు ముగ్గురు ప్రధాన అనుచరులు ప్రేమ్‌కుమార్, గుండా నిరంజన్, కపిల్‌ల ఫోన్లు సైతం ట్యాప్ అయినట్టు సిట్ గుర్తించింది. దీనికి సంబంధించి నిరంజన్ నుంచి వాంగ్మూలం తీసుకుంది. ఇక గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనపై పోలీసు నిఘా ఉందని గుర్తించిన పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి.. తన డ్రైవర్ జగదీశ్వర్ ఫోన్ నుంచి అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సునీల్ కనుగోలు, పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలతో మాట్లాడారు. కానీ ప్రభాకర్‌రావు బృందం జగదీశ్వర్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేసినట్టుగా సిట్ అధికారులు గుర్తించారు. ఇక ముగ్గురు బీజేపీ ఎంపీల వాంగ్మూలం కోసం కూడా సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మరోవైపు బాధితుల్లో చాలామంది ప్రముఖులు సిట్ విచారణకు సహకరించడం లేదని.. జరిగిందేదో జరిగిపోయింది, ఇప్పుడు వాంగ్మూలాలు ఎందుకని పేర్కొంటున్నట్టు తెలిసింది. ఇలా వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించినవారిలో సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నట్టు సమాచారం.

ప్రణీత్‌రావును ప్రశ్నించిన అధికారులు

ట్యాపింగ్ చేసిన స్పెషల్ ఆపరేషన్ టీమ్‌కు బాస్‌గా వ్యవహరించిన ప్రణీత్‌రావును సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఈ నెల 22న ప్రభాకర్‌రావును మరోసారి విచారించనున్న నేపథ్యంలో కొన్ని అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి ప్రణీత్‌రావును ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారమిచ్చి అనుమతులు పొందిన వైనంపై ఈసారి విచారణలో ప్రభాకర్‌రావును ప్రశ్నించాలని సిట్ భావిస్తున్నట్టు సమాచారం.

ట్యాపింగ్ ముమ్మాటికీ నిజం

- నా ఫోన్ రికార్డు ఆడియోను అప్పట్లో వైవీ వినిపించారు :షర్మిల



విశాఖపట్నం: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాల హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లు జరిగిన మాట ముమ్మాటికీ వాస్తవమేనని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. అల్లూరి జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చిన ఆమె విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడారు. తన ఫోన్ ట్యాపింగ్ చేసి, రికార్డు చేసిన ఆడియోను వైవీ సుబ్బారెడ్డి స్వయంగా తనకు వినిపించారని తెలిపారు. అయితే తన రాజకీయ భవిష్యత్తును నాశనం చేయడానికి కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి చేసిన అరాచకాలకంటే ట్యాపింగ్ చిన్నదిగా అనిపించడంతో ఆ సమయంలో ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కేటీఆర్, కేసీఆర్‌తో జగన్‌కు ఉన్న సంబంధం ముందు రక్తసంబంధం కూడా చిన్నబోయిందని ఆమె ఎద్దేవా చేశారు. తనను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగనీయకుండా, భవిష్యత్తును నాశనం చేసేందుకు జగన్ ఎన్నో కుట్రలు చేశారని, అందులో ఫోన్‌ట్యాపింగ్ కూడా భాగమేనని షర్మిల పేర్కొన్నారు. చెల్లి విషయంలో ఏ అన్నా చేయనన్ని ఘోరాలు నా విషయంలో జగన్ చేశారని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సమయంలో జగన్‌కు సంబంధం లేకపోయినా తనను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. తనకు జగన్‌తో వ్యక్తిగత కక్షలు ఉండి ఉంటే, ఎంవోయూ రాసిచ్చి, వాటిని అమలుచేయడం లేదని అప్పుడే ఫిర్యాదు చేసేదాన్నని, సొంత తల్లినే కోర్టుకు ఈడ్చిన వ్యక్తి జగన్ అని ఆమె విమర్శించారు. ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఎటువంటి విచారణకు పిలిచినా హాజరవుతానని స్పష్టం చేశారు.

పాత ఫోన్ నా దగ్గర లేదు

- గత ఏడాది కొత్త ఫోన్ తీసుకున్నా
- ఫోన్, ల్యాప్‌టాప్ ఎందుకడిగారో.. మీరు ఇచ్చిన నోటీసులో చెప్పలేదు
- ఏసీబీకి కేటీఆర్ లేఖ



హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏసీబీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. "నేరం జరిగిన సమయంలో మీరు వాడిన ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అప్పగించండి" అంటూ తనకు వచ్చిన నోటీసుపై ఆయన తన లేఖలో స్పందించారు. అప్పట్లో తాను వినియోగించిన ఫోన్ తన వద్ద లేదని స్పష్టం చేశారు. పాత ఫోన్ ప్రస్తుతం తన వద్ద లేదని, గత ఏడాది కొత్త ఫోన్ తీసుకుని అదే వాడుతున్నానని తెలిపారు. తాను ఉపయోగించిన ఎలక్ట్రానిక్ పరికరాలను ఎందుకు అడుగుతున్నారు ? అనే విషయాన్ని ఏసీబీ తన నోటీసులో పేర్కొనలేదనే విషయాన్ని కేటీఆర్ లేఖలో ఎత్తి చూపారు. ఫార్ములా ఈ కారు రేసు విచారణకు అవసరమైన అన్నిరకాల అధికారిక సంప్రదింపుల రికార్డులన్నీ రాష్ట్ర ప్రభుత్వంలోని పురపాలక శాఖ వద్దే ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఇక, ఫిర్యాదులో కానీ, తనపై చేసిన ఆరోపణల్లో కానీ గతంలో తాను వాడిన ఎలక్ట్రానిక్ పరికరాల ప్రస్తావన ఎక్కడా లేదని తెలిపారు. అయినా, ఆయా ఎలక్ట్రానిక్ పరికరాలను సమర్పించాలని కోరడం.. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. అయినా సరే.. విచారణలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించాల్సి వస్తే గౌరవ సుప్రీంకోర్టు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

పెరిగిన రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం

ఏప్రిల్, మే లో 3 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్

గత ఆర్థిక సంవత్సరం తొలి 2 నెలల్లో 2.74 లక్షల దస్తావేజులు రిజిస్టర్

హైదరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈసారి తొలి 2 నెలల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెరిగింది. దస్తావేజుల సంఖ్య కూడా పెరిగింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తొలి 2 నెలల్లోనే 3.04 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా రూ.2574.58 కోట్ల ఆదాయం సమకూరింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలలో 2.74 లక్షల దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. 2024-25 ఏడాదిలో తొలి 2 నెలలకుగాను రూ.2,194.53 కోట్లు ఆదాయం వచ్చింది. వ్యవసాయ క్రయవిక్రయాలు ఈ ఏడాది పెరిగాయి. 2024-25 ఏడాదిలో ఏప్రిల్ నెలలో 37,623 వ్యవసాయ దస్తావేజులు రిజిస్టర్ కాగా ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఈసంఖ్య 42,543 పెరిగింది. వ్యవసాయేతర క్రయ విక్రయాల్లో గత ఏడాది ఏప్రిల్ నెలలో 86,534 దస్తావేజులు రిజిస్టర్ కాగా, ఈ ఏడాది 100369 రిజిస్టర్ అయ్యాయి.

భూముల విలువలు పెరుగుతాయని..

రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన స్లాట్ బుకింగ్ విధానం రిజిస్ట్రేషన్లు పెరగడానికి ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు. మొదటి దశలో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10 నుంచి జూన్ 1 వరకు స్లాట్ బుకింగ్ అమలు చేయగా 30,592 దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. రెండో దశలో మే 12 నుంచి 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తేవడంతో 14099 దస్తావేజులు రిజిస్టర్ అయ్యాయి. త్వరలో భూముల విలువలు పెరుగుతాయనే ప్రచారం కూడా జరుగుతుండటంతో క్రయ విక్రయాలు పెరిగాయని రిజిస్ట్రేషన్ శాఖ అంచనా వేస్తోంది.

మోడల్ గోశాలల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా: రాజాసింగ్

కాగితాలకే పరిమితం కాకూడదు : వీహెచ్‌పీ

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నాలుగు మోడల్ గోశాలలు నిర్మించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. అందుకు విధివిధానాలపై కమిటీని వేసేందుకు నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఆవులు, దూడలను వేల సంఖ్యలో వధ శాలల్లో అక్రమంగా చంపుతున్నారని, నివారించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో గో రక్షణకు ఒక స్పెషల్ పోలీస్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, అందులో సభ్యునిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. గో సంరక్షణకు సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం పట్ల విశ్వహిందూ పరిషత్ హర్షం వ్యక్తంచేసింది. ఈమేరకు వీహెచ్‌పీ తెలంగాణ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తదితరులు ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే ఇది ఆచరణ రూపం దాల్చాలని సూచించారు.

టోలు తీస్తున్న ఆర్టీసీ

అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో టికెట్ రేట్లు రూ.10 పెంపు

సుభాష్‌నగర్/పెద్దపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) టోల్ ట్యాక్స్ పెంచిందన్న సాకుతో ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులపై అదనపు చార్జీల భారాన్ని మోపుతోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా టోల్ గేట్లు ఉన్న రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సుల నుంచి టోల్‌గేటుకు రూ.10 చొప్పున ప్రయాణికుల నుంచి వసూలు చేస్తోంది. తాజాగా రేషనలైజేషన్ పేరిట రాష్ట్రంలోని అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్లో టికెట్ రేట్లను రూ.10 పెంచింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే మూడు టోల్‌గేట్లు దాటాల్సి ఉండటంతో ఇప్పటికే ఉన్న టికెట్ రేటుకు అదనంగా ఆర్టీసీ ప్రయాణికుల నుంచి రూ.30 వసూలు చేస్తోంది. గతంలో హైదరాబాద్‌కు ఏసీ బస్సుల్లో టికెట్ రూ.430 ఉండగా ప్రస్తుతం రూ.460 వసూలు చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో టికెట్ రూ.360 ఉండగా 390కి పెంచారు. హైదరాబాద్ నుంచి రామగుండం వెళ్లే మార్గంలోనూ 3 టోల్‌గేట్లు ఉన్నాయి. ఈ మార్గంలోనూ ప్రయాణికుల నుంచి అదనంగా రూ.30వసూలు చేస్తున్నారు. తాజాగా కిలోమీటర్ల రేషనలైజేషన్ పేరిట అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో టికెట్ల రేట్లను ప్రస్తుత చార్జీలతో సంబంధం లేకుండా రూ.10చొప్పున పెంచారు. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వరకు ఎక్స్‌ప్రెస్ టికెట్ రూ.60 నుంచి రూ.70కి పెంచారు. కరీంనగర్ నుంచి మంథని వరకు రూ.100 నుంచి 110కి పెంచారు. గతంలో చిల్లర సమస్య సాకుతో టికెట్ రేట్లను రౌండ్ ఫిగర్ చేస్తున్నామని చెప్పి చార్జీలను పెంచారు. కరోనా పేరిట మూడుసార్లు రూ.5 చొప్పున పెంచారు. ఎలక్ట్రికల్ బస్సుల్లో గ్రీన్ టాక్స్ పేరిట అదనంగా రూ. 10 వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ తాజా నిర్ణయంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అసలే బస్సుల్లో కూర్చునేందుకు సీట్లు లేవంటే టికెట్ రేట్లను పెంచడం ఏంటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి.. పురుషులపై అదనపు భారం మోపడంపైనా విమర్శలు వస్తున్నాయి. టికెట్ల పెంపుపై నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జ్యోత్స్నను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎన్‌హెచ్ఏఐ టోల్ టాక్స్ పెంచడం వల్లనే టికెట్ల ధరలను పెంచినట్లు ఆమె తెలిపారు.

నా.. అనుకున్న వారే హంతకులు!!

ప్రియుడితో మాట్లాడుతుంటే మందలించాడని తల్లితో కలిసి తండ్రిని చంపిన కుమార్తెలు

- తాడుతో కాళ్లూచేతులు కట్టేసి కొట్టి హత్య
- వారికి కూతురి ప్రియుడి, బంధువుల సాయం
- భూమి అమ్మనివ్వడం లేదని తండ్రిని చంపిన కొడుకు
- భూవివాదంలో అన్నయ్యను చంపిన తమ్ముళ్లు
- రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

మరిపెడ, కందుకూరు, సీరోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూతురు ప్రియుడితో ఫోన్లు మాట్లాడుతుంటే మందలించిన తండ్రిని కొట్టిచంపిన భార్యాబిడ్డలు.. భూమి అమ్మకాన్ని అడ్డుకుంటున్నాడని కన్నతండ్రినే కొట్టి చంపేసిన కొడుకు.. భూవివాదంలో కత్తులు, కర్రలతో దాడి చేసి అన్నను చంపిన తమ్ముళ్లు..!! కుటుంబం అనే బంధానికి విలువ తగ్గిపోతోందనే మాటకు బలాన్ని ఇచ్చేలా ఉన్న ఈ దారుణ ఘటనలు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం వెలుగు చూశాయి. పోలీసులు, స్థానికుల కథనాల ప్రకారం ఆయా ఘటనల వివరాలిలా ఉన్నాయి.

భార్యాబిడ్డలే ప్రాణం తీశారు


కిషన్‌ను తాడుతో కట్టేసిన దృశ్యం

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్ఆర్ జెండాల్ తండాకు చెందిన దరావత్ కిషన్(42)కు భార్య జంగ్లి, కుమార్తెలు రమ్య, పల్లవి ఉన్నారు. కిషన్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. డిగ్రీ విద్యార్థిని అయిన కిషన్ చిన్న కుమార్తె పల్లవి.. భూక్య సురేష్ అనే యువకుడితో ప్రేమలో ఉంది. నిత్యం సురేష్‌తో ఫోన్లు మాట్లాడుతుంది. ఈ విషయంలో కిషన్ తన కుమార్తె పల్లవిని మందలించాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య జంగ్లి, కుమార్తెలు రమ్య, పల్లవి, ఆమె ప్రియుడు భూక్య సురేష్, బంధువులు బోడ చందు, బోడ దేవేందర్ కలిసి ఆదివారం రాత్రి కిషన్ కాళ్లూచేతులూ కట్టేసి తీవ్రంగా కొట్టారు. అనంతరం చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా కిషన్ మంగళవారం రాత్రి మరణించాడు.

భూమి అమ్మకానికి అడ్డొస్తున్నాడని..


జంగయ్య (ఫైల్)

రంగారెడ్డి జిల్లా పులిమామిడి గ్రామానికి చెందిన పసుపుల జంగయ్య(65), పద్మమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కొడుకు శేఖర్ ఉన్నారు. జంగయ్య.. గ్రామంలో స్లాబ్ వరకు ఇంటి నిర్మాణం చేసి కొడుకు శేఖర్‌కు ఇచ్చి గోడలు నిర్మించుకోవాలని చెప్పాడు. ఇంటి నిర్మాణానికి తన తండ్రి పేరిట ఉన్న 20గుంటల భూమిని అమ్మాలని శేఖర్ అనుకున్నాడు. దీనికి జంగయ్య ఒప్పుకోకపోవడంతో మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి భోజనం అనంతరం జంగయ్య.. నిర్మాణంలో ఉన్న తమ ఇంటి వద్ద నిద్రపోగా, అతని భార్య పద్మమ్మ అదే గ్రామంలో ఉన్న తన రెండో కూతురి ఇంటికి వెళ్లింది. పద్మమ్మ బుధవారం తెల్లవారుజామున తిరిగొచ్చి భర్తను చూసే సరికి తలకు రక్తగాయాలై విగతజీవిగా పడిఉన్నాడు. గ్రామస్తులు శేఖర్‌ను నిలదీయగా.. తండ్రిని తానే చంపానని ఒప్పుకున్నాడు.

అన్నను చంపిన తమ్ముళ్లు


వల్లపు కృష్ణ (ఫైల్)

మహబూబాబాద్ జిల్లా సీరోలుకు చెందిన వల్లపు లింగయ్య మొదటి భార్య మాణిక్యమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు కృష్ణ(43) ఉన్నారు. మాణిక్యమ్మ మరణంతో లింగయ్య.. నర్సమ్మను రెండో వివాహం చేసుకోగా కుమారులు నరేష్, మహేష్ ఉన్నారు. లింగయ్య తనకున్న 16 ఎకరాల వ్యవసాయ భూమిలో 12 ఎకరాలను తలా నాలుగు ఎకరాల చొప్పున ముగ్గురు కొడుకులకి ఇచ్చాడు. మిగిలిన నాలుగు ఎకరాలను తన వద్దే ఉంచుకున్నాడు. ఈ భూముల విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే కృష్ణ.. తన వాటా భూమిని కౌలుకు ఇవ్వగా.. నరేష్, మహేష్ కౌలుకు తీసుకున్న వ్యక్తిని బెదిరించడంతో ఆ భూమి బీడుగా మారింది. ఈసారి ఎలాగైనా తన భూమిని కౌలుకి ఇవ్వాలని కృష్ణ హైదరాబాద్ నుంచి తన భూమి వద్దకు రాగా.. నరేష్, మహేష్ తమ భార్యలు, బంధువులతో కలిసి అక్కడికి చేరుకుని ఘర్షణకు దిగారు. కత్తులు, కర్రలతో కృష్ణపై దాడి చేసి అతని ప్రాణం తీసి పరారయ్యారు. అడ్డుకున్న తండ్రి లింగయ్యపై కూడా దాడి చేసి గాయపరిచారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.